మంగళవారం 25-4-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 33
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



సన్‌రైజర్స్‌కు షాక్
హైదరాబాద్‌పై ఏడు పరుగులతో గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్.
-12లో



సెన్సెక్స్ మళ్లీ 60,000 పైకి..
401 పాయింట్లు ప్లస్
నిఫ్టీ 119 పాయింట్లు అప్
-13లో



వైఎస్ షర్మిల అరెస్ట్.. రిమాండ్
పోలీసులపై చేయి చేసుకున్నారని ఆరోపిస్తూ వైఎస్ షర్మిలను పోలీసులు అరెస్టు చేశారు. నాంపల్లి కోర్టు ఆమెకు 14 రోజుల రిమాండ్ విధించింది. కాగా, షర్మిలపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విజయమ్మ ఆరోపించారు. - వివరాలు 2లో



బీజేపీ 'జీరో' కావాలి: మమత
కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 'జీరో'గా మారిపోవాలని తాను కోరుకుంటున్నట్లు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చెప్పారు. కేవలం మీడియా మద్దతు, అబద్ధాలతోనే బీజేపీ పెద్ద హీరోగా మారిందని ఎద్దేవా చేశారు. - వివరాలు 6లో



'రింగు'భూమి కేంద్రం ఖాతాలోకి..
హైదరాబాద్ రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి ఎన్‌హెచ్‌ఏఐ అలైన్‌మెంట్ ఖరారు చేసి గుర్తించిన భూములు ఇక కేంద్ర ప్రభుత్వ పరమైనట్టే. వాటిపై ఇంతకాలం వాటి యజమానులకు ఉన్న హక్కులు రద్దయ్యాయి. - వివరాలు 14లో

మోదీకి ఘర్‌వాపసీ తప్పదు

2024లో ప్రధాని పదవి ఖాళీకాక తప్పదు

కరప్షన్ కెప్టెన్ మోదీ.. క్యాప్షన్ బీజేపీ

- ఏటీఎం అంటే అదానీ టు మోదీ డబ్బు ప్రవాహమే..
- బీజేపీకి ఎన్నికల బాండ్ల రూపంలో రూ. 20 వేల కోట్లు ఎక్కడివి?
- గవర్నర్ వ్యవస్థతో కేంద్రం ప్రతిపక్ష ప్రభుత్వాల గొంతు నొక్కుతోంది
- అసెంబ్లీ ఎన్నికల్లో మాకు ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీయే
- బీజేపీకి ఈసారి 103 చోట్ల డిపాజిట్లు రావు
- మేం హ్యాట్రిక్ కొడతాం.. కేసీఆర్ సీఎంగా రికార్డు సృష్టిస్తారు
- బీఆర్ఎస్ విస్తరణకు అవకాశం ఉన్న చోట పోటీ చేస్తాం
- జేడీఎస్ కోరితే కర్ణాటక ఎన్నికల్లో ప్రచారంపై నిర్ణయం
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు

2లో



విద్యుత్ వాహనాలకు తెలంగాణ అడ్డా
- భవిష్యత్తు అంతా విద్యుత్ వాహనాలదే: మంత్రి కేటీఆర్
- ఈవీ రంగంలో ఉపాధి పెంపునకు కృషి చేస్తున్నాం
- జహీరాబాద్‌లో మహీంద్రా అండ్ మహీంద్ర ఈవీ ప్లాంట్‌కు భూమిపూజ
- రూ. వెయ్యి కోట్ల పెట్టుబడితో అక్కడి ప్లాంట్‌ను విస్తరిస్తున్న సంస్థ

2లో

'జెమిని సర్కస్' శంకరన్ కన్నుమూత
- వివరాలు 6లో

వాగ్దానాల నుంచి కోటా దాకా... 'కీ'లకాంశాలివే..!
ఆసక్తికరంగా కర్ణాటక ఎన్నికల పోరు
6లో

నదులున్నా తాగునీరేదీ?


ఔరంగాబాద్ సభలో కేసీఆర్

గోదావరి, కృష్ణా ఉన్నా మహారాష్ట్రకు నీటి సమస్య ఎందుకు?
ఔరంగాబాద్ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

పెద్దపెద్ద మాటలు మాట్లాడే పాలకులు తాగునీళ్లు కూడా ఇవ్వలేరా?

తెలంగాణలో సాధ్యమైనవి మహారాష్ట్రలో ఎందుకు కావు?

దేశంలో అనివార్యమైన మార్పు తీసుకొచ్చేందుకే బీఆర్ఎస్ ఆవిర్భావం

మహారాష్ట్రలో అధికారంలోకి వస్తే ఐదేళ్లలో ఇంటింటికీ తాగునీరిస్తామన్న సీఎం

ఎంత త్వరగా మేలుకుంటే అంత త్వరగా బాగుపడతామని వ్యాఖ్య

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే అభయ్ పాటిల్, ఇతర నేతలు

> 'వాస్తవానికి దేశంలో సమృద్ధిగా నీటి వనరులున్నాయి. వీటిని సాగు యోగ్యత ఉన్న భూములకు అందించాల్సి ఉంది. 24 గంటలు విద్యుత్ సరఫరా చేయగల వనరులు ఉన్నాయి. దేశం మొత్తం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వొచ్చు. ప్రస్తుతం తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తున్నాం. నేను చెప్పేది అబద్ధమైతే ఒక్క నిమిషం కూడా సీఎం పదవిలో ఉండను.
> - సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: దేశ ప్రజలకు ఇప్పటికీ తాగు, సాగునీరు సరిగా అందడం లేదని బీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు విమర్శించారు. యువతకు ఉద్యోగాలు కూడా లేవని ధ్వజమెత్తారు. గోదావరి, కృష్ణా వంటి నదులున్నా మహారాష్ట్రకు నీటి సమస్య ఎందుకని నిలదీశారు. 'దేశంలో ఇన్ని జీవనదులు ఉన్నా తాగేందుకు నీళ్లుండవా? పెద్దపెద్ద మాటలు మాట్లాడే పాలకులు కనీసం తాగేందుకు నీళ్లు కూడా ఇవ్వలేరా? రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు? సాగు, తాగునీరు అందించని పాపం ఎవరిది? ఇలాంటి ప్రభుత్వాలను కొనసాగించాలా? ఇంటికి పంపాలా?..' అని ప్రశ్నించారు. సోమవారం మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జబిందా మైదానంలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభలో కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్, బసవేశ్వరుడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో పాటు పలువురు మరాఠా యోధులకు నివాళులర్పించారు. పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే అభయ్ పాటిల్‌తో పాటు ఆయన అనుచరులు, ఇతర నాయకులకు గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం సభకు హాజరైన వారిని ఉద్దేశించి మాట్లాడారు.

మార్పు రాకుంటే దేశం ముందుకెళ్లదు..

'మహారాష్ట్ర పవిత్రభూమికి నమస్కారం. ముస్లిం మైనారిటీలకు రంజాన్ శుభాకాంక్షలు. మరాఠా భూమి ఎందరో మహానుభావులకు జన్మనిచ్చింది. ముంబై దేశ ఆర్థిక రాజధాని. కానీ తాగేందుకు నీళ్లుండవా? ఔరంగాబాద్, అకోలాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. దేశం పురోగమిస్తోందా? తిరోగమిస్తోందా? ఏం జరుగుతోందో ఎవరికీ అర్థం కావట్లేదు. ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారు. పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. ఇది ఇలాగే కొనసాగాలా? చికిత్స చేయాలా? ఇంకెంత కాలం పరిష్కారం కోసం ఎదురుచూడాలి? ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కల్పిస్తున్నా ఊరుకోవాలా? భయపడుతుంటే ఇంకా భయపెట్టిస్తారు. ధైర్యంగా పోరాడితేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అన్నివర్గాలకు సరైన న్యాయం దక్కాల్సిందే. మార్పు రాకుంటే

మిగతా 10వ పేజీలో ▶



నేటి నుంచి ఆర్టి'జనుల' సమ్మె!
- పిలుపునిచ్చిన ఆర్టిజన్ల ప్రాతినిధ్య సంఘాలు
- సమ్మెతో తమకు సంబంధం లేదన్న ప్రధాన ఉద్యోగ సంఘాలు
- ఎస్మా ప్రయోగిస్తామని యాజమాన్యాల హెచ్చరిక
- విద్యుత్ సంస్థల్లో తీవ్ర ఉత్కంఠ పరిస్థితులు

10లో





కుట్రదారులతో కుమ్మక్కు
వివేకా రాజకీయ ప్రత్యర్థులతో జట్టుకట్టిన ఆయన కుమార్తె, అల్లుడు

- చంద్రబాబు, ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి ఆటలో పావుగా సునీత
- 'ఆది'కి నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డితో సంబంధమేంటి?
- గుండెపోటుతో వివేకా మరణించారని తొలుత 'ఆది'కే ఎందుకు చెప్పారు?
- వాళ్లిద్దరూ అపుడు ఏం మాట్లాడుకున్నారు? ఎవరిని ఇరికిద్దామనుకున్నారు?
- ఆ తరవాత అవినాశ్‌కు చెప్పి... అక్కడికి వెళ్లమనటం వెనక వ్యూహమేంటి?
- పీఏ కృష్ణారెడ్డి చేతిలో... వివేకా రాసిన రక్తపు మరకలున్న లేఖ.. దాని గురించి సునీత దంపతులకు చెప్పిన కృష్ణారెడ్డి.. కానీ గోప్యంగా ఉంచాలని ఆదేశం
- బాబు హయాంలో జరిగిన విచారణలో అసలు లేఖ ప్రస్తావనే లేదెందుకు?



ఏది నిజం?
- బాబు ఎప్పుడు మాట్లాడినా... రక్తపు మరకలు కడిగిందెవరు? అనే అంటారెందుకు?
- ఆ లేఖను గోప్యంగా ఎందుకు ఉంచారని ప్రశ్నించరేం?
- లేఖను గోప్యంగా ఉంచటమనేది వివేకా కుటుంబీకులు, టీడీపీ వేసిన స్కెచ్చా?
- అలా గోప్యంగా ఉంచి.. అవినాశ్‌ను ఇరికించాలనేది వారి ప్రధాన ఉద్దేశమా?
- ఈ కోణాల్లో సాగాల్సిన దర్యాప్తును ఆది నుంచీ ప్రభావితం చేస్తున్న ఎల్లో మీడియా

- వివరాలు 4లో

మరో 3 బిల్లుల పరిష్కారం



నిర్ణయాలు తీసుకున్న గవర్నర్

రెండు బిల్లులు సర్కారుకు రిటర్న్.. ఒక బిల్లు తిరస్కృతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య విభేదాలతో రాజ్‌భవన్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండిపోయిన బిల్లుల వ్యవహారంలో మరికొంత కదలిక వచ్చింది. మొత్తం 10 బిల్లులు పెండింగ్‌లో ఉండగా, 7 బిల్లులపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నిర్ణయాలు తీసుకుని పరిష్కరించినట్టు ఈ నెల 10న సుప్రీంకోర్టుకు రాజ్‌భవన్ నివేదించింది. తాజాగా మిగిలిన 3 బిల్లులపై సైతం గవర్నర్ నిర్ణయాలు తీసుకుని పరిష్కరించారని సోమవారం వెల్లడించింది. రాజ్‌భవన్ వర్గాల ప్రకారం.. తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (రెగ్యులేషన్ ఆఫ్ ఏజ్ ఆఫ్ సూపర్ ఏన్యుయేషన్) చట్ట సవరణ బిల్లు-2022ను గవర్నర్ తిరస్కరించారు. తెలంగాణ

మిగతా 2వ పేజీలో ▶

పెండింగ్ బిల్లుల కేసు ముగింపు
సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ
2లో

నిరుద్యోగులతో చెలగాటం
- టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై నిలదీస్తే నోటీసులిస్తున్నారు
- నాపై ఇప్పటికే 130 కేసులు పెట్టినవ్ కేసీఆర్.. ఇంతకంటే ఏం చేస్తావ్?
- ఖమ్మం నిరుద్యోగ నిరసన ర్యాలీలో టీపీసీసీ చీఫ్ రేవంత్

3లో


సోమవారం నిర్వహించిన నిరుద్యోగ నిరసన ర్యాలీలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తదితరులు



నేడు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు

సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్ నుంచి ఇంటీరియర్ మహారాష్ట్ర, ఇంటీరియర్ కర్ణాటక మీదుగా ఇంటీరియర్ తమిళనాడు పరిసర ప్రాంతాల్లోని ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు, ఒకట్రెండు చోట్ల వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. సోమవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే, గరిష్ట ఉష్ణోగ్రత భద్రాచలంలో 38.0 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత హనుమకొండలో 21.5 డిగ్రీ సెల్సియస్‌గా నమోదయ్యాయి. మంగళవారం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో 40 డిగ్రీ సెల్సియస్ కంటే తక్కువగా నమోదవుతాయని సూచించింది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	40.6	26.2
కడప	40.5	26.6
రాజమహేంద్రవరం	39.0	26.0
నిజామాబాద్	38.2	24.0
భద్రాచలం	38.0	26.5
మహబూబ్‌నగర్	37.5	23.4
రామగుండం	37.4	24.0
ఖమ్మం	37.2	24.5
మెదక్	37.2	22.0
నల్లగొండ	37.0	24.4
ఆదిలాబాద్	36.8	23.8
విశాఖపట్నం	36.4	25.4
హైదరాబాద్	36.0	22.0
హకీంపేట్	35.8	23.0
దుండిగల్	35.5	22.1
హనుమకొండ	34.5	21.5

క్లుప్తంగా...

'ధరణి'పై నేడు కోర్టుకు హాజరై వివరణ ఇవ్వండి

సీసీఎల్ఏకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: 'ధరణి'లో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై నేడు(మంగళవారం) వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్(సీసీఎల్ఏ)ను హైకోర్టు ఆదేశించింది. ధరణి పోర్టల్‌లో నమోదైన సేల్‌డీడ్‌ల సర్టిఫైడ్ కాపీలను ఎందుకు జారీచేయడంలేదో తెలియజేయాలని స్పష్టం చేసింది. ధరణికి సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. కొన్ని సమస్యలను వారంలో, మరికొన్నింటిని 45 రోజుల్లో పరిష్కరించాలని నిబంధనల్లో ఉన్నా వాటిని పాటించడంలేదని పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ఎలాంటి కారణం తెలపకుండా సర్టిఫైడ్ కాపీలు కోరినవారికి నిరాకరిస్తూ మెసేజ్ పెడుతుండటాన్ని న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకున్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఈ సమస్యలపై నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని సీసీఎల్ఏను ఆదేశిస్తూ తదుపరి విచారణను నేటికి వాయిదా వేశారు.

అధిక పెన్షన్ దరఖాస్తులపై ఈపీఎఫ్‌వో సర్క్యులర్

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు ఆదేశానుసారం అధిక పెన్షన్‌కు అర్హులైన చందాదారులకు దరఖాస్తు అవకాశాన్ని కల్పించిన ఈపీఎఫ్ఓ.. ఈ ప్రక్రియ తీరుతెన్నులను వివరిస్తూ తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. 2014 సెప్టెంబర్ 1కన్నా ముందు రిటైరైన ఉద్యోగులు వారి యాజమాన్యాల ద్వారా మే 3లోగా సమర్పించాల్సిన ఉమ్మడి దరఖాస్తుల సమర్పణ కోసం ఆన్‌లైన్ వేదికను ఏర్పాటు చేసినట్లు అందులో తెలిపింది. అలా అందిన దరఖాస్తులను ఫీల్డ్ ఆఫీసులు పరిశీలిస్తాయని వివరించింది. దరఖాస్తులన్నీ సవ్యంగా ఉండి వేతన వివరాలు ఫీల్డ్ ఆఫీసుల వద్ద ఉండే వివరాలతో సరిపోలితే పెన్షన్ బకాయిలను లెక్కగట్టి బదిలీ చేస్తామని చెప్పింది. ఒకవేళ దరఖాస్తులు, వేతన వివరాల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని సవరించుకొనేందుకు ఉద్యోగులు, యాజమాన్యాలకు నెల రోజుల సమయం ఇవ్వనున్నట్లు ఈపీఎఫ్‌వో వివరించింది.

కొత్త మందుల ఆవిష్కరణలపై సమాలోచనలు

సాక్షి, హైదరాబాద్: కొత్త మందుల ఆవిష్కరణలు, టీకాల ప్రయోగాలకు కీలకంగా మారిన పరిశోధనల ప్రక్రియలు, అంశాలపై సమాలోచనలు సాగుతున్నాయి. సోమవారం నగరశివార్లలోని జీనోమ్ వ్యాలీలో జరిగిన వరల్డ్ ల్యాబ్ యానిమల్ డే ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా 300 మంది శాస్త్రవేత్తలు, పరిశోధకులు హాజరై ఆయా అంశాలపై చర్చించారు. వరల్డ్ ల్యాబ్ యానిమల్ డే సందర్భంగా అక్కడి ఐసీఎంఆర్ నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయోమెడికల్ రీసెర్చ్(ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్)లో జరిగిన ఓ ప్రత్యేక వర్క్‌షాపులో నూతన పరిశోధనలకు సంబంధించిన వివిధ అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. శిక్షణాసంస్థను ప్రపంచస్థాయికి తీర్చిదిద్దిన తీరును అభినందిస్తూ ఈ ప్రాజెక్ట్ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య, ఈ శిక్షణాసంస్థ ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ పి.సురేశ్‌లను ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌జీ రామచంద్ర సన్మానించారు.

మోదీకి ఘర్‌వాపసీ తప్పదు

2024లో ప్రధాని పదవి ఖాళీకావడం ఖాయం

కరప్షన్ కెప్టెన్ మోదీ.. క్యాష్షన్ బీజేపీ

- బీజేపీకి ఎన్నికల బాండ్ల రూపంలో రూ. 20 వేల కోట్లు ఎక్కడివి?
- గవర్నర్ వ్యవస్థ ద్వారా కేంద్రం ప్రతిపక్ష ప్రభుత్వాల గొంతునొక్కుతోంది
- అసెంబ్లీ ఎన్నికల్లో మాకు ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీయే
- బీజేపీకి ఈసారి 103 చోట్ల డిపాజిట్లు రావు
- మేం హ్యాట్రిక్ కొట్టడం ఖాయం....కేసీఆర్ సీఎంగా రికార్డు సృష్టిస్తారు
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు

ప్రజలు కేసీఆర్‌ను ఆశీర్వదిస్తారు..

తెలంగాణలో మళ్లీ గులాబీ జెండాయే ఎగురుతుంది. కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టిన తొలి సీఎంగా రికార్డు సాధిస్తారు. ఎవరు ఎన్ని చెప్పినా కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అనే భావనంలో ప్రజలు ఉన్నారు. రైతులు, పేదల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను దేశానికి పరిచయం చేసేందుకు బయలుదేరిన కేసీఆర్‌ను ప్రజలు ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాం.

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ, బీజేపీపై బీఆర్ఎస్ కార్యానిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు విరుచుకుపడ్డారు. ఏటీఎం అంటే అదానీ టూ మోదీకి డబ్బుల ప్రవాహమే అని ఆయన కొత్త భాష్యం చెప్పారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీయేనని, బీజేపీకి ఈసారి కూడా వందకుపైగా సీట్లలో డిపాజిట్లు గల్లంతవుతాయని జోస్యం చెప్పారు. ఈ నెల 27న బీఆర్ఎస్ 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్వ్యూ విశేషాలు ఆయన మాటల్లోనే...

జాతీయ పార్టీ ఒకేసారి దేశమంతా పోటీ చేయాలని లేదు...

బీఆర్ఎస్ జాతీయ పార్టీగా మారినంత మాత్రాన దేశమంతా ఒకేసారి పోటీ చేయాలన్న రూలేమీ లేదు. రెండు స్థానాల నుంచి 300 స్థానాలకు చేరుకొనేందుకు బీజేపీకి 30-40 ఏళ్లు పట్టింది. 2024లో 543 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయాలనే తొందరేమీ మాకు లేదు. పట్టుదొరికి బలంగా ఉన్న చోట, గెలిచే అవకాశం, పార్టీ విస్తరణకు అవకాశం ఉన్న చోట పోటీ చేస్తాం. మహారాష్ట్రలో 48 ఎంపీ సీట్లలో పోటీ చేస్తామా, ఇతరులతో అవగాహన ఉంటుందా ఇప్పుడే చెప్పలేము. జాతీయ స్థాయిలో బీఆర్ఎస్ విస్తరణకు పనిచేస్తూనే రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రావడాన్ని మొదటి కర్తవ్యంగా పనిచేస్తాం. దేశంలో రాజకీయ శూన్యత నేపథ్యంలో బీఆర్ఎస్ బలమైన పార్టీగా ఎదుగుతుంది.



ఏటీఎం అంటే...

ఏటీఎం అంటే అదానీ నుంచి మోదీకి డబ్బుల ప్రవాహం సాగడమే. అవినీతి గురించి మోదీ ఆయన మంత్రులు మాట్లాడటం విడ్డూరం. సీబీఐ, ఈడీలను చేతిలో పెట్టుకొని కేంద్రం ఆటలాడుతోంది. కానీ ఎప్పుడూ కాలం ఒకేలా ఉండదు. 2024లో మోదీకి గుజరాత్‌కు ఘర్ వాపసీ తప్పదు. 2024లో ప్రధాని పదవి ఖాళీ కాక తప్పదు. ఎవరేం అనుకున్నా తెలంగాణలో గత ఎన్నికల్లో 108 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయిన బీజేపీకి ఈసారి 103 స్థానాల్లో మళ్లీ డిపాజిట్లు దక్కవు.

కొందరికి ఆదరణ లేకే...

పాదయాత్రల పేరిట కొందరు ఆపసోపాలు పడినా ప్రజలు పట్టించుకోవడం లేదు. మీడియా దృష్టిని ఆకర్షించేందుకు, అస్తిత్వం కోల్పోతామనే చిల్లర ప్రయత్నాలతో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ డబ్బులు ఇచ్చిందని కొందరు ఆరోపిస్తున్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నికతోపాటు కరీంనగర్, నిజామాబాద్ లోక్‌సభ, ఇతర ఉపఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీ ఏకమై పనిచేశాయి. అదానీతో మోదీకి సంబంధం లేదని బీజేపీ నేతలు భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రమాణం చేస్తారా? ప్రమాణాలు, ఇమానాల మీద తేలేదుంటే కోర్టులు ఎందుకు? ఇంకో పార్టీకి డబ్బులు పంపే ఖర్మ మాకేంటి? వాళ్లందరికీ పంచేంత డబ్బులు మా వద్ద లేవు. బీజేపీ, కాంగ్రెస్‌లు తెలంగాణకు ఉపద్రవాలు. ఎంత త్వరగా వదిలించుకుంటే తెలంగాణకు అంత మంచిది.

మోదీ అప్పట్లో రాష్ట్రం విడిచి తిరగలేదా..?

గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ మోదీ 2010 నుంచి 2014 వరకు పాలన గాలికొదిలేసి గాలి తిరుగుడు తిరగలేదా? తెలంగాణలో మౌలికవసతులు కల్పించాకే సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాలపై దృష్టిపెట్టారు. గుజరాత్‌లో నేటికీ మంచినీరు, విద్యుత్ కొరత వంటి సమస్యలు ఉన్నాయి. తెలంగాణలో సమస్యలు లేవనడం లేదు. మా కార్యకలాపాలకు కేంద్రం తెలంగాణయే. ఢిల్లీ కేంద్రంగానే పార్టీని నడపాలనే ఖానూన్ ఏమీ లేదు. హైదరాబాద్ కేంద్రంగా జాతీయ రాజకీయాలను శాసించవచ్చు. ప్రజల ఆశీర్వాదం, ఆదరణ మాకు లభిస్తే రేపు ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు?

ఆ ఆరోపణలు పాత చింతకాయ పచ్చడి...

పరివార్‌వాదీ, ఎంఐఎంతో అనుబంధం, మా కుటుంబంపై అవినీతి ఆరోపణలు పాత చింతకాయ పచ్చడి. ప్రజలకు ఇష్టం లేకుంటే మమ్మల్ని తిరస్కరిస్తారు. కర్ణాటకలో 40-50 మంది బీజేపీ నేతల కుటుంబ సభ్యులకు టికెట్లు ఇవ్వడం పరివార్‌వాదీ కాదా? అక్కడ బీజేపీకి వర్తించని నిబంధనలు మాకే వర్తిస్తాయా?. కరప్షన్ క్యాప్టెన్ మోదీ.. క్యాష్షన్ బీజేపీ. అదానీ, ప్రధాని అవిభక్త కవలలు. మోదీ అత్యంత అవినీతిపరుడు. పాలన చేతకాని అసమర్థుడు. బీజేపీకి ఎన్నికల బాండ్ల రూపంలో రూ. 20 వేల కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయి? ఎంఐఎం అనే పార్టీ భుజంపై తుప్పుబట్టిన తుపాకీ పెట్టి ఎన్నిసార్లు కాల్చినా ప్రజలకు స్పష్టత ఉంది. పేదల కోసం పనిచేసే వారిని ప్రజలు ఆదరిస్తారు. బీజేపీ చేసే మతపరమైన రాజకీయం తెలంగాణ చైతన్యం ముందు చెల్లదు.

విస్తరణ బాటలో ఉన్నాం...

60 లక్షల సైన్యంగల పార్టీ బీఆర్ఎస్. దేశంలోనే ఇంత పెద్ద బలగం, సైన్యం ఉన్న పార్టీ మరొకటి లేదు. జాతీయ పార్టీగా రూపాంతరం చెందినా ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల్లోకి ఇంకా బలంగా వెళ్లలేదు. ఇప్పుడిప్పుడే మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లోకి విస్తరించే ప్రయత్నంలో ఉన్నాం. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారినా మా జెండా, ఎజెండా, మా నాయకుడు, గుర్తు మారలేదు. తెలంగాణనే మాకు మొదటి ప్రాధాన్యం. తెలంగాణ మోడల్‌ను దేశానికి చూపుతున్నాం. తెలంగాణ ఆత్మగౌరవ బావుటాను ఇతర రాష్ట్రాల్లో ఎగురవేయడానికి బయలుదేరాం. అంతే కాని తెలంగాణను వదిలి వెళ్లలేదు.

శిఖండి రాజకీయం..

మహాభారతంలో శిఖండి రాజకీయం చేసినట్లు నేరుగా గెలవలేక కొత్త పార్టీలు, చిన్న పార్టీలను అడ్డుపెట్టుకొని బీజేపీ నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారు. ఈ పార్టీల నాయకులు నిద్రలేచింది మొదలు కేసీఆర్‌ను, రాష్ట్ర ప్రభుత్వాన్ని తిట్టడమే తప్ప తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రాన్ని అడిగే పరిస్థితి లేదు. అమిత్ షా అడ్డగోలుగా మాట్లాడినా ఒక్కరూ ప్రశ్నించరు. బీజేపీపై మరకపడకుండా చూస్తూ బీఆర్ఎస్ ఓట్లను చీల్చడమే వారి పని. తెలంగాణ ప్రజలు దీన్ని అర్థం చేసుకొని బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తారు.

మా ప్రత్యర్థి కాంగ్రెస్సే..

తెలంగాణలో మాకు కాంగ్రెస్ పార్టీయే ప్రత్యర్థి. క్షేత్రస్థాయిలో అంతోఇంతో కాంగ్రెస్ ఉన్నా టీపీసీసీ అధ్యక్షుడి ఒంటెద్దు పోకడలతో కేడర్, లీడర్లు నిరాసక్తతతో ఉన్నారు. 2018లో 19 సీట్లు వస్తే ఈసారి కాంగ్రెస్‌కు డబుల్ డిజిట్ వస్తుందో రాదో తెలియదు. కాంగ్రెస్‌తో ఎట్టి పరిస్థితుల్లోనూ పొత్తు ఉండదు. మునుగోడు ఉపఎన్నికలో కమ్యూనిస్టులు మద్దతు ఇచ్చారు. భవిష్యత్తులో వారితో పనిచేసే విషయంలో ఎన్నికల నాటికి నిర్ణయం ఉంటుంది. అదానీ షేర్ల స్కాం అంశం విషయంలో పార్లమెంటు సంయుక్త కమిటీ (జేపీసీ) ఏర్పాటు డిమాండ్ కోసం కాంగ్రెస్‌తోపాటు ఇతర విపక్షాలతో కలసి కేవలం ఫ్లోర్ కోఆర్డినేషన్ కోసం పనిచేశాం.

కుమారస్వామికి మద్దతు

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో జనతా దళ్ (సెక్యులర్) నేత కుమారస్వామికి మద్దతివ్వాలని పార్టీ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ ఎన్నికల్లో ప్రచారం చేయాలని కుమారస్వామి కోరితే పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

ఎన్నికల సమాయత్తానికే సమ్మేళనాలు..

ఎన్నికల ఏడాదిలో కేడర్‌ను సిద్ధం చేసేందుకు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నాం. ఈ సమ్మేళనాల నుంచి వస్తున్న ఫీడ్ బ్యాక్‌ను దృష్టిలో పెట్టుకొని చిన్నాచితకా లోటుపాట్లు ఉంటే సవరించుకుంటాం. మే నుంచి యువజన, విద్యార్థి సమ్మేళనాలు నిర్వహిస్తాం. విద్యార్థి విభాగాన్ని బలోపేతం చేసేలా జూన్ నుంచి బీఆర్ఎస్‌వీ ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభిస్తాం. రాష్ట్రంపై కేంద్రం చూపుతున్న వివక్ష, రాష్ట్ర ప్రభుత్వ విజయాలను విద్యార్థులు, యువతకు వివరించి మత కలహాలతో చిచ్చు పెట్టే పార్టీ కావాలా లేదా తెలంగాణను పచ్చగా చేసే పార్టీ కావాల ఆలోచించుకోవాలని చెప్తాం.

వారికి భవిష్యత్తులో అవకాశాలు..

పార్టీలో టికెట్లు ఆశించడం అసహజ విషయమేమీ కాదు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందనే స్పష్టత మా పార్టీ నేతలకు ఉంది. ఎమ్మెల్యే టికెట్ వచ్చిన వారు ఎన్నికల్లో కొట్లాడతారు. రాకున్నా పార్టీ నిర్ణయానికి కట్టుబడే వారికి రేపు మరో అవకాశం వస్తుంది. తొమ్మిదేళ్లలో అనేక మంది విద్యార్థి, యువజన నాయకులకు ఎమ్మెల్సీలుగా, కార్పొరేషన్ల చైర్మన్లుగా, కమిషన్ల సభ్యులుగా అవకాశం ఇచ్చాం. మాట ఇచ్చిన వారందరినీ అకామిడేట్ చేసుకున్నాం. ఎవరికైనా అవకాశాలు రాకుంటే భవిష్యత్తులో ఇస్తాం.

గవర్నర్ వ్యవస్థతో కేంద్రం రాజకీయం...

గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని ప్రతిపక్ష ప్రభుత్వాల గొంతును కేంద్రం నులుముతున్న తీరును దేశం గమనిస్తోంది. గవర్నర్ వ్యవస్థతో రాజకీయం చేసి రాష్ట్రాలను ఇబ్బందులు పెట్టడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం.



మహీంద్రా అండ్ మహీంద్రా ఈవీ ప్లాంట్‌కు భూమిపూజ చేస్తున్న మంత్రి కేటీఆర్, కంపెనీ ప్రతినిధులు

విద్యుత్ వాహనాలకు తెలంగాణ అడ్డా

- భవిష్యత్తు అంతా విద్యుత్ వాహనాలదే: మంత్రి కేటీఆర్
- జహీరాబాద్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా ఈవీ ప్లాంట్‌కు భూమిపూజ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: విద్యుత్ వాహనాలకు తెలంగాణ రాష్ట్రం అడ్డాగా మారిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. భవిష్యత్తు అంతా విద్యుత్ వాహనాలేదని, రానున్న రోజుల్లో మెట్రోస్టేషన్లు, పట్టణాల మధ్య ప్రయాణికులను చేరవేసేందుకు, కార్గో అవసరాలకు ఎలక్ట్రిక్ వాహనాలే వినియోగించాల్సి ఉంటుందన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని తమ ప్లాంట్ విస్తరణలో భాగంగా ప్రముఖ ఆటోమొబైల్ తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా రూ. వెయ్యి కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న విద్యుత్ వాహనాల తయారీ ప్లాంట్‌కు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ ఈవీ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు, కాలుష్యరహిత వాహనాలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగానే 2020లో విద్యుత్ వాహనాల పాలసీని తీసుకొచ్చామని చెప్పారు. విద్యుత్ వాహనాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ఆర్టీసీ వంటి సంస్థలు ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేస్తున్నాయని, ప్రైవేటు వ్యక్తులు ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేస్తే ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఈవీ రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందన్నారు. జహీరాబాద్‌లో మాన్యుఫ్యాక్చరింగ్ జోన్‌ను, వికారాబాద్ జిల్లా ఎన్కతలలో ఇన్నోవేషన్ జోన్‌ను, మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ జోన్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో జరిగిన ఫార్ములా ఈ-రేస్ సందర్భంగా తెలంగాణ మొబిలిటీ వ్యాలీని కూడా ప్రకటించామని, ఎలక్ట్రిక్ సమ్మిట్‌లో పలు ఒప్పందాలు జరిగాయని తెలిపారు.

స్థానికులకే ఉద్యోగ అవకాశాలు..

పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ తపన అని కేటీఆర్ అన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు ఉద్యోగావకాశాల్లో స్థానిక యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. యువత నైపుణ్యాలను పెంచుకొని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. మహీంద్ర కంపెనీలో తయారయ్యే వాహనాలు హైదరాబాద్‌తోపాటు దేశంలోని అన్ని రోడ్లపై సక్సెస్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఐటీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, మహీంద్ర లాస్ట్‌మైల్ మొబిలిటీ సీఈఓ సుమన్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

టీఎస్-ఐపాస్ ద్వారా 23 వేల పరిశ్రమలు

ఏ రాష్ట్రంలోనైనా పెట్టుబడులు, పరిశ్రమలు రావాలన్నా.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలన్నా రాజకీయ స్థిరత్వం, శాంతిభద్రతలు, సుస్థిర ప్రభుత్వ విధానాలు ఉండాలని కేటీఆర్ పేర్కొన్నారు. దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న టీఎస్-ఐపాస్‌తో రాష్ట్రంలో 23 వేలకుపైగా పరిశ్రమలు, రూ. 3.30 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాయన్నారు. ఈ పరిశ్రమల వల్ల సుమారు 20 లక్షల మందికి ఉపాధి లభించిందని... పరిశ్రమలు 3 షిఫ్టుల్లో ఉత్పత్తిని కొనసాగించేలా ప్రభుత్వం నిరంతరం విద్యుత్ సాకర్యాన్ని కల్పిస్తోందని వివరించారు. యాజమాన్యాలు, కార్మిక సంఘాలు, ప్రభుత్వం మధ్య సత్సంబంధాలుంటే పారిశ్రామిక ప్రగతి సాధ్యమవుతుందని కేటీఆర్ అన్నారు. అవినీతిరహిత, పారదర్శక విధానాల అమలుతోపాటు కార్మికుల ప్రయోజనాలను ప్రభుత్వం కాపాడుతోందని చెప్పారు.

పెండింగ్ బిల్లుల కేసు ముగింపు

- సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ
- ప్రస్తుతం గవర్నర్ వద్ద బిల్లులేవీ పెండింగ్‌లో లేకపోవడం వల్లే..
- వివరణ కోసం బిల్లులు తిప్పి పంపే అధికారం గవర్నర్‌కు ఉంది

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ గవర్నర్ వద్ద బిల్లుల పెండింగ్ సంబంధిత కేసు విచారణను సుప్రీంకోర్టు ముగించింది. గవర్నర్ వద్ద బిల్లులు ఏవీ పెండింగ్ లేని నేపథ్యంలో కేసు ముగిస్తున్నట్లు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం స్పష్టం చేసింది. బిల్లుల పెండింగ్‌కు సంబంధించిన కేసు విచారణ సోమవారం సుప్రీంకోర్టులో జరిగింది. గవర్నర్ కీలక బిల్లులను తిప్పి పంపారని సుప్రీంకోర్టు దృష్టికి తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చింది. అయితే వివరణ కోసం బిల్లులను తిప్పి పంపే అధికారం గవర్నర్‌కు ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. దీంతో త్వరితగతిన బిల్లులకు ఆమోదం తెలిపేలా ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వ తరఫు న్యాయవాది దుష్యంత్ దవే కోరారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 (1) లో ఉన్న 'సాధ్యమైనంత త్వరగా'అనే అంశం ప్రాధాన్యతను రాజ్యాంగ పరిరక్షకులు గుర్తించాలని, వీలైనంత త్వరగా బిల్లులపై నిర్ణయం తీసుకోవాలని సీజేఐ అన్నారు. కాగా తమ వద్ద ఏ బిల్లులూ పెండింగులో లేవని, 2 బిల్లుల విషయంలో ప్రభుత్వం నుంచి అదనపు సమాచారం, క్లారిఫికేషన్‌ను గవర్నర్ కోరారని.. గవర్నర్ తరఫు న్యాయవాది సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

ప్రతిపక్ష రాష్ట్రం కాబట్టే మరోలా: దవే

చట్టసభల ప్రతినిధులు గవర్నర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోందని, బిల్లులు తిప్పి పంపాలంటే వెంటనే పంపొచ్చని, కానీ తమ వద్దనే పెండింగులో పెట్టుకోవడం సమంజసం కాదని దుష్యంత్ దవే వాదించారు. మధ్యప్రదేశ్‌లో వారంలో, గుజరాత్‌లో నెలలో బిల్లులన్నీ క్లియర్ అవుతుండగా తెలంగాణలో మరో విధంగా జరుగుతోందన్నారు. గవర్నర్లు కూడా రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలంటూ వాదించారు.

షర్మిల అరెస్ట్.. రిమాండ్

- సిట్ ఆఫీసుకు వెళ్లకుండా షర్మిలను అడ్డుకున్న పోలీసులు
- పోలీసులతో దురుసుగా ప్రవర్తించారంటూ కేసు నమోదు

బంజారాహిల్స్ (హైదరాబాద్): వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతోపాటు ఆమె డ్రైవర్‌ను బంజారాహిల్స్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంలో సిట్ అధికారులకు వినతి పత్రం ఇవ్వడానికి సోమవారం షర్మిల లోటస్‌పాండ్‌లోని తన కార్యాలయం నుంచి బయలుదేరుతుండగా.. పోలీసులు అక్కడకు చేరుకుని పార్టీ కార్యాలయాన్ని ముట్టడించారు. బయటకి వెళ్లేందుకు అనుమతి లేదంటూ షర్మిలను అడ్డుకోవడంతో ఆమెకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో ఆమె కారులో ఉన్న డ్రైవర్‌ను పోలీసులు బలవంతంగా కిందికి దింపేశారు. ఈ పరిణామంతో షర్మిల, పోలీసుల మధ్య ఉద్రిక్త వాతావరణ నెలకొంది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని జూబ్లీహిల్స్ ఠాణాకు తరలించారు. విధి నిర్వహణలో ఉన్న తనపై షర్మిల చేయి చేసుకున్నారని, నేమ్ ప్లేట్‌ను చించేశారని, తమ కానిస్టేబుల్ గిరిబాబు కాలు పైకి బలవంతంగా కారు ఎక్కించారని ఎస్సై రవీందర్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా షర్మిల తదితరులపై కేసు నమోదు చేశారు. ఏ1గా షర్మిల, ఏ2గా ఆమె కారు డ్రైవర్ బాబు, ఏ3గా మరో డ్రైవర్ జాకబ్‌లను చేర్చారు. షర్మిల, బాబులను అరెస్టు చేయగా.. జాకబ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సాయంత్రం గాంధీ ఆసుపత్రిలో షర్మిల, బాబులకు వైద్య పరీక్షలు చేయించి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు మే 8 వరకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, పోలీసులు షర్మిలను చంచల్‌గూడ జైలుకు తరలించారు.



షర్మిలను అరెస్టు చేసి తరలిస్తున్న దృశ్యం

పోలీసుల తీరు సరిగాలేదు: షర్మిల

'సిట్ అధికారులకు వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవడమే కాకుండా దౌర్జన్యంగా వ్యవహరించారు. ఒక పార్టీ అధ్యక్షురాలి పట్ల పోలీసుల తీరు సరిగాలేదు. ఈ విధుల్లో మహిళా కానిస్టేబుల్‌ను నియమించలేదు. పోలీసులు ప్రవర్తించిన తీరుకు నిరసనగానే రోడ్డుపై బైఠాయించా'అని షర్మిల మీడియాతో పేర్కొన్నారు. కాగా, జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో షర్మిలను పరామర్శించేందుకు భర్త అనిల్, తల్లి వైఎస్ విజయమ్మ వెళ్లగా పోలీసులు అనుమతించలేదు. కాగా, అరెస్ట్‌ను నిరసిస్తూ వైఎస్సార్‌టీపీ రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది.

షర్మిలపై కక్ష సాధింపు చర్యలు

- రాష్ట్ర ప్రభుత్వంపై వైఎస్ విజయమ్మ ధ్వజం
- తన కూతుర్ని చూసి పోతానన్నా పోలీసులు ఒప్పుకోలేదని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిలను పోలీసులు అరెస్ట్ చేయడంపై వైఎస్ విజయమ్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం షర్మిలను ఎందుకు అడ్డుకుంటోందని గట్టిగా నిలదీశారు. సోమవారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. షర్మిలపై పోలీసులు వ్యవహరించిన తీరుపై కోర్టుకు వెళ్తామని తెలిపారు. తాను షర్మిలను చూడటానికి పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్తోంటే పోలీసులు అనుమతించలేదన్నారు. 'నా కూతురుని చూసి పోతానన్నా పోలీసులు ఒప్పుకోలేదు. షర్మిలను ఎందుకు అరెస్ట్ చేశారని అడిగితే పోలీసుల దగ్గర సమాధానం లేదు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఏకైక వ్యక్తి షర్మిల కాబట్టి ప్రభుత్వం ఇంతటి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది'అని విజయమ్మ చెప్పారు. ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్‌కు ఫిర్యాదు చేసేందుకు ఒంటరిగా వెళ్తున్న షర్మిలను ఎందుకు అరెస్టు చేశారన్నారు. ప్రతిపక్షాలు ప్రశ్నించిన అంశాలకు పరిష్కారం చూపకుండా ప్రభుత్వం ఇలా వ్యవహరించడమేంటని మండిపడ్డారు. ప్రజల కోసం పోరాడుతున్న ఆమె వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాలు సాకారం చేయడానికి ఎంతో కష్టపడుతోందని చెప్పారు. 'అంతమంది పోలీసులు కనీస గౌరవం లేకుండా ఒక మహిళ పట్ల దురుసుగా ప్రవర్తిస్తుంటే ఆవేశం రాదా? పది మంది మహిళా పోలీసులు నాపై పడు తూ కార్లో ఎక్కించబోతే నాకు కూడా ఆవేశం వచ్చింది. పోలీసులు షర్మిల డ్రైవర్, గన్‌మెన్లను కొట్టారు. చివరికి మీడియా వాళ్లను కూడా కొట్టారు. మీడియాకు చేతులెత్తి అభ్యర్థిస్తున్నా.. ప్రజల తరఫున నిలబడి నిజాలు చూపించండి. చిన్నచిన్న విషయాలను పెద్దగా చూపించడం కాదు.. ప్రజల కోసం పని చే యాలి'అని చెప్పారు.



వైఎస్ విజయమ్మను అడ్డుకుంటున్న పోలీసులు

షర్మిల ఆత్మవిమర్శ చేసుకోవాలి

సిటీ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు

లక్డీకాపూల్: పోలీసులపై వైఎస్ విజయమ్మ, వైఎస్ షర్మిల తీరును సిటీ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నల్లా శంకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బాధ్యతాయుతంగా శాంతి భద్రతల విధులు నిర్వర్తిస్తున్న పోలీసులపై వారు చేయి చేసుకోవడం తగదన్నారు. పోలీసుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తూ.. పోలీసుల సహనాన్ని పరీక్షించకూడదని చెప్పారు. వారి చర్యలను ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు.

మరో 3 బిల్లుల పరిష్కారం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు-2022తో పాటు తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ బిల్లు-2022పై రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివరణలు కోరుతూ తిప్పి పంపారు. ప్రస్తుతం తమ వద్ద ఎలాంటి ప్రభుత్వ బిల్లులు పెండింగ్‌లో లేవని రాజ్‌భవన్ అధికారవర్గాలు వెల్లడించాయి. ఇలావుండగా తెలంగాణ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు-2023 పై వివరణలు కోరుతూ గతంలోనే తిప్పి పంపడంతో.. ఈ విధంగా ప్రభుత్వానికి తిప్పి పంపిన బిల్లుల సంఖ్య మూడుకు పెరిగింది.

కేవలం 3 బిల్లులకే ఆమోదం..

తెలంగాణ మోటారు వాహనాల పన్నుల చట్ట సవరణ బిల్లు-2022, ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీ చట్టసవరణ బిల్లు-2023, తెలంగాణ మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లు-2023కు గవర్నర్ తమిళిసై ఈ నెల 9న ఆమోదం తెలిపారు. కీలకమైన తెలంగాణ విశ్వవిద్యాలయాల ఉమ్మడి నియామక బోర్డు బిల్లు-2022, తెలంగాణ అటవీ వర్సిటీ బిల్లు-2022లను రాష్ట్రపతి పరిశీలన, ఆమోదం కోసం పంపించారు. ఆజామాబాద్ పారిశ్రామిక ప్రాంత (లీజుల నియంత్రణ, రద్దు) చట్ట సవరణ బిల్లు-2022 న్యాయశాఖ నుంచి చేర లేదని రాజ్‌భవన్ అధికారులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా...

పాలమూరు 'నిరుద్యోగ మార్చ్'కు తరలిరండి: బండి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి పాలమూరు జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించే 'నిరుద్యోగ మార్చ్'కు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ కార్యకర్తలు, యువతకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రంలోని 30 లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్తుకు సంబంధించి టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై సీఎం కేసీఆర్ స్పందించే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, నిరుద్యోగులకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీకి ఐటీ శాఖ నిర్లక్ష్యమే కారణమైనప్పటికీ మంత్రి కేటీఆర్ ను బర్తరఫ్ చేయకపోగా, ఆయనను కాపాడేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.

అది అమిత్‌షా తరం కాదు

ముస్లిం రిజర్వేషన్ల అంశంపై మాజీ మంత్రి షబ్బీర్ అలీ



సాక్షి, హైదరాబాద్: ముస్లింల రిజర్వేషన్లు తొలగించడం అమిత్‌షా తరం కాదని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు. మతపరమైన రిజర్వేషన్లు చెల్లవని మాత్రమే సుప్రీంకోర్టు చెప్పిందని, కానీ పేదలకు ఇవ్వాలని సూచించిందని పేర్కొన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వెనుకబడిన ముస్లింలకు మాత్రమే రిజర్వేషన్లు ఇచ్చిందని సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. అమిత్‌షా చేవెళ్లలో చేసిన వ్యాఖ్యలపై తాను సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని అన్నారు.

అమిత్‌షాకు అవగాహన లేదు: మల్లురవి
రిజర్వేషన్ల విషయంలో అమిత్‌షాకు అవగాహన లేదని, అందుకే ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటించారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి పేర్కొన్నారు.

ప్రజల మధ్య చిచ్చుకు బీజేపీ కుట్ర: మంత్రి జగదీశ్ రెడ్డి



సాక్షి, యాదాద్రి: దేశాన్ని నాశనం చేయడానికి, ప్రజల మధ్యన విభజన చిచ్చు పెట్టడానికి బీజేపీ కుట్ర చేస్తోందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీతారెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిశోర్‌లతో కలసి ఆయన సోమవారం భువనగిరిలో మీడియాతో మాట్లాడారు. ఒక వర్గం ప్రజలను మొత్తం లేకుండా చేస్తామనే మధ్యయుగాల నాటి సంస్కృతిని బీజేపీ తెరమీదకు తెస్తోందని మండిపడ్డారు. ఈ విషయంలో మేధావులు, కవులు, కళాకారులు, విద్యార్థి యువత అప్రమత్తం అవ్వాలని ఆయన కోరారు. తెలంగాణలో మతసామరస్యం వెల్లివిరుస్తోందన్నారు. దేశానికే గొప్ప చైతన్యాన్ని ఇచ్చిన తెలంగాణ సాయుధ పోరాట వారసులుగా తెలంగాణ ప్రజలు మోదీ, అమిత్‌షాల ఆటలను తిప్పికొట్టాలని సూచించారు.

పగటి వేషగాళ్ల మాటలు ప్రజలు నమ్మరు: కొప్పుల



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ముందు సభలు, సమావేశాలు పెట్టి పబ్బం గడిపే పగటివేషగాళ్ల మాటలు తెలంగాణ ప్రజలు నమ్మరని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. కేంద్రమంత్రి అమిత్‌షా తెలంగాణలో మాట్లాడిన మాటలపై సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌కు దేశవ్యాప్తంగా వస్తున్న ఆదరణ చూసి బీజేపీ నేతలకు మైండ్ బ్లాక్ అవుతోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర బీజేపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం ఆపి.. కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న పనులను చెప్పుకోవాలని కొప్పుల సూచించారు.

అరకోటి మంది నిరుద్యోగులతో చెలగాటం

- టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై నిలదీస్తే నోటీసులిస్తున్నారు
- నాపై ఇప్పటికే 130 కేసులు పెట్టినవ్ కేసీఆర్.. ఇంతకంటే ఏం చేస్తావ్?
- ఖమ్మం నిరుద్యోగ నిరసన ర్యాలీలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



అమరవీరుల చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీతో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలోని 50 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఖమ్మంలో సోమవారం నిరుద్యోగ నిరసన ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీకి ఖమ్మం పార్లమెంట్ పరిధి నుంచి భారీ ఎత్తున నిరుద్యోగులు, ప్రజలు తరలివచ్చారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం నుంచి ఖమ్మం పాత బస్టాండ్ వరకు గంటకు పైగా ర్యాలీ కొనసాగగా తొలుత అమరవీరుల చిత్రపటాలకు రేవంత్‌రెడ్డితోపాటు పార్టీ నేతలు నివాళులర్పించారు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 1.07 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నట్లు అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ చెప్పారని, ప్రస్తుతం రెండు లక్షల ఉద్యోగ ఖాళీలున్నట్లు బిస్వాల్ కమిటీ నివేదిక ఇచ్చిందని తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక ఉన్న ఉద్యోగాలు పోయాయే తప్ప కొత్త ఉద్యోగం రాలేదన్నారు. 80 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామంటే కేసీఆర్ మారిందేమో అనుకున్నామని కానీ అలా జరగకపోగా.. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని విమర్శించారు. ప్రశ్నపత్రాల లీకేజీలపై నిలదీసి, మంత్రి కేటీఆర్‌కు సంబంధం ఉన్నందున బర్తరఫ్ చేయాలని అడిగితే ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు నోటీసులు పంపిస్తున్నారన్నారు. తనపై ఇప్పటికే 130 కేసులు పెట్టారని, ఇంతకంటే కేసీఆర్ ఇంకేం చేయగలరని అన్నారు. పోడు భూములు, విద్యార్థులు, రైతుల కోసం పోరాటం చేసిన కమ్యూనిస్టులు ఇప్పుడు ఎవరి పక్కన నిల్చున్నారో గమనించాలన్నారు.

అర్హత లేని వారికి టీఎస్‌పీఎస్సీలో స్థానం

పశువులు కాసే వారిని, అర్హత లేని వారిని టీఎస్‌పీఎస్సీలో కంప్యూటర్ ఆపరేటర్లు, సెక్షన్ ఆఫీసర్లుగా నియమించడంతో వారు సంతలో పేపర్లు అమ్ముకున్నారని రేవంత్ ఆరోపించారు. పంపకాల్లో తేడాల వల్ల ప్రశ్నపత్రాల లీకేజీ బయటపడిందే తప్ప ప్రభుత్వం గుర్తించలేకపోయిందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. మేలో హైదరాబాద్ సరూర్‌నగర్ గ్రౌండ్‌లో నిర్వహించే సభకు ఏఐసీసీ నేత ప్రియాంకా గాంధీ హాజరవుతున్నట్లు చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రులు రేణుకాచౌదరి, పొరిక బలరాంనాయక్, రాష్ట్ర మాజీ మంత్రులు షబ్బీర్‌అలీ, సంభాని చంద్రశేఖర్, గడ్డం ప్రసాద్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మల్లు రవి, అంజన్‌కుమార్ యాదవ్, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి పాల్గొన్నారు.

వారి కోటా ఎందుకు పెంచట్లేదు?

హిందూ పేదల రిజర్వేషన్లపై అమిత్‌షాకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్ రద్దు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముస్లింలకు మతం ఆధారంగా కాకుండా, వారి సామాజిక, ఆర్థిక వెనుబాటుతనం ఆధారంగా రిజర్వేషన్ కల్పించారనే విషయాన్ని అమిత్‌షా పక్కదోవ పట్టిస్తున్నారన్నారు. ఆయనకు నిజంగా హిందువుల్లో పేదలపై చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్ పరిమితిని 50 శాతం ఎందుకు పెంచడం లేదని నిలదీశారు. బీజేపీకే ఎంఐఎంతో ఎక్కువ సంబంధం ఉందని కూనంనేని ఆరోపించారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా బీజేపీ, ఎంఐఎం పరస్పర అవగాహనతో పోటీ చేస్తాయని, బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఎంఐఎంను కూడా వాడుకుంటుందని చెప్పారు. దేశంలో అందరిపై కేసులు నమోదవుతున్నా.. ఎంఐఎం నేతలపై కేసులు ఎందుకు ఉండవని ప్రశ్నించారు.

అమిత్ షా మాటలు ప్రజాస్వామ్యానికే కళంకం: నారాయణ
రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లు తీసేస్తామని అమిత్ షా ప్రకటించడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు.

మే7న బీఎస్పీ తెలంగాణ భరోసా సభ

ముఖ్య అతిథిగా మాయావతి: ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్/అయిజ: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో మే7న హైదరాబాద్ సరూర్‌నగర్‌లో 'తెలంగాణ భరోసా సభ'ను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సభకు పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయంలో తెలంగాణ భరోసా సభ పోస్టర్‌ను, కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ 9 ఏళ్లుగా చితికిపోయిన తెలంగాణ ప్రజలకు భరోసా ఇవ్వడానికే మాయావతి మే7న వస్తున్నట్లు చెప్పారు.

అమిత్‌షా తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించడంపై ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. అమిత్‌షాకు రిజర్వేషన్లపై అవగాహన లేదని, మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తామని చేవెళ్ల సభలో వ్యాఖ్యానించడం దారుణమని అన్నారు. అమిత్‌షా తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అమిత్‌షా వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- ముస్లింల రిజర్వేషన్లు తొలగిస్తామనడం రాజద్రోహమే
- తెలంగాణలో బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కుమ్మక్కు



హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ వద్ద డప్పు కొడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

సాక్షిప్రతినిధి, వరంగల్: ముస్లిం మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించడంపై సీఎల్పీనేత మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. రాజ్యాంగస్ఫూర్తికి భిన్నంగా మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తామని అమిత్‌షా మాట్లాడడం రాజద్రోహానికి పాల్పడినట్టేనని అన్నారు. భట్టి చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ నుంచి ప్రారంభమై హుజూరాబాద్, హుస్నాబాద్, వర్ధన్నపేట నియోజకవర్గాల్లోని పలు గ్రామాల మీదుగా కాకతీయ యూనివర్సిటీ వరకు సాగింది. ఈ సందర్భంగా గుంటూరుపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక కమిషన్ వేసి అత్యంత వెనుకబడి ఉన్న మైనార్టీలకు 4% రిజర్వేషన్ కల్పిస్తే.. కేంద్ర హోం మంత్రి ఇలా మాట్లాడటం సరికాదన్నారు. మైనార్టీల రిజర్వేషన్లు తొలగించి వాటిని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అందజేస్తామని అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. బీసీల జనగణన చేయకుండా బీజేపీ, బీఆర్‌ఎస్ కలసి నాటకమాడుతున్నాయని ధ్వజమెత్తారు. మానస సరోవరం లాంటి తెలంగాణ రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయాలన్న కుట్రలతో అమిత్‌షా అడుగుపెట్టాడని భట్టి ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సూత్రధారి అయితే బండి సంజయ్ పాత్రధారి, కేసీఆర్ మరో పాత్రధారిగా వ్యవహరిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్రంలో, రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తాము అధికారంలోకి రాగానే బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు పాల్పడిన అవినీతి, సంపద లూటీపైన సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని భట్టి అన్నారు. కాగా, హసన్‌పర్తి వద్ద ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ధరణితో భూములను దొరలకు అప్పగించే కార్యక్రమం చేస్తున్నారని కేసీఆర్‌పై మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం 70 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కూలీలకు కూలీబంధు పథకం తీసుకొచ్చి, సంవత్సరానికి రూ.12 వేలు బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని తెలిపారు.

అమిత్‌షా చెప్పినవన్నీ అబద్ధాలే: వినోద్ కుమార్

సాక్షి, హైదరాబాద్: చేవెళ్ల సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్ని అబద్ధాలు చెప్పారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి. వినోద్ కుమార్ ఆరోపించారు. ఆయన తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని తన నివాసంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ లెక్కలను కిషన్‌రెడ్డికి, బండి సంజయ్‌కి పంపిస్తానని, అప్పుడైనా కేంద్రాన్ని అడగాలని సూచించారు. రోడ్ సెస్ కింద రాష్ట్రం రూ. 39,189 కోట్లు కేంద్రానికి చెల్లిస్తే, రాష్ట్రంలో రోడ్లకు కేంద్రం రూ. 34 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. వివిధ గ్రాంట్ల కింద రాష్ట్రానికి రూ.లక్షా 20 వేల కోట్లు కేంద్రం ఇచ్చిందని అమిత్ షా చేవెళ్ల సభలో చెప్పారని, వాస్తవానికి అందులో నాలుగో వంతు నిధులు కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు.

రాష్ట్రంలో వందశాతం సంస్థాగత ప్రసవాలు

దేశంలోనే ఈ ఘనత సాధించిన రాష్ట్రం తెలంగాణే.. హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: 2021–22 సంవత్సరంలో నూటికి నూరు శాతం సంస్థాగత(ఆసుపత్రుల్లో) ప్రసవాలు నమోదు చేసిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఈ విషయాన్ని హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం(హెచ్‌ఎంఐఎస్) వెల్లడించింది. హెచ్‌ఎంఐఎస్ ఇంకా పలు వివరాలు వెల్లడించింది. తెలంగాణ తర్వాతి స్థానంలో కేంద్రపాలిత ప్రాంతమైన లక్షద్వీప్ ఉంది. ఈ విషయంలో దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని, ప్రతిష్టాత్మకమైన కేసీఆర్ కిట్ల వల్లే ఇది సాధ్యమైందని వైద్య, ఆరోగ్య శాఖ పేర్కొంది. అబార్షన్లు దేశంలో అత్యంత తక్కువ ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ రెండోస్థానంలో ఉంది. ఇండియాలో 4 శాతం అబార్షన్లు అవుతుండగా, అందులో బీహార్‌లో 0.4 శాతం, తెలంగాణలో 0.9 శాతంగా ఉన్నాయి. అప్పుడే పుట్టిన పిల్లల్లో గంటలోపు 80.75 శాతం మందికి తల్లి పాలు ఇస్తున్నారు. పుట్టిన పిల్లల్లో హెపటైటిస్ బీ వ్యాక్సినేషన్ 104 శాతం ఇస్తూ తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. తమిళనాడు 99.8 శాతంతో రెండో స్థానంలో ఉంది. 9–11 నెలల మధ్య ఉన్న పిల్లల్లో రుబెల్లా, మీజిల్స్ టీకాలు వందశాతం వేసినట్లు తెలిపింది. జమ్మూ, కశ్మీర్ కూడా వందశాతం వేసింది. ఈ రెండు రాష్ట్రాలే ఈ ఘనత సాధించాయి.

లింగనిష్పత్తి జాతీయసగటు కంటే మెరుగు

రాష్ట్రంలో 81 ఫస్ట్ రిఫరల్ యూనిట్లు ఉన్నాయి. అవి నూటికినూరు శాతం పనిచేసే రాష్ట్రాల్లో తెలంగాణ మొదటిస్థానంలో ఉంది. పుట్టిన తర్వాత చనిపోయే పిల్లలు అత్యంత తక్కువ నమోదవుతున్న రాష్ట్రాల్లో కేరళ, తమిళనాడు, తెలంగాణ వరసస్థానాల్లో ఉన్నాయి. ప్రతీ ప్రసవం కూడా నూటికి నూరుశాతం రిజిస్టర్ అవుతోంది. 2021–22లో 6.06 లక్షల మంది జన్మించారు. అందులో 37 వారాల కంటే ముందుగా ప్రసవం అయినవారు 7,574 మాత్రమే. ఈ విషయంలో కేరళ, తమిళనాడు కంటే కూడా తక్కువ ఉండటం గమనార్హం. పుట్టినబిడ్డ 2.5 కిలోల కంటే తక్కువ బరువు ఉన్నవారు 6.2 శాతమే. 2021–22లో 6.06 లక్షల మంది పుడితే, 2.5 కిలోల కంటే తక్కువ బరువున్నవారు 37,792 మందే ఉన్నారు. కేరళ, తమిళనాడు కంటే కూడా తెలంగాణలో తక్కువగా ఉండటం విశేషం. అప్పుడే పుట్టిన పిల్లలు అత్యవసరంగా ఆసుపత్రుల్లో చేరాల్సి వస్తే, వారిలో చనిపోయేవారు 4.5 శాతం ఉంటున్నారు. ఇందులో తెలంగాణ నాలుగోస్థానంలో ఉంది. పుట్టినప్పుడు లింగ నిష్పత్తి జాతీయసగటు 934 ఉండగా, తెలంగాణలో 938 ఉంది. ఆరోగ్య తెలంగాణలో భాగంగా మాతాశిశు ఆరోగ్య సంరక్షణపట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ చూపిన చొరవకు ఈ ఫలితాలు నిదర్శమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

మంత్రి నిరంజన్‌రెడ్డిపై ఈడీ, ఐటీకి ఫిర్యాదు

- బినామీ అక్రమాస్తులు, విదేశీ లావాదేవీలపై ఫిర్యాదు చేశానన్న బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు
- మంత్రి దత్తపుత్రుడు నాయక్ అన్ని గ్రామాల్లో సీఎస్‌ఆర్ పనులెలా చేశారని నిలదీత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఆయన బినామీ అమ్లావత్ గౌడ నాయక్ అక్రమాస్తులపై చర్యలు తీసుకోవాలని ఇన్‌కమ్‌టాక్స్ చీఫ్ కమిషనర్‌కు, మంత్రి నిర్వహించిన బినామీ, విదేశీ కార్యకలాపాలపై విచారణ జరపాలంటూ ఈడీ జాయింట్ డైరెక్టర్‌కు బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ–మెయిల్స్ ద్వారా తన ఫిర్యాదులను సంబంధిత ఉన్నతాధికారులకు పంపించినట్లు ఆయన సోమవారం మీడియా సమావేశంలో తెలియజేశారు. 2014–15 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు వనపర్తి జిల్లా సంకిరెడ్డిపల్లి గ్రామ వాస్తవ్యుడైన గౌడ నాయక్ మంత్రి నిరంజన్‌రెడ్డి బినామీగా పెద్దమొత్తంలో స్థిరాస్తులు కొనుగోలు చేశారని ఐటీ చీఫ్ కమిషనర్‌కు పంపిన ఫిర్యాదులో రఘునందన్ పేర్కొన్నారు. నాయక్ కొన్న భూములెన్ని, ఆయా భూముల కొనుగోలుకు డబ్బు ఎక్కడి నుంచి సమకూర్చాడు, ఐటీకి చూపించిన స్థిరచరాస్తుల విలువ ఎంత ? పన్ను ఎగవేతకు పాల్పడినదెంత వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు.

ఆస్తులు అప్పుడెన్ని, ఇప్పుడెన్ని?

2014, 2018 ఎన్నికల అఫిడవిట్‌లో మంత్రి చూపిన ఆస్తుల వివరాలు, మంత్రి నేటి ఆస్తులు, ఫామ్‌హౌస్‌లు, బిల్డింగ్‌లపై దర్యాప్తు చేయాలని ఈడీకి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐలు భారత్‌లో వ్యవసాయభూములు కొనుగోలు చేసే వీలు లేదనేది తనకున్న సమాచారమని రఘునందన్‌రావు చెప్పారు. ఆస్ట్రేలియాలో స్థిరపడిన తనకుమార్తెల పేరిట భూములు కొనుగోలు చేసినట్టు మంత్రే అంగీకరించినందున విచారణ జరిపించాలని కోరారు. నిరంజన్ రెడ్డి పాత ఫోన్ నంబర్‌తో చైనాలోని మో అనే వ్యక్తితో రెగ్యులర్‌గా మాట్లాడేవారని దీనిపై ఈడీకి ఫిర్యాదు చేశామని తెలియజేశారు. మంత్రి ఫామ్‌హౌస్‌ను రూ.4 కోట్లకు ఇస్తానంటే తానే న్యాయబద్ధంగా వైట్ మనీ ఇచ్చి కొనుగోలు చేస్తామన్నారు.

మంత్రి దత్తపుత్రుడే అన్ని సీఎస్‌ఆర్ పనులెలా చేశారు ?...

మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్‌ఆర్) పనులు, కాంట్రాక్ట్ పనులన్నీ గౌడ నాయకే ఎందుకు చేశారని ప్రశ్నించారు.

రియల్టర్ హత్యకు మాజీ ఇన్‌స్పెక్టర్ కుట్ర

- రూ.20 లక్షలకు సుపారీ ఇచ్చిన దాసరి భూమయ్య
- రంగంలోకి మాజీ నక్సలైట్ సహా ముగ్గురు వ్యక్తులు
- గుట్టురట్టు చేసిన ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ టీమ్



ఆయుధాలను పరిశీలిస్తున్న సీపీ ఆనంద్



దాసరి భూమయ్య

సాక్షి, హైదరాబాద్/కరీంనగర్ క్రైమ్: రియల్ ఎస్టేట్ వివాదాలతో పాటు వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఓ రియల్టర్‌ను హత్య చేయడానికి పథకం వేసి, ఓ ముఠాకు సుపారీ ఇచ్చిన మాజీ ఇన్‌స్పెక్టర్ దాసరి భూమయ్య నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్‌కు చిక్కారు. అతడితో సహా మొత్తం నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు వీరి నుంచి నాటు తుపాకీ, రెండు కత్తులు తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. గతంలో పోలీసు అధికారి–ఇన్‌ఫార్మర్‌గా వీళ్ల అనేక మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు చేసినట్లు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావుతో కలిసి సోమవారం ఐసీసీసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు.

ఆ ఇద్దరిదీ ఘనమైన చరిత్రే...
ప్రస్తుతం కరీంనగర్‌లో నివసిస్తున్న మాజీ ఇన్‌స్పెక్టర్ దాసరి భూమయ్య, కొత్తపేట అష్టలక్ష్మీ దేవాలయం వద్ద ఉంటున్న విజయ్‌పాల్ రెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వాళ్లే. 1992లో ఆర్‌ఎస్సైగా పోలీసు విభాగంలో అడుగుపెట్టిన భూమయ్య 1996లో సివిల్ ఎస్సైగా మారారు. కరీంనగర్ రేంజ్‌లో ఉన్న 4,5 జిల్లాల్లోని 12 పోలీసుస్టేషన్లకు నేతృత్వం వహించారు. 2012లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది కరీంనగర్ పోలీసు కంట్రోల్ రూమ్, మంథని, జమ్మికుంట, హుస్నాబాద్, సీఐడీ, ఆదిలాబాద్ డీసీఆర్‌బీ, ఉట్నూర్‌తో పాటు ఆదిలాబాద్ ట్రాఫిక్ సీఐగా పని చేశాడు. పోలీసు ఇన్‌ఫార్మర్‌గా భూమయ్యకు పరిచయమైన విజయ్‌పాల్ అనేక మంది మావోయిస్టుల సమాచారం అందించాడు. ఇతడి ప్రతిభకు మెచ్చిన అధికారులు కానిస్టేబుల్ ఉద్యోగం ఇచ్చారు. కొన్నాళ్లకు భూమయ్య, విజయ్‌పాల్ భూ దందాలు మొదలెట్టి రియల్టర్ల అవతారమెత్తారు. భూమయ్యకు బినామీగా ఉన్న విజయ్‌పాల్ కానిస్టేబుల్ ఉద్యోగం వదిలి రియల్టర్‌గా మారిపోయాడు.

ఏసీబీతో కేసులో అరెస్టు కావడంతో...
కొన్నాళ్లకు వీరి మధ్య స్పర్థలు రావడంతో విజయ్‌పాల్ నగరానికి మకాం మార్చారు. 2018లో భూమయ్యపై ఏసీబీ దాడి జరగడం, రూ.10 లక్షల నగదుతో పాటు 80 ఎకరాల భూమి గుర్తించడంతో జైలుకు వెళ్లాడు. తనపై ఏసీబీ కేసుకు విజయ్‌పాల్ కారణమని భూమయ్య భావించాడు. అతడి పేరుపై తన తన భూముల్లోకీ అడుగుపెట్టనీయకపోవడంతో కక్ష కట్టాడు. విజయ్‌ను హత్య చేయించాలని నిర్ణయించుకుని పెద్దపల్లికి చెందిన తన స్నేహితుడు మామిడి చంద్రయ్యకు ఆ బాధ్యత అప్పగించాడు. గత నెల్లో చంద్రయ్యను తన ఇంటికి పిలిచిన భూమయ్య విజయ్‌పాల్‌ను చంపిస్తే రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాడు. గతంలో జనశక్తి ప్రతిఘటన దళంలో పని చేసిన శంకర్‌కు ఈ పని అప్పగించాడు. ఇతడు పదేళ్ల క్రితం తనతో కలిసి ఇల్లెందులో అశోక్‌రెడ్డి అనే వ్యక్తిని హత్య చేసిన గడ్డం కుమార్‌ను రంగంలోకి దింపాడు. వీరంతా కలిసి భూమయ్యతో రూ.20 లక్షలకు ఒప్పందం చేసుకుని రూ.5 లక్షలు అడ్వాన్స్ తీసుకున్నారు.

ఇంటి వద్ద రెక్కీ చేసి, ఫొటోలు తీసి...
నగరానికి చేరుకున్న శంకర్, కుమార్‌లు విజయ్‌పాల్ ఇంటి వద్ద రెక్కీ చేసి..ఆ ఫొటోలను వాట్సాప్ ద్వారా భూమయ్య, చంద్రయ్యలకు పంపారు. తన కుమారుడు కొన్నేళ్ల క్రితం బీహార్ నుంచి తెచ్చిన నాటు తుపాకీని ఈ హత్యకు వాడాలని భావించిన కుమార్ దాని ఫొటోలనూ షేర్ చేశాడు. రెండు భారీ కత్తులను వీళ్లు సిద్ధం చేసుకున్నారు. సికింద్రాబాద్‌లోని ఓ లాడ్జిలో బస చేసిన భూమయ్య, చంద్రయ్య, శంకర్, కుమార్ హత్య చేయడానికి అదును కోసం ఎదురు చూస్తున్నారు. వీరి వ్యవహారంపై సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలో ఎస్సైలు బి.అశోక్‌రెడ్డి, కె.శ్రీకాంత్, ఎం.అనంతాచారి, బి.అర్వింద్ గౌడ్ దాడి చేసి నలుగురిని పట్టుకున్నారు. వీరి నుంచి ఆయుధాలు, సెల్‌ఫోన్లు, రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం గోపాలపురం పోలీసులకు అప్పగించారు.

బీజేపీకి అధికారం ఎండమావే..

- ఖమ్మంలో డిపాజిట్లు రాని పార్టీ అధికారంలోకి వస్తుందా?
- కర్ణాటకలో ఓటమి తప్పదనే ఫ్రస్టేషన్‌లో అమిత్‌షా వ్యాఖ్యలు
- ఎవరెన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ సీఎం కేసీఆరే
- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమావేశంలో మంత్రి హరీశ్‌రావు



కల్లూరులో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'ఇది సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరులో సగం మంది కార్యకర్తలతో పెట్టిన మీటింగ్. ఇక్కడికి వచ్చినంత మంది కూడా చేవెళ్లలో బీజేపీ సభకు రాలేదు. అయినా బీజేపీ వాళ్లు మేమేదో అధికారంలోకి వస్తాం.. తెలంగాణలో గెలుస్తామని మాట్లాడుతున్నరు. ఖమ్మం జిల్లాలో ఒక్క చోటైనా డిపాజిట్ దక్కించుకోలేని ఆ పార్టీకి రాష్ట్రంలో అధికారం ఎండమావే..'అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కల్లూరు, పెనుబల్లిలో వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి హరీశ్‌రావు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కల్లూరులో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షతన జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమావేశంలో ప్రసంగించారు.

ఓటమి తప్పదనే...

కర్ణాటకలో ఓటమి తప్పదని, తెలంగాణలో అధికారంలోకి వచ్చేది లేదన్న ఫ్రస్టేషన్‌తోనే అమిత్ షా చేవెళ్ల సభలో మాట్లాడారని హరీశ్‌రావు అన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే మాటలు మాట్లాడుతూ బీజేపీ విద్వేష రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. కాగా, పేపర్ లీకేజీ ఘటనలో నిందితుడిని పక్కన పెట్టుకుని అమిత్ షా పేపర్ లీకేజీ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ తన స్వార్థం కోసం తప్ప ప్రజల కోసం ఎప్పుడూ ఆలోచించలేదని హరీశ్‌రావు విమర్శించారు. ఆ ప్రభుత్వ హయాంలో కరెంట్, ఎరువులు ఇవ్వకుండా.. ఇప్పుడే ముఖం పెట్టుకుని రైతుల వద్దకు వస్తున్నారని నిలదీశారు.

మూడు నెలల్లో సీతారామ నీళ్లు..

వచ్చే మూడు నెలల్లో సీతారామ ప్రాజెక్టు నీళ్లు సత్తుపల్లికి తీసుకొచ్చి ఇక్కడి ప్రజల కాళ్లు కడుగుతామని, ఖమ్మంలో ప్రతీ మండలానికి కాలంతో పని లేకుండా రెండు పంటలకు నీళ్లు ఇస్తామని హరీశ్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసిన భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గానికి 100 పడకల దవాఖానా తెచ్చుకోలేక పోయారన్నారు. కానీ సత్తుపల్లిలో 100 పడకల ఆస్పత్రి ప్రారంభం కానుండగా.. ఖమ్మం, కొత్తగూడెంకు మెడికల్ కళాశాలలు వచ్చాయని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని చీప్ ట్రిక్కులు చేసినా.. హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సభలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ భూముల్లో తోటలు

హరితహారంలో భాగంగా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న భూముల్లో ఆ శాఖ సమన్వయంతో పెద్దఎత్తున తోటల పెంపకం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా హరితహారం కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలు చేయడంతో పాటు క్షీణించిన అడవులను పునరుజ్జీవింపజేయడానికి దోహదపడుతుందని అంచనా వేస్తోంది. 2022–23లో లీనియర్ ప్లాంటేషన్ కింద 5,408 కి.మీ విస్తీర్ణం, బ్లాక్ ప్లాంటేషన్ కింద 1,782 ఎకరాల విస్తీర్ణం కోసం జిల్లా కలెక్టర్ల నుంచి కార్యాచరణ ప్రణాళిక అందింది. ఇప్పటివరకు...మొత్తం 2,767 కిలోమీటర్లలో లీనియర్ ప్లాంటేషన్ చేపట్టి 13,42,173 మొక్కలు నాటారు. ఇక 590.04 ఎకరాల్లో బ్లాక్ ప్లాంటేషన్ చేపట్టి 6,01,385 మొక్కలు నాటారు.

తోటల పరిశీలనకు ఏడు బృందాలు: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, పెద్దపల్లి, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నాగర్ కర్నూల్, నారాయణపేట, సిద్దిపేట, సూర్యాపేట, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈ తోటలను పరిశీలించేందుకు రాష్ట్ర స్థాయిలో ఏడు బృందాలను ఏర్పాటు చేశారు. రాజన్న సిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, మహబూబాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, కరీంనగర్, వరంగల్, సంగారెడ్డి, మెదక్, వై.భువనగిరి, మహబూబ్ నగర్ జిల్లాల్లోని ప్లాంటేషన్‌లను క్వాలిటీ కంట్రోల్ సెల్ ఆధ్వర్యంలో సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ (ఎస్‌క్యూసీఓ), జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ (జేక్యూసీఓ), ప్లాంటేషన్ మేనేజర్ పరిశీలిస్తారు. ఈత, గుల్మోహర్, సీమ తంగేడు, రెయిన్ ట్రీ, సీతాఫల్, దిరిశెన, పెల్టోఫోరం వంటి జాతుల మొక్కలను ఈ జిల్లాల్లో నాటారు.



నిజాయితీతో కూడిన అనంగీకారం
చాలాసార్లు ప్రగతికి మంచి సంకేతం.
- మహాత్మా గాంధీ

సాక్షి
మంగళవారం, 25 ఏప్రిల్ 2023

మితి మీరితే... మరో ప్రమాదం!

పవిత్ర చార్‌ధామ్ యాత్ర ఎప్పటి లానే ఈ ఏడూ మొదలైంది. అక్షయ తృతీయ వేళ గంగోత్రి, యమునోత్రి ఆలయాలు తెరుచుకున్నాయి. ఏప్రిల్ 25న కేదార్‌నాథ్, 27న బదరీనాథ్ తెరిచేందుకు సన్నాహాలు సాగుతున్నాయి. మొదలవుతూనే ఈ యాత్ర అనేక ప్రశ్నలనూ మెదిలేలా చేసింది. హిమాలయ పర్వతాల్లో కఠోర వాతావరణ పరిస్థితుల మధ్య సాగే ఈ యాత్రలో కొండచరియలు విరిగిపడి బదరీనాథ్ హైవే తాజాగా మూసుకుపోవడం పొంచివున్న ప్రమాదాలకు ముందస్తు హెచ్చరిక. యమునోత్రి ప్రయాణంలో తొలిరోజే ఇద్దరు గుండె ఆగి మరణించడం యాత్రికుల శారీరక దృఢత్వానికి సంబంధించి అధికారుల ముందస్తు తనిఖీ ప్రక్రియపై అనుమానాలు రేపుతోంది. ఇప్పటికే 16 లక్షల మందికి పైగా యాత్రకు పేర్లు నమోదు చేసుకున్న వేళ... రానున్న కొద్ది వారాల్లో ఈ పర్వత ప్రాంత గ్రామాలు, పట్నాల మీదుగా ప్రయాణంపై భయాందోళనలు రేగుతున్నాయి.

'దేవభూమి' ఉత్తరాఖండ్ అనేక హిందూ దేవాలయాలకు ఆలవాలం. చార్‌ధామ్‌గా ప్రసిద్ధమైన యమునోత్రి, గంగోత్రి, కేదారనాథ్, బదరీనాథ్‌లు ఇక్కడివే. ఇన్ని ఆలయాలు, ప్రకృతి అందాలకు నెలవైన ఉత్తరాఖండ్‌కు ఆర్థిక పురోభివృద్ధి మంత్రాల్లో ఒకటి – పర్యాటకం. అయితే, అదే సమయంలో హిమాలయాల ఒడిలోని ఈ ప్రాంతం పర్యావరణపరంగా అతి సున్నిత ప్రాంతం. ఈ సంగతి తెలిసినా, పర్యావరణ నిపుణులు పదేపదే హెచ్చరిస్తున్నా పాలకులు పెడచెవిన పెడుతూనే ఉన్నారు. ఉత్పాతాలనూ లెక్క చేయకుండా, చార్‌ధామ్ ప్రాంతాలను వ్యాపారమయం చేసి, భరించలేనంతగా యాత్రికుల్ని అనుమతిస్తున్నారు. హిమాలయాల్లో పద్ధతీ పాడూ లేక ఇష్టారాజ్యంగా చేపడుతున్న సోకాల్డ్ అభివృద్ధి ప్రాజెక్ట్‌లు, అనియంత్రిత పర్యాటకం కలగలసి మానవ తప్పిదంగా మారాయి. ఈ స్వయంకృతాపరాధాలతో వాతావరణ మార్పులకు మంచుదిబ్బలు విరిగిపడుతున్నాయి. జోషీ మఠ్ లాంటి చోట్ల జనవరిలో భూమి కుంగి, ఇళ్ళన్నీ బీటలు వారి మొదటికే మోసం రావడం తెలిసిందే!

నియంత్రణ లేని విపరీత స్థాయి పర్యాటకం ఎప్పుడైనా, ఎక్కడైనా మోయలేని భారం. విషాదమేమంటే, ప్రాకృతిక సంపదైన హిమాలయాలను మన పాలకులు, ప్రభుత్వాలు ప్రధాన ఆర్థిక వనరుగా చూస్తుండడం, వాటిని యథేచ్ఛగా కొల్లగొట్టడం! అభివృద్ధి, పర్యాటక అనుభవం పేరిట ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఉండడం! కనీసం ఆ ప్రాంతాలు ఏ మేరకు సందర్శకుల తాకిడిని తట్టుకోగలవనే మదింపు కూడా ఎన్నడూ మనవాళ్ళు చేయనేలేదు. బదరీనాథ్, కేదార్‌నాథ్‌లు తట్టుకోగలవని పర్యావరణ నిపుణులు అంచనా వేసిన రద్దీ కన్నా రెండు, మూడింతలు ఎక్కువగా, దాదాపు 15 వేల మందికి పైగా జనాన్ని నిరుడు ప్రభుత్వం అనుమతించడం విచిత్రం. ఒక్క గడచిన 2022లోనే ఏకంగా కోటి మంది పర్యాటకులు ఉత్తరాఖండ్‌ను సందర్శించినట్టు లెక్క. కేవలం చార్‌ధామ్ యాత్రాకాలంలోనే రికార్డు స్థాయిలో 46 లక్షల మంది వచ్చారు. ఈ ఏడాది ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందని అంచనా. ఈ పరిస్థితుల్లో రోజుకు అనుమతించాల్సిన యాత్రికుల సంఖ్యపై పరిమితిని ఎత్తేస్తూ ప్రభుత్వం నిర్ణయించడం ఏ రకంగా సమర్థనీయం!

నిజానికి 'జాతీయ విపత్తు నివారణ సంస్థ' (ఎన్డీఎంఏ) 2020 నాటి నివేదికలోనే భారత హిమాలయ ప్రాంతం ఎదుర్కొంటున్న పర్యావరణ సవాళ్ళను ఏకరవు పెట్టింది. పర్యాటకం, పట్టణ ప్రాంతాలకు వలసల వల్ల పట్నాల మొదలు గ్రామాల వరకు తమ శక్తికి మించి రద్దీని మోయాల్సిన పరిస్థితి వచ్చిందని కూడా చెప్పింది. బఫర్ జోన్‌ను సృష్టించడం సహా అనేక నియంత్రణ చర్యలను సిఫార్సు చేసింది. మంచుదిబ్బలు విరిగిపడి, వరదలకు కారణమయ్యే ప్రాంతాల్లో పర్యాటకాన్ని నియంత్రించాలనీ, తద్వారా కాలుష్యస్థాయిని తగ్గించాలనీ సూచించింది. పాలకులు వాటిని వినకపోగా, ఏటేటా ఇంకా ఇంకా ఎక్కువ మందిని యాత్రకు అనుమతిస్తూ ఉండడం విడ్డూరం.

జోషీమఠ్‌లో విషాదం ఇప్పటికీ బాధిస్తూనే ఉంది. బీటలు వారిన అనేక ఇళ్ళు కూల్చివేయక తప్పలేదు. గూడు చెదిరి, ఉపాధి పోయి వీధినపడ్డ వారికి ఇంకా పరిహారం అందనే లేదు. తాత్కాలిక శిబిరాల్లోనే తలదాచుకుంటున్న దుఃస్థితి. ఈ పరిస్థితుల్లో గత వారం కూడా కొత్తగా కొన్ని ఇళ్ళు బీటలు వారాయన్న వార్త ప్రకృతి ప్రకోపాన్ని చెబుతోంది. సిక్కు పర్యాటక కేంద్రం హేమ్‌కుండ్ సాహిబ్‌కూ, చార్‌ధామ్ యాత్రలో బదరీనాథ్‌కూ సింహద్వారం ఈ జోషీమఠే. పరిస్థితి తెలిసీ ఈసారి పర్యాటకుల సంఖ్య రికార్డులన్నీ తిరగరాసేలా ఉంటుందని రాష్ట్ర సీఎం ప్రకటిస్తున్నారు. జోషీమఠ్, ఔలీ ప్రాంతాలు అన్ని రకాలుగా సురక్షిత ప్రాంతాలని ప్రచారం చేసేందుకు తపిస్తున్నారు. ప్రమాదభరితంగా మారిన ఆ కొండవాలు ప్రాంతాల్లో తాత్కాలిక నిర్మాణాలు చేసి, విపరీతంగా వాహనాలను అనుమతించడం చెలగాటమే. కనుక తొందరపాటు వదిలి, తగిన జాగ్రత్తలు చేపట్టాలి.

హిందువులకు జీవితకాల వాంఛల్లో ఒకటైన ఈ యాత్ర ప్రభుత్వానికీ, స్థానిక ఆర్థిక వ్యవస్థకూ బోలెడంత డబ్బు తెచ్చిపెట్టవచ్చు గాక. ధర్మవ్యాప్తిలో ముందున్నామని పాలక పార్టీలు జబ్బలు చరుచుకొనేందుకూ ఇది భలేఛాన్స్ కావచ్చు గాక. జలవిద్యుత్కేంద్రాలు సహా విధ్వంసకర అభివృద్ధితో ఇప్పటికే కుప్పకూలేలా ఉన్న పర్యావరణ వ్యవస్థపై అతిగా ఒత్తిడి తెస్తే మాత్రం ఉత్పాతాలు తప్పవు. మొన్నటికి మొన్న 2013లో 5 వేల మరణాలకు కారణమైన కేదారనాథ్ వరదల్ని విస్మరిస్తే ఎలా? పర్యావరణం పట్ల మనం చేస్తున్న ఈ పాపం పెను శాపంగా మారక ముందే కళ్ళు తెరిస్తే మంచిది. హిమాలయ పర్వత సానువులు అనేకులకు అతి పవిత్రమైనవీ, అమూల్యమైనవీ గనక వాటిని పరిరక్షించడం మరింత ఎక్కువ అవసరం. అందుకు దీర్ఘకాలిక ప్రణాళికా రచన తక్షణ కర్తవ్యం.

నిరుద్యోగులకు భరోసా ఉందా?

సందర్భం



బండి సంజయ్‌కుమార్

నిరుద్యోగ యువత సమస్యలపై బీజేపీ చేపట్టిన ఉద్యమం కొనసాగుతోంది. ఇప్పటికే పోరుగడ్డ వరంగల్‌లో నిర్వహించిన నిరుద్యోగుల మార్చ్ జయప్రదం అయింది. నేడు పాలమూరు జిల్లా కేంద్రంల్లో జరిగే 'నిరు ద్యోగ మార్చ్'ను కూడా జయప్రదం చేయా లని బీజేపీ విజ్ఞప్తి చేస్తోంది. నిరుద్యోగ యువత భవిష్యత్తును బజారుపాలు చేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకే ఈ పోరాటం.విపక్షాలన్నీ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను రద్దు చేయాలని ముక్త కంఠంతో కోరుతున్నాయి. ఒక సమస్య ఉత్పన్నమైతే అఖిల పక్ష సమావేశం నిర్వహించి సలహాలు కోరాలన్న విజ్ఞత ప్రభుత్వానికి ఎటూ లేదు. కనీసం మీడియాలో వస్తున్న వార్తలపై నైనా స్పందించాలన్న స్పృహ లేకపోవడం బాధిస్తోంది. అప్పులు చేసి తమ బిడ్డలనుచదివిస్తున్న తల్లిదండ్రుల ఆవేదన అర్థం కాకపోవడం దురదృష్టకరం.

ఉమ్మడి రాష్ట్రంలోనే అత్యంత వెనుక బడిన ప్రాంతం పాలమూరు జిల్లా. పొట్టకూటి కోసం ముంబయి, సూరత్, దుబాయ్‌కి వలసలు పోయే ప్రజలు ఎక్కువగా ఉన్న జిల్లా ఇది. కానీ, వలసలు ఆగిపోయాయనీ, వలసబోయినవాళ్లు కూడా తిరిగి వస్తు న్నారనీ అంటున్నారు. ఇది పచ్చి అబద్ధం. ఎప్పుడో నూటికో కోటికో పెట్టే ఉద్యోగ పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అవుతుంటే ఉపాధి లేని యువత కూడా మిగిలిన కూలీలతో కలిసి వలస బాట పట్టవలసి వస్తోంది. నారాయణపేటకు రండి. ముంబ యికి ఆర్టీసీ నడుపుతున్న బస్సులు ఎందుకు కిటకిట లాడుతున్నాయో మీకర్థమవుతుంది.

స్వరాష్ట్రంలో మన కొలువులు మనకే దక్కుతాయనేది నిరు ద్యోగుల కల. అటువంటి యువత ఆశలను కల్లలు చేసింది తెరాస ప్రభుత్వం. అసమర్థ పాలన వల్ల 30 లక్షల మంది యువత భవిష్యత్తు ఆగమైంది. నోటిఫికేషన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూసిన నిరు ద్యోగ యువతను పచ్చి దగా చేసిన పాలన ఇది. లక్షల మంది నిరుద్యోగులూ, వారి తల్లిదండ్రులూ ఆందోళన చెందుతుంటే ఫామ్ హౌస్ ఎందుకు స్పందించటం లేదు? అసలు దోషులను తప్పించి కేసును మూసి వేయాలనే ధోరణి వెనుకనున్న ఆంతర్యం ఏమిటి? ప్రశ్నపత్రాల లీకేజీపై కనీసం సమీక్ష చేసే సమయం కూడా లేక పోవడం వెనక ఉన్న ఉద్దేశ్యం ఏమిటి? దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్లుగా ప్రశ్నపత్రా లను బఠానీలలా అమ్ముకుంటుంటే ప్రభుత్వాన్ని ఏమని సంబోధించాలి?

ప్రభుత్వంలో అందరూ సుద్దపూసలైతే ప్రశ్నపత్రాల లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జీతో న్యాయవిచారణకు ఎందుకు వెనకాడు తున్నారు? స్వతంత్ర ప్రతిపత్తి గలిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్న పత్రాల లీకేజీని ఆషామాషీగా మాట్లాడుతున్న మంత్రులను ఏమ నాలి? 'ప్రతీ కంప్యూటర్‌కు నేనే కాపాలదారుణ్ణా?' అంటున్న ఐటీ మినిస్టర్‌ను మంత్రి వర్గంలో కొనసాగించడం నైతికంగా సరే అనిపిస్తుందా?

నిరుద్యోగ యువత భవిష్యత్తును అంధకారం చేస్తున్న ప్రభుత్వ చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం. నిరుద్యోగ భృతిపై ఇచ్చిన ఎన్నికల హామీపై ఇప్పటికే మాట తప్పారు. ప్రభుత్వ శాఖల్లో 2 లక్షలకు పైగా ఖాళీలుంటే వాటి భర్తీపై నోరు మెదపడం లేదు. అరకొర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తున్నా వాటికి అనేక కిరికిరులు సృష్టిస్తున్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్న ప్రభుత్వానికి పుట్టగతు లుండవు. గతంలోనూ నిరుద్యోగ యువతతో పెట్టుకున్న ప్రభుత్వా లకు తగిన గుణపాఠం చెప్పారు. భవిష్యత్తులో ప్రభుత్వం కూడా అటువంటి గుణపాఠం ఎదుర్కోక తప్పదు.

ప్రశ్నపత్రాల లీకేజీలో అసలు దోషులు తేలాలంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలి. లీకేజీకి కారకులను కఠినంగా శిక్షించాలి. ఆర్థికంగా నష్టపోయిన ప్రతీ విద్యార్థికి లక్ష రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలి. రాష్ట్ర టెక్నాలజీ శాఖ మంత్రిని వెంటనే భర్తరఫ్ చేయాలి. పబ్లిక్ సర్వీస్ కమిషన్ బోర్డును మొత్తంగా రద్దు చేసి ప్రక్షాళన చేయాలి. కొత్త బోర్డు ఏర్పాటు చేస్తేనే పోటీ పరీక్షలు సక్రమంగా జరుగుతాయనే విశ్వాసం నిరుద్యోగుల్లో కలుగుతోంది.

వ్యాసకర్త ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు

కుట్రదారులతో కుమ్మక్కు

వైఎస్ వివేకా రాజకీయ ప్రత్యర్థులతో జట్టుకట్టిన ఆయన కుమార్తె, అల్లుడు

- వివేకా రాసిన లేఖను గోప్యంగా ఉంచటమనేది వివేకా కుటుంబీకులు, టీడీపీ కలిసి వేసిన స్కెచ్చా?
- అలా గోప్యంగా ఉంచి.. అవినాశ్‌ను ఇరికించాలనేది వారి ప్రధాన ఉద్దేశమా?
- ఈ కోణాల్లో సాగాల్సిన దర్యాప్తును ఆది నుంచీ ప్రభావితం చేస్తున్న ఎల్లో మీడియా
- హంతకుడు దస్తగిరితో పాటు బీటెక్ రవి వంటి కుట్రదారులతోనూ ఇంటర్వ్యూలు
- తనను వివేకా బావమరుదులు ఇంటికొచ్చి బెదిరించారంటున్న రెండో భార్య షమీమ్
- హత్య జరిగిన రోజు నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు హల్‌చల్
- ఎప్పటికప్పుడు ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి, కడప ఎస్పీతో మంతనాలు
- తగిన ఆదేశాలిస్తూ.. చంద్రబాబుకు అప్‌డేట్ ఇస్తూ మంత్రాంగం



అవినాశ్‌ను వివేకా ఇంటికి వెళ్లమని చెప్పింది శివప్రకాశ్‌రెడ్డే

వివేకా హత్య కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు చంద్రబాబు టీమ్ పక్కా పన్నాగంతో వ్యవహరించింది. వాస్తవాలు వెలుగులోకి రాకుండా...కేవలం ఊహాగానాలు, అభూతకల్పనల చుట్టూనే దర్యాప్తు కేంద్రీకృతం అయ్యేలా చేసేందుకు ప్రయత్నిస్తోంది. అందుకే టీడీపీ అనుకూల పచ్చ మీడియాలో రోజుకో కట్టుకథను ప్రచారంలోకి తీసుకువస్తూ అటు సీబీఐ దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తూ... ఇటు ప్రజలనూ తప్పుదారి పట్టిస్తోంది. ఎంపీ అవినాశ్ రెడ్డినే లక్ష్యంగా చేసుకుని విషం చిమ్ముతోంది. ఎంపీ అవినాశ్ రెడ్డి వివేకా నివాసానికి ఏ సమయానికి వెళ్లారు... అక్కడ ఏం చూశారు అన్నదే ప్రధానాంశంగా చేసుకుని... వివేకా మృతదేహానికి కుట్లు వేశారని, కట్లు కట్టారనే అవాస్తవాలను ప్రచారంలోకి తీసుకువస్తోంది. వివేకానందరెడ్డి పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి 2019 మార్చి 15న ఉదయం 6.20 గంటల సమయంలో ఫోన్ చేసి చెబితేనే ఎంపీ అవినాశ్ రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లారు. అప్పటికే ఎన్నికల ప్రచారం కోసం తన అనుచరులతో జమ్మలమడుగు వెళుతున్న ఆయనకు శివ ప్రకాశ్‌రెడ్డి నుంచి ఫోన్ వచ్చింది. ఆ ఫోన్ రాకపోయి ఉంటే ఆయన జమ్మలమడుగు వెళ్లి ఉండేవారు. వివేకా మరణించారని చెప్పి... వెంటనే వెళ్లమంటేనే అవినాశ్ అక్కడికి వెళ్లారు. ఆయన అక్కడకు వెళ్లినా పీఏ కృష్ణా రెడ్డి మాత్రం వివేకా రాసిన లేఖ గురించి చెప్పలేదు. ఎందుకంటే ఆ లేఖ విషయం గోప్యంగా ఉంచమని సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఆయన్ని ఆదేశించారు. ఆ లేఖ విషయాన్ని శివ ప్రకాశ్ రెడ్డి ఎంపీ అవినాశ్‌కు ఫోన్ చేసినప్పుడు చెప్పినా... లేక ఆయన వివేకా ఇంటికి రాగానే పీఏ కృష్ణా రెడ్డి చెప్పినా ఎవ్వరూ భౌతిక కాయాన్ని తాకే ఉండేవారే కాదు. ఆ లేఖ విషయాన్ని అవినాశ్ వెంటనే పోలీసులకు చెప్పి ఉండేవారు. వివేకా హత్యకు గురయ్యారని అందరికీ వెంటనే తెలిసిపోయేది. అప్పటికే భారీగా చేరుకుంటున్న కార్యకర్తలు, సాధారణ ప్రజల్ని ఆ మృతదేహం దగ్గరకు ఎవరూ వెళ్లకుండా అవినాశే కట్టడి చేసేవారు. దాంతో ఈ కేసులో కీలక ఆధారాలు పోలీసులకు దొరికేవి. కానీ అలా జరగడం నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డికి ఏమాత్రం ఇష్టం లేదని వాళ్ల పన్నిన వ్యూహమే చెబుతోంది. అందుకే ఆయన లేఖ విషయాన్ని ఎంపీ అవినాశ్‌కు చెప్పలేదు. నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరించి వివేకా హత్య కేసును తప్పుదారి పట్టించారని చెప్పటానికి ఇంతకన్నా ఆధారాలేం కావాలి?

తండ్రిని హత్య చేసినవానిపై పగ తీర్చుకునే కథతో తెలుగులో ఎన్నో సినిమాలు వచ్చాయి. హత్యకు కుట్ర చేసినవారిని జైలుకు పంపించేవరకు చేసిన న్యాయ పోరాటాలూ చూశాం. కానీ తండ్రిని హత్య చేసిన హంతకుడిని ఆప్తుడిగా భావిస్తూ సఖ్యతగా ఉండటం ఏ సినిమా కథలోనూ లేదు. తండ్రి రాజకీయ ప్రత్యర్థులతో జట్టు కట్టడం ఎక్కడా వినలేదు. అందుకే వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె, అల్లుడు, పెద్ద బావమరిది తీరు విస్మయం కలిగిస్తోంది. వివేకా రాజకీయ ప్రత్యర్థులు చంద్రబాబు, ఆది నారాయణ రెడ్డి, బీటెక్ రవిలతో ఆయన కుటుంబ సభ్యులు జట్టు కట్టారు. హతుడైన వివేకా కుటుంబ సభ్యులు హంతకుడైన దస్తగిరితో చేతులు కలిపారు. ఈ కుట్ర కథలో సూత్రధారులు, పాత్రధారులూ ఒక్కటయ్యారు. ఆస్తి, రాజకీయ వారసత్వం కోసం కక్ష గట్టిన కుటుంబ సభ్యులు కూడబలుక్కుని వాస్తవాలు దాచిపెడుతున్నారు. రాజకీయ ఆధిపత్యం కోసం కాచుకుని కూచున్న ప్రత్యర్థి పార్టీ నేతలు ఆడించినట్టు ఆడుతున్నారు. వెరసి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిజాలకు పాతరేసేందుకు ఆయన సొంత కుటుంబ సభ్యులే యత్నిస్తున్నారు. ఆర్థిక, రాజకీయ వారసత్వ విభేదాలతో వివేకా హత్య దర్యాప్తును తప్పుదారి పట్టిస్తున్న ఈ ముఠా పన్నాగం అందర్నీ విస్మయానికి గురిచేస్తోంది.

వివేకా శత్రువులతో జట్టుకట్టిన ఆయన కుటుంబ సభ్యులు

వైఎస్ వివేకానందరెడ్డికి బయట శత్రువులు, ప్రత్యర్థులతో ఆయన కుటుంబ సభ్యులే జట్టు కట్టడం విభ్రాంతి కలిగిస్తోంది. ఆయనకు రాజకీయంగా శత్రువులు, ప్రత్యర్థులు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆ పార్టీ నేతలు ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవి కాగా... ఆస్తి, రాజకీయ వారసత్వ విభేదాలతో అల్లుడు–చిన బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి ఆయనకు ఇంట్లోనే శత్రువులుగా మారారన్నది బహిరంగ రహస్యం. అలాంటి నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివ ప్రకాశ్ రెడ్డితో పాటు వివేకానందరెడ్డి కుమార్తె సునీత కూడా ప్రస్తుతం ఆ టీడీపీ నేతలతో అత్యంత సన్నిహితంగా ఉంటుండటం విస్మయపరిచేదే. వాస్తవానికి ఒకప్పుడు వివేకా వద్ద డ్రైవర్‌గా ఉన్న దస్తగిరిని సునీతే పన్లోంచి తొలగించారు. అదే దస్తగిరి వివేకాను నరికి హత్య చేస్తే... అతనితో సునీత, ఆమె భర్త సఖ్యతగా ఉంటున్నారు. ఈ పరిణామాలను పరిశీలిస్తే ఓ కీలకమైన అంశం చర్చించాల్సిన అవసరం ఏర్పడుతోంది.

ఏది నిజం?

వివేకానందరెడ్డి మరణిస్తే ఎవరికి ప్రయోజనం అన్నది ఈ కేసులో కీలకంగా మారుతోంది. కడప జిల్లాలో కనీసం ఉనికి చాటుకోవాలంటే వివేకానందరెడ్డి ఉండకూడదన్నది టీడీపీకి రాజకీయ అవసరం. తాను కడప ఎంపీగా పోటీ చేస్తున్నందున వివేకానందరెడ్డి అడ్డుతొలగించుకోవడం అప్పటి టీడీపీ మంత్రి ఆదినారాయణ రెడ్డికి ప్రయోజనకరం. పులివెందులలో పట్టు సాధించడానికి వివేకానే అడ్డున్నారన్నది బీటెక్ రవి ఉద్దేశం. అందుకే 2017లో ఎమ్మెల్సీ ఎన్నికల్లోఆయన్ని దొంగదెబ్బతీసిన ఈ ముఠానే 2019లో ఏకంగా భౌతికంగా అడ్డుతొలగించుకునేందుకు కుట్ర పన్నారనటానికే ఎక్కువ అవకాశాలున్నాయని చెప్పాలి. మరి వారితో వివేకా కుమార్తె, అల్లుడు, పెద్ద బావమరిది సఖ్యతగా ఉండటం వెనుక అసలు కోణం ఏమిటన్నదే ఈ కేసులో కీలకం. అసలు టీడీపీ మంత్రిగా ఉన్న ఆదినారాయణ రెడ్డి... వివేకా పెద్ద బావమరిది శివ ప్రకాశ్ రెడ్డికి ఎలా సన్నిహితుడయ్యారు? అదీ ఆదినారాయణ రెడ్డిని ఎంపీ ఎన్నికల్లో ఓడించి సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని గెలిపించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్న నేపథ్యంలో...! దీని వెనుకే అసలు గూడు పుఠాణీ ఉంది. వివేకానందరెడ్డి మరణించిన విషయాన్ని ఆయన పీఏ కృష్ణారెడ్డి చెబితే శివ ప్రకాశ్ రెడ్డి వెంటనే ఎవరికి సమాచారం ఇవ్వాలి... సాధారణంగా సమీప బంధువులకు ముందు చెప్పాలి. కానీ వివేకానందరెడ్డి రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న అప్పటి టీడీపీ మంత్రి ఆది నారాయణ రెడ్డికి మొదట ఫోన్ చేసి సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆయనేమీ వివేకాకు బంధువు కాదు... మిత్రుడు అంతకన్నా కాదు. పైపెచ్చు రాజకీయ ప్రత్యర్థి. ఏదో విషయాన్ని గోప్యంగా ఉంచాలన్న ఉద్దేశంతోనో... విషయాన్ని పక్కదారి పట్టించే ఎత్తుగడతోనో వారిద్దరి మధ్య ఫోన్ సంభాషణ జరిగి ఉంటుందన్నది తేలిగ్గానే అర్థమవుతుంది.

వివేకా ఇంట్లో ఆస్తి, రాజకీయ వారసత్వ విభేదాలు

వివేకానందరెడ్డి రెండో వివాహం అనంతరం ఆయన కుటుంబంలో తలెత్తిన పరిణామాలు ఈ కేసులో అత్యంత కీలకం. తన రెండో భార్య షమీమ్‌కు ఆస్తిలో వాటా ఇస్తానని... ఆమెతో తనకు పుట్టిన కుమారుడిని రాజకీయ వారసుడిగా ప్రకటిస్తానని వివేకా చెప్పడమే ఆ కుటుంబంలో విభేదాలకు ఆజ్యం పోసింది. ఎందుకంటే ఆయన ఆస్తికి ఏకైక వారసుడిని కావాలని అల్లుడు–చిన బావమరిది నర్రెడ్డి రాజశేఖర రెడ్డి పట్టుదలతో ఉన్నారు. అందుకే ఆస్తిలో షమీమ్‌కు వాటా ఇవ్వడాన్ని ఆయన వ్యతిరేకించారు. ఇక రాజకీయంగా వివేకా వారసత్వాన్ని అందుకోవాలని పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి భావిస్తున్నారు. అందుకు వివేకా సమ్మతించకపోవడంతో పాటు తన రెండో భార్య కుమారుడిని రాజకీయ వారసుడిగా ప్రకటిస్తాననేసరికి కక్ష

'కట్టు'కథలో ఇరికించడానికేనా?

వివేకానందరెడ్డిని హత్య చేసి.. గుండెపోటుతో మరణించారన్న కట్టు కథను తెరపైకి తేవడానికే శివప్రకాశ్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి ఫోన్లో మాట్లాడుకుని ఉంటారన్నది కాస్త లోతుగా పరిశీలిస్తే అర్థమయ్యే విషయం. వారిద్దరి ఫోన్ సంభాషణ అనంతరమే గుండె పోటు కథ తెరపైకి వచ్చింది. వివేకా గుండె పోటుతో మరణించారని శివప్రకాశ్ రెడ్డి తనతో చెప్పారని ఆది నారాయణ రెడ్డి మీడియాకు వెల్లడించారు. ఎక్కువగా సిగరెట్లు తాగడంతోనే అలా అయ్యి ఉంటుందని తాను ఆయనతో చెప్పినట్లు కూడా వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి ఎంత కుట్రపూరితంగా గుండె పోటు కథను తెరపైకి తెచ్చారో తెలియటం లేదా? మరోవైపు వివేకాను కుట్రపూరితంగా ఓడించిన బీటెక్ రవి, వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి సన్నిహితుడయ్యారు. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలకు డబ్బులు ఇచ్చి ప్రలోభాలకు గురిచేసి తాను ఎమ్మెల్సీగా గెలిచానని బీటెక్ రవి తాజాగా పచ్చ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సైతం అంగీకరించారు. అదే ఇంటర్వ్యూలో వివేకానందరెడ్డి అల్లుడు నర్రెడ్డి రాజశేఖర రెడ్డి, తాను ఇప్పటికీ అత్యంత సన్నిహితులమని కూడా చెప్పడం గమనార్హం. అంటే వివేకా మరణంతో రాజకీయంగా, ఆర్థికంగా లబ్ధి పొందుతామని భావిస్తున్న వారంతా అప్పుడు ఇప్పుడూ ఒకే జట్టుగా ఉంటున్నారన్నది అర్థం కావటం లేదా?

గట్టారు. అందుకే వివేకా భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె, అల్లుడు ఆయన్ని విడిచిపెట్టి హైదరాబాద్‌లో ఉంటుండగా... షమీమ్‌తో సునీత ఘర్షణ పడ్డారు. జుగుప్సాకరమైన భాషలో వాట్సప్ మెసేజుల ద్వారా దూషించుకున్నారు. షమీమ్‌ను వివేకా బావమరుదులిద్దరూ తీవ్రంగా బెదిరించారు.

2012లో రోడ్డు ప్రమాదానికి గురైన వివేకాను చూసేందుకు వెళ్లిన షమీమ్‌ను శివప్రకాశ్ రెడ్డి ఇంట్లోకి రానివ్వలేదు. ఆయన హెచ్చరించడంతో... ప్రాణభయంతో షమీమ్ అన్నయ్య, వదిన కుటుంబం పులివెందుల విడిచిపెట్టి వెళ్లిపోయింది. నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివ ప్రకాశ్ రెడ్డిలతో ముప్పు ఉన్నందునే షమీమ్ హైదరాబాద్‌లో తన చిరునామా కూడా గోప్యంగా ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. షమీమ్‌కు ఓ ఇల్లు ఇవ్వాలని... ఆమె కుమారుడిని హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివించాలని అనుకుంటున్నా గానీ తన కుటుంబ సభ్యులు అడ్డుపడుతుండటంతో సాధ్యం కావడం లేదని వివేకా సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు కూడా. ఎందుకంటే అప్పటికే కుటుంబ వ్యాపార సంస్థలకు సంబంధించి ఆయనకు ఉన్న చెక్ పవర్‌ను ఆయన కుటుంబ సభ్యులు తొలగించారు. వివేకా ఇద్దరు బావమరుదులు తనను తీవ్రంగా బెదిరించారని వారితో తనకు తన కుమారుడికి ముప్పు ఉందని షమీమ్ సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలోనూ స్పష్టం చేశారు. వివేకాకు కూడా ఆయన ఇద్దరు బావమరుదుల నుంచే ముప్పు ఉండేదని చెప్పారామె. ఈ నేపథ్యంలో కుటుంబంలో ఆస్తి, రాజకీయ వారసత్వ విభేదాలు ఆయన హత్య వెనక ఎంత బలంగా ఉండవచ్చో తెలియకమానదు.

రక్తపు మరకల లేఖపై గప్‌చుప్..!!

వివేకానందరెడ్డికి ఇంటా, బయటా ఉన్న శత్రువులందరూ అన్ని విషయాలపైనా మాట్లాడుతున్నారు కానీ... రక్తపు మరకలతో ఉన్న లేఖపై మాత్రం మౌనం వహిస్తున్నారు. అదే వివేకా రాసిన లేఖ. వివేకా రక్తపు మరకలతో తడిసిన లేఖపై... అంతా కూడబలుక్కుని నిర్ణయించుకున్నట్టు ఒక్క మాటా మాట్లాడటం లేదు. ఎందుకంటే ఈ హత్య కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు చంద్రబాబు, ఆయన బృందం పన్నిన వ్యూహంలో భాగమే ఆ లేఖపై మౌనం!!.

విచిత్రమేమంటంటే తరచూ టీడీపీ వేదికల మీద ఈ కేసు గురించి మాట్లాడే చంద్రబాబు ఒక్క రోజు కూడా వివేకా రాసిన లేఖ గురించి ప్రస్తావించ లేదు. సునీత, ఆమె భర్త కూడా అసలు అలాంటి లేఖ ఒకటి ఉన్నట్టుగా కూడా మాట్లాడటం లేదు. ఎందుకంటే వివేకా గుండె పోటుతో మరణించారనే కట్టు కథను ప్రచారంలోకి తెచ్చేందుకే ఆ లేఖను ఆ ముఠా గోప్యంగా ఉంచే ప్రయత్నం చేసింది. వివేకాపై తీవ్రంగా దాడిచేసిన తరువాత హంతకులు ఆయన చేత బలవంతంగా లేఖ రాయించారు. వాళ్ల బెదిరించడంతో... డ్రైవర్ ప్రసాద్ తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్టు ఆ లేఖలో వివేకా రాశారు. ఆ లేఖను మొదట.. అంటే 2019, మార్చి 15న ఉదయం 6.10 గంటల లోపే చూసిన ఆయన పీఏ కృష్ణారెడ్డి... ఆ విషయాన్ని సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి చెప్పారు. తాము వచ్చే వరకు ఆ లేఖను, సెల్‌ఫోన్‌ను ఎవరికి ఇవ్వకుండా దాచి ఉంచాలని నర్రెడ్డి రాజశేఖరరెడ్డి పీఏ కృష్ణారెడ్డితో చెప్పారు. వారు అలా చెప్పకపోయి ఉంటే కృష్ణారెడ్డి ఆ లేఖ విషయాన్ని వెంటనే బయటపెట్టేవారు. దాంతో వివేకాది హత్యేనని అందరికీ వెంటనే స్పష్టత వచ్చేది. గుండెపోటో మరొకటో కాదని వెంటనే తెలిసిపోయేది. అలా తెలిసి ఉంటే... ఎవ్వరూ మృతదేహాన్ని తాకే ప్రయత్నం చేసి ఉండేవారు కాదు. అప్పుడసలు "రక్తపు మరకలు కడిగిందెవరు? గాయాలకు కట్లు కట్టిందెవరు?" అని పదే పదే ప్రశ్నించే అవకాశం చంద్రబాబు నాయుడికి వచ్చి ఉండేదే కాదు.

కానీ వారు అలా చేయలేదు. వివేకా గుండెపోటుతో మరణించారని ప్రచారం చేయాలన్న ఉద్దేశంతోనే ఆ లేఖను బయటపెట్టకూడదని సునీత, ఆమెభర్త రాజశేఖరరెడ్డి, బావ శివప్రకాశ్ రెడ్డి నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది. అనంతరం టీడీపీ మంత్రి ఆదినారాయణ రెడ్డి ద్వారా గుండె పోటు కథను ప్రచారంలోకి తెచ్చారు. గుండె పోటు కథ ప్రచారంలోకి రావడంతో తమ లక్ష్యం నెరవేరిందని వారు భావించారు. ఆ రోజు మధ్యాహ్నం 1 గంట సమయంలో సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి పులివెందుల చేరుకోవటంతో ఆ లేఖతోపాటు వివేకా సెల్‌ఫోన్‌ను కృష్ణారెడ్డి వారికి ఇచ్చారు. ఆ లేఖను చదివాక కూడా వెంటనే దాన్ని పోలీసులకు అప్పగించనే లేదు. ఆ సెల్‌ఫోన్‌లోని మెస్సేజులు, డేటాను డిలీట్ చేశారు. అనంతరం సునీత ఆదేశాలతో సాయంత్రం 5గంటలకు కృష్ణారెడ్డి ఆ లేఖను, సెల్‌ఫోన్‌ను పోలీసులకు ఇచ్చారు. ఆ లేఖను సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఎందుకు గోప్యంగా ఉంచారన్నది ఈ హత్య కేసులో కీలకాంశం. ముందస్తు పన్నాగం ప్రకారమే ఆ లేఖపై మాత్రం ఇటు సునీత, ఆమె భర్త గానీ అటు చంద్రబాబు, టీడీపీ నేతలుగానీ మాట్లాడటం లేదు.

అమరావతి నుంచి కథ నడిపిన బాబు..

వైఎస్ వివేకా హత్యకు గురైన రోజు అప్పటి సీఎంగా ఉన్న చంద్రబాబు అమరావతి నుంచి పెద్ద కథే నడిపారు. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు కడప ఎస్పీతోనూ టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణ రెడ్డితోను, అప్పట్లో ఎమ్మెల్సీగా ఉన్న బీటెక్ రవితోను ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ కేసు దర్యాప్తును ప్రభావితం చేశారు. వివరాలు ఎప్పటికప్పుడు చంద్రబాబుకు అప్‌డేట్ చేశారు. కడప ఎస్పీకి సైతం ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు దర్యాప్తును ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించేందుకు ఏబీవీ ఎందుకు అంతగా తాపత్రయ పడ్డారన్నది ఇప్పటికీ ప్రశ్నార్థకమే. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ... తాను జరిపిన దర్యాప్తులో అసలు లేఖ విషయమే పట్టించుకోలేదు.

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

నాన్న స్ఫూర్తితో...



పంజాబ్ సింహం, హిందుస్థాన్ పుత్రుడు, కెనడా ప్రేమికుడు, సత్య ప్రేమి, న్యాయపోరాట యోధుడు, పీడితులు, దుర్బలులు, అణిచివేతకు గురైన వారి గొంతుక తారెక్ ఫతాహ్ (1949–2023) తన పోరాట స్ఫూర్తిని బదలాయించారు. ఆయనను ప్రేమించినవాళ్లు ఆయన పోరాటాన్ని కొనసాగిస్తారు. (కెనడాలో స్థిరపడిన ఉదారవాద ముస్లిం యాక్టివిస్ట్ తారెక్ ఫతాహ్ ఏప్రిల్ 24న మరణించారు. తాను పాకిస్తాన్‌లో పుట్టిన భారతీయుడినని చెప్పుకొనేవారు.)

– నతాషా ఫతాహ్, తారెక్ ఫతాహ్ కూతురు

ఆడుతూ వ్యాయామం



ప్రపంచ డ్యాన్స్ దినోత్సవం ఈ శనివారం ఉంది. కానీ నేను దాన్ని ఈ వారమంతా జరుపుకోనున్నాను. అందుకే కొన్ని ముఖ్యమైన వ్యాయామాలకు డ్యాన్స్‌ను కలపడం ద్వారా వాటికి సరదాను జోడించాను.

– శిల్పా శెట్టి కుంద్రా, నటి

సచిన్‌కు యాబై!



నా స్నేహితుడు, లివింగ్ లెజెండ్, ముంబయి ఇండియన్స్ జట్టులో నా ఓపెనింగ్ భాగస్వామి సచిన్ (టెండుల్కర్)కు హ్యాపీ ఫిఫ్టీ!

– సనత్ జయసూర్య, శ్రీలంక క్రికెటర్

ఎదురుచూపులు



మనుషులు ఇరవై లక్షల సంవత్సరాలుగా ఈ భూమ్మీద ఉంటున్నారు. కానీ దేవుళ్లు మాత్రం కేవలం పది వేల సంవత్సరాల క్రితమే వచ్చారు. అంతకు ముందు కాలమంతా వాళ్లు ఏం చేస్తున్నట్టు?

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

గందరగోళపు టిక్కులు



ప్రభుత్వ అధికారుల్లో చాలామంది 'బ్లూ టిక్' కోల్పోయారు. ఎందుకూ పనికి రాని కొన్ని హ్యాండిల్స్‌కేమో ఉంది. ఈ ట్విట్టర్ ఇంతకు ముందులా లేదు.

– దీపికా భరద్వాజ్, వ్యాఖ్యాత

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: శు.పంచమి ఉ.9.44 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: ఆరుద్ర తె.4.24 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి పునర్వసు, వర్జ్యం: ఉ.11.34 నుండి 1.17 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.11 నుండి 9.03 వరకు, తదుపరి రా.10.49 నుండి 11.35 వరకు, అమృతఘడియలు: సా.5.34 నుండి 7.19 వరకు, గురుమూఢమి త్యాగం, శ్రీశంకరజయంతి ; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 5.49, సూర్యాస్తమయం: 6.11.

తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి



తడిచిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న రేవంత్

సూర్యాపేట రూరల్: ఇటీవల కురిసిన అకాల వర్షాలతో తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తూ మార్గమధ్యంలో ఖమ్మం జాతీయ రహదారిపై సూర్యాపేట మండలంలోని టేకుమట్ల వద్ద తడిచిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, మద్దతు ధర కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం వేదికగా జరిగే సభలో రైతులకు జరుగుతున్న నష్టంపై ప్రభుత్వాన్ని నిలదీస్తానని హామీ ఇచ్చారు. రైతులు అధైర్యపడవద్దని తడిసిన ప్రతి గింజనూ కొనుగోలు చేసేంతవరకు పోరాడతానని చెప్పారు. అంతకుముందు రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. రేవంత్ వెంట ఖమ్మం మాజీ ఎంపీ రేణుకాచౌదరి, స్థానిక నాయకులు చకిలం రాజేశ్వర్‌రావు, అమ్జద్ అలీ, వెంకట్‌రెడ్డి, పోలగాని బాలుగౌడ్, ఎల్గూరి వెంకటేష్, గునగంటి సైదులు, ఆలేటి మాణిక్యం తదితరులు ఉన్నారు.

రైతన్న ఆశలు ఆవిరి

అకాల వర్షంతో కోసిన పంట నీళ్లపాలు

- కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో కొట్టుకుపోయిన పంట
- రాష్ట్రంలో కోతలు సాగుతున్నా, కొనుగోళ్లు లేక రైతన్న విలవిల.. నేలరాలిన పంట చూసి సిరిసిల్ల జిల్లాలో గుండెపోటుతో రైతన్న మృతి
- తడిచిన ధాన్యం ఆరిన వెంటనే కొంటాం: గంగుల



నిజామాబాద్ జిల్లా రెంజర్లలో వర్షపు నీటికి ధాన్యం కొట్టుకుపోకుండా కాలువ తీస్తున్న రైతు

సాక్షి, హైదరాబాద్: అకాల వర్షంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీళ్ల పాలవడంతో రైతన్న గుండె చెదిరింది. భారీ వర్షం, వడగళ్లతో కోతకు వచ్చిన పంట పొలంలోనే కుప్పకూలి గింజ లేకుండా రాలిపోగా, కోసి ఆరబోసిన పంట కూడా వర్షార్పణమైంది. వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. పంట మొత్తం నాశనమవడాన్ని చూసి తట్టుకోలేని సిరిసిల్ల జిల్లా కోనరావుపేటకు చెందిన పంబాల స్వామి (53) గుండెపోటుతో కుప్పకూలారు. ప్రధానంగా కరీంనగర్, వరంగల్, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో వర్ష బీభత్సంతో వేలాది ఎకరాల పంటనష్టం జరిగింది. కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసిన వేల టన్నుల ధాన్యం నీళ్లపాలైంది. 50 వేల ఎకరాల్లోనే వరి పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసినా, అది ఎన్నో రెట్లు ఎక్కువగా ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనను బట్టి అర్థమవుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పంట నష్టం అత్యధికంగా ఉన్నట్లు వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల శాఖ తేల్చాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 78,984 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తేల్చారు.

కొనుగోళ్లకు ఆటంకం

అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో కూడా ధాన్యం తడవగా, రెండు రోజులుగా కొనుగోళ్లు సాగడం లేదు. ఇంకా వర్షసూచన ఉండడంతో మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని భావిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో పలుచోట్ల సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో కోత కోసి ఆరబెట్టిన ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. నువ్వులు, సజ్జ పంటలు నేలకొరిగాయి. ముప్కాల్, మోర్తాడ్, ఆర్మూర్, కమ్మర్ పల్లి, నాగంపేట్‌లలో వర్షం కురిసింది. జనగామ జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన పడింది. బచ్చన్నపేట మండలంలోని బండనాగారం, కేసిరెడ్డిపల్లి, కొడవటూరు, లక్ష్మాపూర్ గ్రామాల్లో వడగళ్లు పడ్డాయి. జనగామ మండలం గానుగపాడు వెంకిర్యాల, వడ్లకొండ, మరిగడిలలో భారీ సైజులో వడగళ్లు పడ్డాయి. దీంతో మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

12 జిల్లాల్లో మొదలైన కొనుగోళ్లు

ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో 20 రోజుల క్రితం నుంచే రైతులు కోతలు కోసి ధాన్యాన్ని ఆరబెట్టగా, 10 రోజుల నుంచి కొనుగోళ్లు మొదలయ్యాయి. ఉమ్మడి కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో కోతలు మొదలైనా, కొనుగోలు కేంద్రాలు లేక రైతులు నానాకష్టాలుపడ్డారు. వరి కోతకు వచ్చినా, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదనే కారణంగా చాలామంది రైతులు పంటను కోయలేదు. అకాల వర్షం, వడగళ్లతో పొలాల్లోనే పంట నేలకొరిగింది. దీంతో ఎకరా పొలంలో బస్తా వడ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని, వరిని కోస్తే కోత మిషన్‌కు పెట్టే ఖర్చు కూడా వేస్ట్ అని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో ఈ యాసంగి సీజన్‌లో 7,031 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఇప్పటివరకు కేవలం 12 జిల్లాల్లో 2,161 కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేసి 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నారు.





స్వామి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు. (ఇన్‌సెట్లో) స్వామి

గుండెపోటుతో రైతు మృతి

కోనరావుపేట (వేములవాడ): ఆరునెలలు శ్రమించి సాగుచేసిన పంట ఒక్కరోజులో నేలపాలు కావడంతో తట్టుకోలేని ఆ రైతు గుండె ఆగింది. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేటకు చెందిన పంబాల స్వామి(53)కి మూడెకరాల భూమి ఉంది. అందులో వరి వేశాడు. రెండు రోజుల క్రితమే ఎకరం పొలాన్ని కోయించగా, ఇంకా రెండెకరాల్లో పంటను కోయించాల్సి ఉంది. ఆలోపే ఆదివారం సాయంత్రం వడగళ్ల వాన పడి పంట మొత్తం రాలిపోయింది. దీన్ని చూసి స్వామి దిగాలుగా ఇంటికొచ్చి గుండెలో నొప్పి వస్తోందంటూ పడిపోయాడు. కుటుంబసభ్యులు ఆయనను ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. స్వామికి ఇద్దరు కూతుళ్లు, భార్య ఉన్నారు.

ప్రతీ గింజను కొంటాం



అకాల వర్షంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పంట నష్టం జరిగింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో నష్టం తీవ్రత ఎక్కువగానే ఉంది. నేను స్వయంగా పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పాను. పంట నష్టపోయిన రైతులను కేసీఆర్ ఆదుకుంటారు. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకొనే ప్రక్రియ సాగుతుంది. అవసరమైన మేర టార్పాలిన్లు, తేమ మిషన్లను ఏర్పాటు చేశాం. తడిసిన ధాన్యం ఆరిన వెంటనే కొనుగోలు చేస్తాం. ప్రతీ గింజను కొంటాం.

-మంత్రి గంగుల

గుండెపోటుతో సాహితీవేత్త బాల శ్రీనివాసమూర్తి కన్నుమూత

- సాహితీ సంస్థలు, కవుల సంతాపం



కుత్బుల్లాపూర్, ప్రశాంత్ నగర్ (సిద్దిపేట), తెయూ (డిచ్‌పల్లి): ప్రముఖ సాహితీవేత్త, తెలంగాణ విశ్వవిద్యాలయ తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి గుండెపోటుతో మృతి చెందారు. హైదరాబాద్ సుచిత్ర సమీపంలో తన స్వగృహంలో ఉదయం ఒక్కసారిగా గుండెపోటు తో కుప్పకూలిపోయారు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. 2006లో తెయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకమైన బాలశ్రీనివాసమూర్తి తరువాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ఇటీవలే ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. సీఎం కేసీఆర్ గురువు, ప్రముఖ అష్టావధాని, సిద్దిపేట పట్టణానికి చెందిన గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ కుమారుడే బాల శ్రీనివాసమూర్తి. శ్రీనివాస మూర్తి మరణం సాహితీ లోకానికి తీరని లోటని జాతీయ సాహిత్య పరిషత్, మంజీర రచయితల సంఘం, సిరసం, వెన్నెల సాహితీ సంగమం సంస్థలు సంతాపం తెలిపాయి. శ్రీనివాసమూర్తి మృతదేహానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి నివాళులర్పించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు. శ్రీనివాసమూర్తి ఆకస్మిక మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు.

మనస్తాపానికి గురయ్యారు..: వీసీ

తెలంగాణ వర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులు బాల శ్రీనివాసమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ ప్రొ.డి.రవీందర్ హైదరాబాద్‌కు చేరుకుని నివాళులర్పించారు. బాల శ్రీనివాసమూర్తి ఇటీవలే ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారని, దాన్ని పాలకమండలి రద్దు చేయడంతో మూర్తి మనస్తాపం చెందారని వీసీ అన్నారు.

ఫసల్ బీమా అమలుకాక రైతులకు కష్టాలు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్
- కేంద్రం ఇచ్చిన విపత్తు నిధులను సీఎం ఏం చేశారో చెప్పాలి
- అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సంజయ్



చామనపల్లిలో ఏడుస్తున్న రైతు రాములును ఓదారుస్తున్న బండి సంజయ్

కరీంనగర్ రూరల్/చొప్పదండి: కేంద్ర ప్రభుత్వ ఫసల్ బీమాను తెలంగాణలో అమలు చేసి ఉంటే రైతులకు ఈ దుస్థితి వచ్చేది కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. సోమవారం ఆయన కరీంనగర్ మండలం ఫకీర్‌పేట, చామనపల్లి, బహదూర్‌ఖాన్‌పేట, చొప్పదండి మండలం వెదురుగట్ట గ్రామాల్లో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వరిపంటకు జరిగిన నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. వడగళ్ల వానతో వరిపంటను పూర్తిగా నష్టపోయామని, తమను ఆదుకోవాలని పలువురు రైతులు కంటతడిపెట్టారు. రుణమాఫీ చేయడం లేదని, కొత్త రుణాలివ్వడంలేదని తెలిపారు. ఈ సందర్భంగా కన్నీళ్లు పెట్టుకున్న రైతులు రాములు, సంతోష్‌లను బండి సంజయ్ ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో తెరిచి ఉంటే రైతులకు నష్టం జరిగేది కాదన్నారు. విపత్తుల కింద కేంద్రం తెలంగాణకు కేటాయించిన రూ.3 వేల కోట్లను ఏమి చేశారో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత నెలలో రామడుగులో పర్యటించిన సీఎం కేసీఆర్, ఎకరానికి రూ.10 వేల పరిహారం చెల్లిస్తానని, ఇప్పటివరకు ఎవ్వరికీ ఇవ్వలేదన్నారు. కరీంనగర్ జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు 23 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగితే, కేవలం 8 వేల ఎకరాలకే పరిమితం చేశారని ఆరోపించారు. సర్వేలు, నివేదికల పేరిట మంత్రులు, ఎమ్మెల్యేలు కాలయాపన చేస్తున్నారే తప్పా రైతులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తే, కేంద్ర బృందం పర్యటించి పంటల నష్టపరిహారం మంజూరు చేస్తుందన్నారు. సంజయ్ వెంట చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి ఉన్నారు.

పంట నష్టం వివరాలు పంపండి

కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం వివరాలను మే ఒకటో తేదీలోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. అకాల వర్షాలతో వివిధ జిల్లాలో జరిగిన పంట నష్టంపై కలెక్టర్లతో సోమవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ హనుమంతరావులు పాల్గొన్న వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ.. ప్రతీ మండలానికి ప్రత్యేక అధికారులను నియమించి, పంట నష్టం వివరాలను సమర్పించాలని సూచించారు. గతంలో జరిగిన పంట నష్టానికి సంబంధించిన పరిహారాన్ని సీఎం ఆదేశాల మేరకు సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలిగా గుంటక రూప



కాచిగూడ: తెలంగాణ పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలిగా గుంటక రూప నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు ఆమెకు నియామక పత్రాన్ని నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో అందజేశారు. అనంతరం అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి రూప చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ ఎల్. రమణ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీపీ ఆధ్వర్యంలో సభలు

సాక్షి, హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకొని టీటీడీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక సభలను నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. మే 28న ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా తెలుగుదేశం నేతృత్వంలో 100 ప్రత్యేక సభలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తెలంగాణలో 17 పార్లమెంటు నియోజకవర్గాల్లో ఈనెల 29 నుంచి వచ్చే నెల 20 వరకు సభలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

పట్నా: మోదీ ఇంటి పేరుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై దిగువ కోర్టులో జరుగుతున్న విచారణపై బిహార్ హైకోర్టు స్టే విధించింది. ఇప్పటికే ఇలాంటి కేసులో గుజరాత్ కోర్టు నిందితుడిగా తనను ప్రకటించినందున అవే ఆరోపణలపై మరో కోర్టు విచారణ జరపడం తగదంటూ రాహుల్ గాంధీ వేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సందీప్‌కుమార్ విచారణ చేపట్టారు. దిగువ కోర్టు విచారణను మే 15వ తేదీ వరకు నిలుపుదల చేస్తూ హైకోర్టు ఆదేశాలిచ్చిందని, రాహుల్ పిటిషన్‌పై అప్పటికల్లా సమాధానమిస్తామని బీజేపీ నేత సుశీల్ కుమార్ మోదీ తరఫున లాయర్ చెప్పారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో కర్ణాటకలో జరిగిన సభలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సుశీల్‌కుమార్ మోదీ పరువునష్టం కేసు వేశారు. ఇప్పటికే ఇదే కేసులో రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష పడటం, లోక్‌సభ సభ్యత్వం రద్దు కావడం తెలిసిందే.

కేశవానంద భారతి కేసు చారిత్రక తీర్పుకు 50 ఏళ్లు

న్యూఢిల్లీ: ఎంతో కీలకమైన కేశవానంద భారతి కేసు వివరాలు, వాదోపవాదాలు, రాత పూర్వక వివరాలు, తీర్పుతో కూడిన ప్రత్యేక వెబ్ పేజీని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసు తీర్పునకు ఏప్రిల్ 24తో 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్ణయం తీసుకున్నట్లు సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. రాజ్యాంగ మౌలిక స్వరూపం, పౌరుల ప్రాథమిక హక్కులకు సంబంధించి అత్యంత కీలకమైందిగా ఈ కేసును భావిస్తారు. కేరళ భూసంస్కరణల చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ఈ కేసులో వచ్చిన తీర్పు తదనంతరం ఎన్నో కేసులను దిక్సూచిగా నిలుస్తోంది. కేరళ ప్రభుత్వం ఆశ్రమాల ఆస్తులను స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఆధ్యాత్మిక గురువు కేశవానంద భారతి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.

పై చదువులు అందడం లేదని నోట్లో టపాకాయ పేల్చుకుని...

షియోపూర్: ఉన్నత చదువులపై ఉన్న మమకారాన్ని చంపుకోలేని ఓ యువకుడు నోట్లో టపాకాయ పేల్చుకుని తనువు చాలించాడు. మధ్యప్రదేశ్‌లోని షియోపూర్ జిల్లాలో ఈ ఘోరం చోటుచేసుకుంది. బ్రజేశ్ ప్రజాపతి (24) ఇటీవలే డిగ్రీ పూర్తి చేశాడు. పేదరికం వల్ల పై చదువులు చదివించేందుకు తల్లిదండ్రులు అశక్తత వ్యక్తం చేయడంతో తీవ్ర నిరాశకు గురయ్యాడు. ఆదివారం సుత్లీ బాంబ్ క్రాకర్‌ను నోట్లో పెట్టుకుని నిప్పంటించుకున్నాడు. అది పేలి తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే కన్నుమూశాడు.

వాగ్దానాల నుంచి కోటా దాకా... కీలకాంశాలివే...!

ఆసక్తికరంగా కర్ణాటక ఎన్నికల పోరు



కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. నామినేషన్ల సమర్పణ, పరిశీలన, ఉపసంహరణ గడువు కూడా ముగిసింది. ప్రచారమూ జోరందుకుంది. ఆయా పార్టీల నేతలు ఊరూవాడా ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. పార్టీల ఉచిత వాగ్దానాలతో పాటు రెబెల్స్ వంటి పలు అంశాలు ఈసారి ఎన్నికలను గట్టిగానే ప్రభావితం చేసేలా కన్పిస్తున్నాయి...

- సాక్షి, బెంగళూరు

వాగ్దానాలు, తాయిలాలు

ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ ఈసారి కూడా పోటాపోటీగా ఓటర్లపై హామీల వర్షం కురిపించాయి. ముఖ్యంగా ప్రతి మహిళకూ నెలకు రూ.2,000 అందిస్తామని కాంగ్రెస్ చెప్పడంతో బీజేపీ తక్షణం ప్రతిస్పందించింది. దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలకు నెలకు రూ.3,000 ప్రకటించింది. మహిళా వ్యవసాయ కూలీలకు నెలకు రూ.1,000తో పాటు 30 లక్షల మంది మహిళలకు, 8 లక్షల మంది విద్యార్థినులకు ఉచిత బస్ పాస్ హామీలిచ్చింది. కాంగ్రెసేమో కుటుంబానికి నెలకు 10 కిలోల ఉచిత బియ్యం, పట్టభద్రులకు రూ.3,000 నిరుద్యోగ భృతి, 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తామని పేర్కొంది. ఇక జేడీ(ఎస్) పేద మహిళలకు నెలకు రూ.2,000 జీవన భృతి, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం తదితర వాగ్దానాలు చేసింది. తొలిసారి రాష్ట్రంలో ఎన్నికల బరిలో దిగుతున్న ఆప్ కూడా ఏమీ వెనకబడలేదు. ఉచిత విద్యుత్, తాగునీరు, సాగు రుణ మాఫీ, పట్టణ ప్రాంత మహిళలకు ఉచిత బస్ పాస్ వంటి హామీలిచ్చింది.

'అవినీతి'పై కాంగ్రెస్ ఆశలు

బొమ్మై ప్రభుత్వ అవినీతిపై కాంగ్రెస్ ప్రధానంగా అస్త్రాలు ఎక్కుపెడుతోంది. 40 శాతం కమిషన్ సర్కారు అంటూ చేస్తున్న ఆరోపణలు ప్రజల్లోకి బాగా వెళ్తున్నాయని నమ్ముతోంది. ప్రభుత్వ పెద్దలే ప్రతి పనిలోనూ 40 శాతం కమీషన్లు, ముడుపులు తీసుకుంటున్నారంటూ హో రెత్తిస్తోంది. దీనికి కౌంటర్‌గా కాంగ్రెస్ అధికారంలో ఉండగా కర్ణాటకను ఆ పార్టీ అధిష్టానం అచ్చం ఏటీఎం మాదిరిగా వాడుకుందంటూ బీజేపీ ఎదురు దాడి చేస్తోంది.

'కోటా'తో బీజేపీ ఆట

ఎన్నికల వేళ బీజేపీ సర్కారు వ్యూహాత్మకంగా రిజర్వేషన్ల తేనెతుట్టెను కదిపింది. ముస్లింలకున్న 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేయడమే గాక బలమైన సామాజిక వర్గాలైన లింగాయత్‌లు, ఒక్కలిగలకు చెరో 2 శాతం చొప్పున బదలాయించింది. ఊహించినట్టే ముస్లింల నుంచి దీనిపై భారీ నిరసన ఎదురైనా ఈ ఎత్తుగడ హిందూ ఓట్లను తనకు అనుకూలంగా సంఘటితం చేస్తుందని బీజేపీ నమ్ముతోంది. ఎస్సీ, ఎస్టీలకు కూడా రిజర్వేషన్ పెంచి ఆయా కులాలను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. దీంతోపాటు హిజాబ్, టిప్పు సుల్తాన్ అంశాలూ ప్రభావం చూపనున్నాయి.

పాల ప్యాకెట్లో తుఫాన్

స్థానిక నందిని డెయిరీని దెబ్బతీసేందుకు గుజరాత్‌కు చెందిన అమూల్ డెయిరీ వచ్చి పడుతోందన్న ప్రచారం బీజేపీకి తలనొప్పిగా మారింది. దీన్ని అస్త్రంగా మలుచుకున్నాయి. కర్ణాటకలో అమూల్, నందిని కలసి పనిచేస్తాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పదేపదే ప్రస్తావిస్తోంది. దీనివల్ల దేశంలో రెండో అతి పెద్ద డెయిరీ సహకార వ్యవస్థ అయిన కర్ణాటక పాల సమాఖ్య మనుగడే ప్రమాదంలో పడుతుందంటూ ప్రచారం చేస్తోంది. దాంతో దిమ్మెరపోయిన బీజేపీ కీలకమైన డెయిరీ రైతుల ఓట్లు చేజారకుండా చూసుకునేందుకు కిందామీదా పడుతోంది.

కింగ్(మేకర్) ఆశల్లో జేడీ(ఎస్)

2013లో మినహాయించి గత 20 ఏళ్లలో కన్నడ ఓటరు ఎప్పుడూ స్పష్టమైన తీర్పు ఇవ్వలేదు. హోరాహోరీ పోరు నేపథ్యంలో ఈసారి కూడా ఎవరికీ మెజారిటీ రాకపోవచ్చని సర్వేలు చెబుతున్నాయి. 224 సీట్లలో కాంగ్రెస్ 100కు అటూ ఇటుగా, బీజేపీ 90లోపు, జేడీ(ఎస్) 30 నుంచి 40 గెలుస్తాయని అంచనా. అదే జరిగితే కింగ్‌మేకర్‌గా మరోసారి చక్రం తిప్పాలని జేడీ(ఎస్) ఆశపడుతోంది. పాత మైసూరులోని 89 అసెంబ్లీ స్థానాల్లో కనీసం 30కి పైగా గెలుస్తామని ధీమాగా ఉంది. బీజేపీ, కాంగ్రెస్ రెబల్స్ తద్వారా మరిన్ని స్థానాలు తెచ్చిపెడతారని భావిస్తోంది.

గుండెల్లో రె'బెల్స్'

- బీజేపీ కనీసం 20కి పైగా నియోజకవర్గాల్లో తిరుగుబాటును ఎదుర్కొంటోంది.
- సీనియర్లకు ఉద్వాసన పలికి కొత్తవారికి, యువతకు చాన్సివ్వాలన్న అధిష్టానం నిర్ణయం కాస్త బెడిసికొట్టినట్టు కన్పిస్తోందని పరిశీలకులు అంటున్నారు.
- మాజీ సీఎం జగదీశ్ శెట్టర్, ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ సవదితో పాటు చాలామంది సీనియర్లు టికెట్ రాక పార్టీని వీడారు.
- వారిని కాంగ్రెస్ సాదరంగా ఆహ్వానించి టికెట్లిచ్చింది. ఇది ముఖ్యంగా ఉత్తర కర్ణాటకలో బీజేపీని బాగా దెబ్బ తీస్తుందంటున్నారు.
- రెబెల్స్ దెబ్బకు బీజేపీ ఓటు బ్యాంకుకు చిల్లి పడేలా కన్పిస్తోంది.
- మరీ నామినేషన్ల దాకా ఆగకుండా ఏ మూడు నెలల ముందో సీనియర్లతో మాట్లాడి ఈ నిర్ణయం తీసుకుని ఉండాల్సిందన్న భావన వ్యక్తమవుతోంది.

యువశక్తే చోదక శక్తి

యువం-2023 సదస్సులో ప్రధాని మోదీ



సోమవారం కొచ్చిలో రోడ్‌షో సందర్భంగా అభిమానులకు ప్రధాని మోదీ అభివాదం

కొచ్చి: దేశ అభివృద్ధి ప్రయాణానికి యువ శక్తే చోదక శక్తి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ప్రపంచంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా భారత్ మారడం వెనుక యువత భాగస్వామ్యం ఉందని ప్రశంసించారు. భారత్ ఒకప్పుడు అభివృద్ధిలో వెనుకబడి ఉండేదని గుర్తుచేశారు. ఇప్పుడు మన దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని, బలమైన ఆర్థిక శక్తిగా ఆవిర్భవిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఇదంతా యువత కృషి వల్ల సాధ్యమవుతోందని పేర్కొన్నారు. వారిపై తనకు ఎంతో విశ్వాసం ఉందన్నారు. కేరళలోని కొచ్చిలో సోమవారం 'యువం-2023' సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. 21వ శతాబ్దం భారతదేశ శతాబ్దమని ప్రపంచమంతటా అందరూ చెబుతున్నారని, యువ శక్తి మన దేశానికి ఒక పెన్నిధి అని వివరించారు. తాము సంస్కరణలు తీసుకొస్తున్నామని, యువత వాటి ఫలితాలను తీసుకొస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు అవినీతిగా మారుపేరుగా ఉండేవని, బీజేపీ ప్రభుత్వం యువత కోసం నూతన అవకాశాలను సృష్టిస్తోందని నరేంద్ర మోదీ చెప్పారు. స్వయం సమృద్ధ సమాజాన్ని సృష్టించాలన్నదే తమ లక్ష్యమని వెల్లడించారు. యువత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పని చేస్తున్నామని తెలిపారు. కేంద్ర సాయుధ పోలీసు దళాల్లో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి 13 ప్రాంతీయ భాషల్లోనూ పరీక్ష నిర్వహించాలని కేంద్రం ఇటీవల నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. భారత్ ఎప్పటికీ మారబోదని గతంలో ప్రజలు భావించేవారని, ఇప్పుడు ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి భారత్‌కు ఉందని మోదీ వ్యాఖ్యానించారు. నేటి ఆత్మనిర్భర్ భారత్ డిజిటల్ ఇండియా గురించి మాట్లాడుతోందని అన్నారు.

మోదీకి ఘన స్వాగతం

మోదీకి సోమవారం సాయంత్రం కేరళలోని కొచ్చిలో ఘన స్వాగతం లభించింది. ఐఎన్ఎస్ గరుడ నావల్ ఎయిర్ స్టేషన్ నుంచి యువం సదస్సు వేదిక దాకా రెండు కిలోమీటర్ల మేర రోడ్డు షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేరళ సంప్రదాయ దుస్తులను ధరించారు. కాసేపు నడిచి, తర్వాత వాహనం నుంచి అభివాదం చేశారు.


కాంగ్రెస్ పాలనలో పల్లెలపై సవతి తల్లి ప్రేమ

రేవా: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పల్లెలపై సవతి తల్లి ప్రేమ చూపాయని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. బీజేపీ ప్రభుత్వం ఆ పరిస్థితిని పూర్తిగా మార్చివేసిందని, గ్రామ సీమల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించిందని జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం మధ్యప్రదేశ్‌లోని రేవాలో బహిరంగ సభలో ఆయన అన్నారు. పంచాయతీరాజ్ సంస్థలకు నిధుల్లో కోత పెట్టి, ఎన్నికలను వాయిదా వేస్తోంది బీజేపీ ప్రభుత్వమేనంటూ కాంగ్రెస్ ఘాటుగా స్పందించింది.

ఐపీఎల్, మ్యారేజ్ హాళ్లలోకి లిక్కర్

కొత్త మద్యం విధానం ప్రకటించిన తమిళనాడు ప్రభుత్వం

చెన్నై: మ్యారేజీ హాళ్లు, బాంకెట్ హాళ్లు, స్పోర్ట్స్ స్టేడియంలు, ఇళ్లలో జరిగే పార్టీలకు మద్యం సరఫరా చేసేందుకు అనుమతిస్తూ తమిళనాడు ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని సోమవారం ప్రకటించింది. కమర్షియల్, నాన్‌కమర్షియల్ ప్రదేశాల్లోకి మద్యాన్ని అనుమతించేందుకు ఉద్దేశించిన నిబంధనలను ఈ మేరకు సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, మద్య నిషేధాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు డీఎంకే ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయింది. దాంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఐపీఎల్ వంటి అంతర్జాతీయ క్రీడాపోటీలు, గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ (జీఐఎం)వి జరిగే సందర్భాల్లో మాత్రమే 'అవసరం ప్రాతిపదిక'గా దేశంలోని ఇతర ప్రాంతాల్లోని విధానాలకు తగ్గట్టుగా మద్యం సరఫరా చేస్తామని ప్రకటించింది.



నేటి నుంచే...

ఉత్తరాఖండ్‌లోని ప్రఖ్యాత కేదర్‌నాథ్ ఆలయాన్ని మంగళవారం తెరవనున్నారు. దర్శనం కోసం సోమవారం నుంచే ఆలయ ప్రాంగణంలో ఎదురు చూస్తున్న వందలాది మంది భక్తులు...

'మన్ కీ బాత్'కు 23 కోట్ల శ్రోతలు

ఐఐఎం–రోహ్‌తక్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్ కీ బాత్'కు ప్రజల్లో విశేష ఆదరణ ఉంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రధాని ఇచ్చే సందేశాన్ని దాదాపు 23 కోట్ల మంది వింటున్నట్లు తాజా సర్వేలో తేలింది. మొత్తం శ్రోతల్లో 65 శాతం మంది హిందీ భాషలో వినేందుకు ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడయ్యింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్–రోహ్‌తక్ ఈ సర్వే నిర్వహించింది. సర్వేలో ఏం తేలిందంటే.. 100 కోట్ల మందికిగాపైగా ప్రజలు కనీసం ఒక్కసారైనా మన్ కీ బాత్ విన్నారు. 41 కోట్ల మంది తరచుగా వింటున్నారు. 23 కోట్ల మంది కచ్చితంగా వింటున్నారు. మొత్తం శ్రోతల్లో 44.7 శాతం మంది టీవీల్లో, 37.6 శాతం మంది మొబైల్ ఫోన్లలో కార్యక్రమం వింటున్నారని ఐఐఎం–రోహ్‌తక్ డైరెక్టర్ ధీరజ్ పి.శర్మ చెప్పారు. మన్ కీ బాత్ 100వ ఎడిషన్ వచ్చే ఆదివారం ప్రసారం కానుంది. ఎక్కువ మంది టీవీ చానళ్లలో, మొబైల్ ఫోన్లలో వీక్షించనున్నారు. కేవలం 17.6 శాతం మంది రేడియోల్లో వినబోతున్నట్లు సర్వేలో తేలింది. 22 భారతీయ భాషలు, 29 యాసలతోపాటు 11 విదేశీ భాషల్లో మన్ కీ బాత్ ప్రసారమవుతోందని ప్రసార భారతి సీఈఓ గౌరవ్ ద్వివేది పేర్కొన్నారు.

బీజేపీ జీరో కావాలి

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ • బిహార్ సీఎం నితీశ్, డిప్యూటీ తేజస్వీలతో భేటీ • విపక్ష కూటమి ఏర్పాటుపై చర్చలు



కోల్‌కతాలో భేటీ సందర్భంగా మమత, నితీశ్, తేజస్వీ యాదవ్

కోల్‌కతా: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 'జీరో'గా మారిపోవాలని తాను కోరుకుంటున్నట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. కేవలం మీడియా మద్దతు, అబద్ధాలతోనే బీజేపీ 'పెద్ద హీరో'గా మారిందని ఎద్దేవా చేశారు. బీజేపీని కనుమరుగు చేయడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మమతా బెనర్జీ, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ సోమవారం బెంగాల్ రాజధాని కోల్‌కతాలో సమావేశమయ్యారు. ఈ భేటీలో బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ కూడా పాల్గొన్నారు. 2024 జరిగే లోక్‌సభలో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు కలిసి పనిచేయాల్సిన ఆవశ్యకతపై వారు చర్చించారు. బీజేపీని వ్యతిరేకించే పార్టీలను కలుపుకొని బలమైనా కూటమిని ఎలా నిర్మించాలన్న దానిపై వారు చర్చించుకున్నట్లు తెలిసింది.

విపక్ష కూటమిలో కాంగ్రెస్ కూడా..

విపక్షాలు కలిసి కూర్చొని చర్చించుకోవాలని, ఎన్నికల వ్యూహాలు రూపొందించుకోవాలని నితీశ్ కుమార్ సూచించారు. మమతా బెనర్జీతో తమ సమావేశం సానుకూలంగా జరిగిందని అన్నారు. భేటీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ అభివృద్ధి కోసం బీజేపీ చేసిందేమీ లేదని మండిపడ్డారు. సొంత ప్రచారం కోసమే అధికార పక్షం పాకులాడుతోందని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలు కలిసికట్టుగా ఉన్నాయనే సంకేతాన్ని ప్రజల్లోకి పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మమతా బెనర్జీ పేర్కొన్నారు. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ పోరాటం బిహార్ నుంచే మొదలైందని, బిహార్‌లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, తదుపరి కార్యాచరణపై చర్చిస్తే బాగుంటుందని నితీశ్‌కుమార్‌తో చెప్పానని వివరించారు. విపక్ష కూటమిలో కాంగ్రెస్ కూడా భాగస్వామిగా చేరుతుందా? అని ప్రశ్నించగా.. అన్ని పార్టీలూ భాగస్వామిగా ఉంటాయని మమత బదులిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపించడమే లక్ష్యంగా ప్రతిపక్షాల ఐక్యత కోసం మమతా బెనర్జీ తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. గత నెలలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో సమావేశమయ్యారు. నితీశ్ కుమార్ కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని కలిసి, కూటమి ఏర్పాటుపై చర్చించారు.

వృథా ప్రయాస: బీజేపీ

మమతా బెనర్జీ, నితీశ్‌కుమార్ భేటీతో ఒరిగేదేమీ ఉండదని, అదొక వృథా ప్రయాస అని పశ్చిమ బెంగాల్ బీజేపీ అధికార ప్రతినిధి సమిక్ భట్టాచార్య తేల్చిచెప్పారు. 2014చ 2019లో కూడా విపక్షాల ఐక్యత పేరిట ప్రయత్నాలు జరిగాయని, చివరకు ఏం జరిగిందో మనకు తెలిసిందేనని పేర్కొన్నారు. దేశ ప్రజలు బీజేపీని, ప్రధాని నరేంద్ర మోదీని సంపూర్ణంగా విశ్వసిస్తున్నారని తెలిపారు. అస్థిరమైన, అవకాశవాద కూటమికి ప్రజలు ఓటు వేయబోరని స్పష్టం చేశారు. ప్రాంతీయ పార్టీలు సొంత రాష్ట్రాల్లో మనుగడను కాపాడుకొనేందుకు ఒక్కతాటిపైకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయని పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకాంతా మజుందార్ వెల్లడించారు. బీజేపీ విమర్శలను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ శాంతను సేన్ తిప్పికొట్టారు. 2024లో మళ్లీ అధికారం చేపట్టాలన్న బీజేపీ కలలు నెరవేరే ప్రసక్తే లేదన్నారు. ప్రతిపక్షాలు ఒక్కటవుతుండడంతో బీజేపీలో వణుకు మొదలైందన్నారు.

అఖిలేశ్‌తో నితీశ్ భేటీ

లక్నో: బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్ కుమార్ సోమవారం లక్నోలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి కూలదోయడానికి సాధ్యమైనన్ని ఎక్కువ పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. దేశంలో ప్రజలు సమస్యల్లో కూరుకుపోయారని అఖిలేశ్‌యాదవ్ అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని వెంటనే ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు.

కర్ణాటక ఎన్నికల అనంతరం విపక్షాల కీలక భేటీ!

న్యూఢిల్లీ: బీజేపీ వ్యతిరేక కూటమిపై కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల అనంతరం స్పష్టత రానుంది. ఆ ఎన్నికల తర్వాత 19 విపక్ష పార్టీల అగ్రనేతలు సమావేశం కానున్నారని, కూటమి ఏర్పాటుపై చర్చిస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ భేటీకి ఆతిథ్యం ఇస్తున్నట్లు తెలిపాయి. కూటమి విషయంలో ఆయన ఇప్పటికే వివిధ పార్టీల నేతలతో మాట్లాడారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో ఖర్గే అతి త్వరలో భేటీ కానున్నట్లు సమాచారం.

జేడీ(ఎస్)కు ఓటేస్తే కాంగ్రెస్‌కు వేసినట్లే

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

సక్లేశ్‌పుర: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీ అయిన జేడీ(ఎస్)కు ఓటు వేస్తే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినట్లే అవుతుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ప్రధాని మోదీని బలోపేతం చేయడానికి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. గత ఎన్నికల్లో జేడీ(ఎస్)కు ఓటు వేస్తే చివరకు కాంగ్రెస్‌తో జత కట్టిందని గుర్తుచేశారు. కర్ణాటక రాష్ట్రం హసన్ జిల్లా సక్లేశ్‌పుర సెగ్మెంట్‌లోని ఆలూరులో సోమవారం భారీ రోడ్డు షోలో అమిత్ షా ప్రసంగించారు. మీ ఓటు వృథా కావొద్దంటే బీజేపీ అభ్యర్థులకు వేయాలని కోరారు. హసన్ జిల్లాలో ఈసారి మరిన్ని సీట్లు సాధించబోతున్నామన్నారు. రాష్ట్రంలో ఒక్కలిగలు, లింగాయత్‌లకు రిజర్వేషన్లు పెంచామని గుర్తు చేశారు.

ఎన్నికలు ముగిశాకే సీఎం ఎంపిక: ఖర్గే

శివాజీనగర: కర్ణాటకలో ఎన్నికలు ముగిసిన తరువాతే ముఖ్యమంత్రి ఎంపిక ఉంటుందని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే చెప్పారు. ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలు సేకరించి, హైకమాండ్ చర్చించి ముఖ్యమంత్రిని ఎంపిక చేస్తుందని తెలిపారు. ఎన్నికలకు ముందుగా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించడం తమ సంప్రదాయం కాదని చెప్పారు. సోమవారం చిక్కమగళూరులో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ లింగాయత్ ముఖ్యమంత్రిని ప్రకటించాలన్న బీజేపీ సవాల్‌పై స్పందిస్తూ తమ పార్టీలో కులాల వారీగా సీఎంను ప్రకటించడం లేదన్నారు. బీజేపీలో అవినీతి ప్రభుత్వ వ్యతిరేకంగా ప్రజలు విసుగెత్తారని, అదే ఇతరులపై చిన్న ఆరోపణ వస్తే వెంటనే సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు చేస్తారని ఆరోపించారు.

'జెమిని సర్కస్' శంకరన్ కన్నుమూత



కన్నూర్ (కేరళ): దేశంలో సర్కస్ ఇండస్ట్రీకి ఆద్యుల్లో ఒకరైన జెమిని శంకరన్ (99) ఇక లేరు. వయో సంబంధ రుగ్మతలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. జంతువుల విన్యాసాలు, సాహస బృందాల ప్రదర్శనలతో తరాల పాటు ప్రేక్షకులకు వినోదం పంచిన జెమిని, జంబో సర్కస్ కంపెనీలు ఆయన స్థాపించినవే. 1924లో కేరళలోని కొలస్సేరీ గ్రామంలో పుట్టిన శంకరన్ సర్కస్ కళాకారుడిగా శిక్షణ పొందారు. సైన్యంలో చేరి రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారు. రిటైరయ్యాక మళ్లీ సర్కస్ ప్రపంచంలోకి అడుగుపెట్టారు. తాడుపై, ఐరన్ బార్‌పై నడవడంలో ప్రావీణ్యం సంపాదించారు. 1951లో విజయ్ సర్కస్ కంపెనీని కొనుగోలు చేసి జెమినిగా పేరు మార్చారు. నిపుణులతో, విదేశాల నుంచి తెప్పించిన జంతువులతో తీర్చిదిద్దారు. 1964లో రష్యా అంతర్జాతీయ సర్కస్ ఫెస్టివల్‌లో శంకరన్ సారథ్యంలోని భారత్ బృందం పాల్గొంది.

విమానంలో మళ్లీ మూత్ర విసర్జన ఘటన


న్యూఢిల్లీ: విమానంలో ప్రయాణికుడు పక్క సీటులో ఉన్న వ్యక్తిపై మూత్రం పోసిన ఘటన తాజాగా మరోటి నమోదైంది. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన న్యూయార్క్– న్యూఢిల్లీ విమానంలో ఆదివారం చోటు చేసుకుంది. మద్యం మత్తులో ఉన్నట్లుగా భావిస్తున్న ఓ ప్రయాణికుడు తోటి ప్రయాణికుడితో వాదులాటకు దిగాడు. అదే సమయంలో అతడిపై మూత్ర విసర్జన చేశాడు. విమానం ఆదివారం రాత్రి ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకోగానే సిబ్బంది అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రయాణికులిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సూడాన్ నుంచి మనోళ్ల తరలింపుకు ఆపరేషన్ కావేరి



సూడాన్ నౌకాశ్రయంలో భారతీయులు

న్యూఢిల్లీ: ఘర్షణలతో అట్టుడుకుతున్న సూడాన్ నుంచి భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం 'ఆపరేషన్ కావేరి'ని ప్రారంభించింది. 'ఇందులో భాగంగా సుమారు 500 మంది భారతీయులు సూడాన్ పోర్టుకు చేరుకున్నారు. మరికొందరు వస్తున్నారు. వీరి కోసం అక్కడ ఓడలు, విమానాలను సిద్ధంగా ఉంచాం. సూడాన్‌లోని ప్రతి భారతీయుడికీ సాయంగా నిలుస్తాం'అని విదేశాంగ మంత్రి జై శంకర్ ట్వీట్ చేశారు. వైమానిక దళానికి చెందిన రెండు విమానాలను సౌదీ అరేబియాలోని జెడ్డాలో, నేవీకి చెందిన ఒక షిప్‌ను సూడాన్‌లోని ఒక పోర్టులో కేంద్రం ఇప్పటికే సిద్ధంగా ఉంచింది. మరోవైపు, సూడాన్‌లో ఉండిపోయిన తమ పౌరులు, దౌత్య సిబ్బంది తరలింపును పలు యూరప్, మధ్య ప్రాచ్య దేశాలు ముమ్మరం చేశాయి. ఫ్రాన్స్ ప్రభుత్వం సూడాన్ నుంచి వెనక్కి తీసుకువచ్చిన 28 దేశాలకు చెందిన 388 మందిలో ఐదుగురు భారతీయులు కూడా ఉన్నట్లు ఢిల్లీలోని ఆ దేశ రాయబార కార్యాలయం సోమవారం వెల్లడించింది.



సాక్షి కరీంనగర్

మంగళవారం | 25 | ఏప్రిల్ | 2023



శంభో శంకర..
వేములవాడ: 'కోడెమొక్కుల స్వామికి కోటి దండాలు.. శంభో శంకర.. రాజన్నా దీవించు..' అంటూ భక్తులు వేడుకున్నారు. రాజన్నను సోమవారం 25 వేల మంది దర్శించుకున్నారు.



పత్తి క్వింటాల్‌కు రూ.7,800
జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్‌లో సోమవారం క్వింటాల్ పత్తికి గరిష్ట ధర రూ.7,800 పలికింది. మోడల్ ధర రూ.7,650, కనిష్ట ధర రూ.7,000 చెల్లించారు.

గరిష్టం/కనిష్టం
36.0/25.0

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నష్ట పరిహారం ఇవ్వాలని రైతుల రాస్తారోకో

- రాష్ట్ర రహదారిపై మహాధర్నా
- అధికారుల హామీతో విరమణ



రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

చొప్పదండి: వడగండ్లతో పంటలు వంద శాతం దెబ్బతిన్నాయని, అధికారులు మీనమేషాలు లెక్కించకుండా సర్వే చేసి వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ చొప్పదండిలోని రాష్ట్ర రహదారిపై సోమవారం రైతులు మహాధర్నా నిర్వహించారు. రెండు రోజులు గడిచినా అధికారులు సర్వే చేసి రైతులను గుర్తించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చొప్పదండి, కొలిమికుంట, తదితర గ్రామాలకు చెందిన రైతులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ జాం అయింది. పోలీసులు చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పినా రైతులు వినలేదు. తహసీల్దార్ రజిత, సీఐ రవిందర్, ఏవో వంశీక్రిష్ణ చేరుకొని మాట్లాడారు. రైతులు వినతిపత్రం అందించాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాంగ్రెస్ నాయకులు ఈ ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, రైతు సంఘం అధ్యక్షుడు గుర్రం రవీందర్ రెడ్డి, నూనె శేఖర్, గుర్రం వెంకట్ రెడ్డి, సంబోజి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

డీసెట్ నోటిఫికేషన్ విడుదల

తిమ్మాపూర్: డీఈడీ, డీపీఎస్ఈ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ మొండయ్య తెలిపారు. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (డీఈఈసీఈటీ)–2023 కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని.. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, దివ్యాంగులు 45 శాతం మార్కులు ఉండాలని తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ (2023) నాటికి 17 సంవత్సరాలు వయస్సు ఉండాలని గరిష్ట వయోపరిమితి లేదని పేర్కొన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మే 23 వరకు పంపించాలని.. జూన్ 1న పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

శ్రమంతా వర్షం పాలైంది..

ఈ ఫొటోలో దిగాలుగా కూర్చొన్న కౌలురైతు పేరు చుక్క రాములు. వీణవంక మండలం ఇప్పలపల్లి గ్రామం. కుటుంబ సభ్యులు వ్యవసాయం మీదనే ఆధారపడి బతుకుతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని స్థితిలో ఉన్న ఈ రైతు ఓ ఆ సామి వద్ద ఐదెకరాలు కౌలుకు తీసుకొన్నాడు. ఎకరాన రూ.20 వేల చొప్పున 5 ఎకరాలకు రూ.లక్ష చెల్లించాడు. దొడ్డురకం వరి సాగు చేశాడు. రెండు రోజుల్లో వరి కోయడానికి సిద్ధంగా ఉన్నాడు. ఇంతలోనే కురిసిన అకాల వర్షం, ఈదురుగాలులకు 80 శాతం వడ్లు నేలరాయాయి. 15 నిమిషాల్లోనే చేను పూర్తిగా దెబ్బతింది. కళ్లముందే వడ్లు నేలపాలవుతుండటం చూసి సదరు రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ఎకరాకు రూ.25 వేల చొప్పున రూ.1.25 లక్షలు ప్రైవేట్ అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టాడు. ఎకరాకు 45 బస్తాల దిగుబడి వస్తుందని కుటుంబమంతా ఆశపడితే 10 బస్తాల చొప్పున వచ్చుడు గగనంగా మారిందని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. రెండేళ్ల క్రితం కూడా చేను చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయాడు. అప్పుడు పెట్టుబడి మీద పడిందని, ఇప్పుడు అదే పరిస్థితి వచ్చిందని వాపోయాడు. నేలరాలిన గింజలను చూస్తూ చేన్లోనే ఎక్కెక్కి ఏడుస్తూ ఉండిపోయాడు.




ధర పెరుగుతదనుకుంటే రాళ్లు పడ్డయి..



నడి వేసవి వచ్చిందంటె పచ్చిమిర్చి పంటకు ధర పెరుగుతదని నాలుగెకరాలలో సాగు చేసిన. ఆలస్యంగా కాతకు రావాలని మందులు కూడా కొట్టినం. పెట్టుబడికే రూ. పది లక్షల దాక అయినయి. రూ. 50 కి కిలో మిర్చి అమ్మినా నాలుగు క్రాపులకు రూ. 20 లక్షలు వచ్చేటివి. ఆకాల వర్షం ఏమి మిగిల్చలేదు. శుభకార్యాల సమయం వస్తుండటంతో ధర పెరుగుతందని అనుకుంటె వడగండ్ల వర్షం పడి పంట మొత్తం దెబ్బతింది. అమావాస్య, రంజాన్ పండుగలు రావడంతో తెంపడం ఆలస్యమైంది. వరి పంట కూడా ఇంకా పూర్తిగా కోయలేదు. ఇత్తులన్నీ రాలిపోయాయి. కోలుకోలేని నష్టం వచ్చింది. నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– పురం రవి, చాకుంట, చొప్పదండి మండలం

వడగండ్లతో పూర్తి నష్టమే..



ఏటా మిర్చి పంట సాగు చేస్తున్నం. ఈసారి ధర ఎక్కువ ఉంటుందని నాలుగు ఎకరాలలో పచ్చి మిర్చి సాగు చేశా. మల్చింగ్ విధానంలో ఎకరాకు రూ. రెండు లక్షల వరకు ఖర్చు చేశాం. ఒక్క క్రాప్ కూడా చేతికి రాలేదు. నాలుగు ఎకరాలకు రూ. 20 లక్షల వరకు ఆదాయం వస్తదని ఆశపడ్డం. పెట్టుబడి రూ. 8 లక్షలకు మునిగినం. కౌలుకు తీసుకొని 45 ఎకరాల వరకు వరి సాగు చేసిన. ఒక్క ఎకరం కూడా కోయలేదు. వడగండ్ల వాన వచ్చి మొత్తం ఊడ్చుకుపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– గంకిడి క్రిష్టారెడ్డి, చాకుంట, చొప్పదండి మండలం

ఎంత పనాయె.. దేవుడా..

ఆరుగాలం శ్రమ.. నిమిషాల్లో ఆవిరి..

- రైతన్నలను నిండా ముంచిన అకాల వర్షాలు
- కడగండ్లు మిగిల్చిన వడగండ్లు
- రూ.లక్షల్లో నష్టపోయిన రైతులు
- కోలుకోలేని దెబ్బతీసిన వరుణుడు

ఆరుగాలం శ్రమ నిమిషాల్లో ఆవిరైంది. ప్రకృతి ప్రకోపానికి నోటికాడి బుక్క దూరమైంది. చేతికి అందివచ్చిన పంటలు అకాల వర్షం, వడగండ్లతో నేలపాలయ్యాయి. యాసంగి ఆరంభంలో మొగిపురుగు, ఇప్పుడు వడగండ్లు అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీశాయి. ఏ రైతును కదిలించినా వారి కళ్లలో కన్నీరే ఉబికివస్తోంది. కళ్లెదుటే పంటలు నేలపాలు కావడం జీర్ణించుకోలేకపోతున్నారు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే ఈదురుగాలులతో ధాన్యం గింజలు చేలలోనే రాలిపోతుండడం చూస్తూ ఆవేదన చెందుతున్నారు. ఆదుకోండి అయ్యా అని మొరపెట్టుకుంటున్నారు. 'నాలుగైదు రోజులైతే పంట కోద్దామనుకుంటిమి.. ఈ లోపే ఎంత పనాయెరా దేవుడా' అంటూ రాలిన పంటను చూసి రోదిస్తున్నారు.

– చొప్పదండి/వీణవంక/కరీంనగర్‌రూరల్

40 ఏళ్లలో ఎప్పుడూ చూడలే..



వీణవంక మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ముదిగంటి విజేందర్‌రెడ్డి తనకున్న ఐదెకరాలతోపాటు మరో 20 ఎకరాలు ఓ ఆసామి వద్ద కౌలుకు తీసుకొన్నాడు. అంత దొడ్డురకం వరిని సాగు చేశాడు. మొదట్లో చేను ఏపుగా పెరగడంతో ఇక ఢోకా లేదనుకొని పెట్టుబడికి వెనకకు రాలేదు. తీరా పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. 25 ఎకరాల చేను పూర్తిగా దెబ్బతింది. గింజలు నేలరాయి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. మాయదారి వర్షం మూడేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తోందని వాపోయాడు. ఈ ఏడు ఇప్పటివరకు రూ.5 లక్షల పెట్టుబడి పెట్టానని, పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేటట్టు లేదని వాపోయాడు. 40 ఏళ్లలో ఇంత నష్టం ఎప్పుడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇది ఈ ఒక్క రైతు పరిస్థితే కాదు.. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులందరిదీ.

ఒక్క రోజు గెరువు ఇస్తే గట్టెక్కెటోన్ని..



సదయ్య, రైతు, వీణవంక మండలం

మాది వీణవంక మండలం చల్లూరు. నాకున్న ఐదు ఎకరాలలో వరి పంట వేసిన. తెల్లారితే వరి కోద్దామనుకుంటే అకాల వర్షం కోలుకోలేని దెబ్బతీసింది. ఒక్క రోజు వరుణుడు కరుణిస్తే గట్టెక్కెటోన్ని. 90 శాతం గింజలు నేలరాలాయి. ఇప్పటికే రూ.లక్ష పైన పెట్టుబడి పెట్టాను. రెండేళ్ల క్రితం ఇదే పరిస్థితి తలెత్తింది. ఈ గోస పగోనికి కూడా రావొద్దు. మా ఊరివాళ్లంత కలిసి ప్రజావాణిలో కలెక్టర్‌కు మొర పెట్టుకున్నాం. ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాం. ప్రభుత్వం ఆదుకోకపోతే తీవ్రంగా నష్టపోతాం. ఏటా అకాల వర్షాలు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. ఇక ఎవుసం చేసుడు దండుగా. ఏదైనా పని చేసుకొని బతుకుతామనుకుంటే ఎక్కడా పని దొరుకతలేదు. ప్రభుత్వం స్పందించి పరిహారం చెల్లించాలి.

తెల్లారితే వరి కోసేది..



ఊరడి శివారెడ్డి, రైతు, ఫకీర్‌పేట



ఇరుగురాల తిరుపతి, రైతు, తాహెర్‌కొండాపూర్



లింగంపల్లి కొమురయ్య, రైతు, చెర్లభూత్కూర్

ఫకీర్‌పేటకు చెందిన ఊరడి శివారెడ్డి అందరి రైతులా కాకుండా మంచి దిగుబడితోపాటు లాభాలను ఇచ్చే బాస్మతి రకం వరిపంట వేశాడు. ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి, క్వింటాల్‌కు రూ.2,500 ధర చెల్లిస్తామన్న కంపెనీ ఒప్పందంతో 7 ఎకరాల్లో సాగు చేశాడు. కంపెనీ ప్రతినిధులు వరిపంటను పరిశీలించి మరుసటిరోజు వరి కోద్దామని చెప్పారు. సంతోషపడిన శివారెడ్డికి తెల్లారి కురిసిన వడగండ్ల వాన కోలుకోకుండా చేసింది. ఎకరానికి రూ.25 వేల చొప్పున పెట్టిన పెట్టుబడి చేతికందకుండా పోయింది. కొత్త రకం వరితో లాభాలు పొందుదామని ఆశపడిన రైతుకు చివరికి నిరాశేమిగిలింది.

హార్వెస్టర్‌కు దారి లేక కోయలేదు..

కరీంనగర్ రూరల్ మండలం తాహెర్‌కొండాపూర్‌కు చెందిన కౌలురైతు ఇరుగురాల తిరుపతికి రెండెకరాల సొంత భూమి ఉంది. 5 ఎకరాలు కౌలుకు తీసుకొని వరిపంట సాగు చేశాడు. వరి కోతకొచ్చినా పొలానికి పోవడానికి హార్వెస్టర్‌కు దారిలేక పోవడంతో ఆలస్యమైంది. మరో నాలుగైదు రోజులైతే కోద్దామనుకుంటే వడగండ్ల వానకు పంటంతా పోయింది. వరి గింజలన్నీ నేలరాలడంతో ఉత్త గడ్డి మాత్రమే మిగిలింది. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నాలుగురోజులైతే బయటపడుదు..

కరీంనగర్‌రూరల్ మండలం చెర్లభూత్కూర్‌కు చెందిన లింగంపల్లి కొమురయ్యకు రెండు ఎకరాల సొంత భూమి ఉంది. 3 ఎకరాలు ఏడాదికి రూ.60 వేల చొప్పున కౌలుకు తీసుకున్నాడు. నాట్లేసిన తర్వాత తెగుళ్ల ఆశించడంతో రూ.50 వేలు ఖర్చు చేసి రసాయన మందులు పిచికారీ చేశాడు. నాలుగు రోజులైతే వరి కోద్దామనుకుంటే వడగండ్ల వాన ముంచింది. ఐదు ఎకరాల్లో గింజలన్నీ రాలిపోయాయి.

రెండు సార్లు రాళ్లు పడ్డయి..



నూనె చందు, చొప్పదండి

నా పేరు నూనె చందు. మాది చొప్పదండి. నెల రోజుల క్రితం పొలం పొట్టకు వచ్చినప్పుడు రాళ్ల వాన పడ్డది. ఇరవై ఏండ్ల సంది ఇటువంటి వాన సూళ్ళె. ఇదేం గండంరో అనుకున్న. అప్పుడే పొలం పేరుకు రాదని భయపడ్డ. చివరికి కోతకు వచ్చింది. తిండిమందం ఎల్లినా సాలనుకొని కోసెతందుకు సూతున్న. మళ్లీ రాళ్ల వాన పడి ఉన్న పొలమంతా నేలకొరికి, వడ్లు రాలిపోయినయి. నాకు రెండెకరాలుంటే ఇంకో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేసిన. పెట్టుబడి రూ.రెండు లక్షలు దాటింది. దెబ్బ మీద దెబ్బ పడి కోలుకోలేకుండా చేసింది. ఉన్నతాధికారులు ఆదుకోవాలి. పగోనికి కూడా ఇసొంటి గోస రావద్దు. నెల వ్యవధిల రెండు సార్లు రాళ్ల వర్షం పడిందంటే ఎసొంటి గోసనో పెద్దసార్లకు అర్థమైతలేదా.?



కరీంనగర్‌లో భారీ వర్షం



గంగాధర మండలం మల్లాపూర్‌లో నీట మునిగిన పంట పొలం

మరోసారి దంచికొట్టింది

కరీంనగర్ అర్బన్/గంగాధర/గన్నేరువరం/తిమ్మాపూర్: జిల్లావ్యాప్తంగా వాన మరోసారి దంచికొట్టింది. మూడు రోజులుగా వరుసగా వర్షాలు కురుస్తుండగా అన్నదాతలకు తీరని నష్టం వాటిల్లింది. సోమవారం కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడగా ట్రాఫిక్‌కు స్వల్ప అంతరాయం ఏర్పడింది. గంగాధర మండల పరిధిలో సాయంత్రం వడగండ్లతో కూడిన గాలివాన బీభత్సం సృష్టించింది. దాదాపు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి రైతులు, ప్రజలు అతలాకుతలమయ్యారు. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం కుప్పలు కొట్టుకుపోయాయి. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడ్డారు. కోతకు వచ్చిన పంట పొలాల్లో గొలక మొత్తం రాలిపోయింది. గన్నేరువరం మండలంలో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి ధాన్యం తడిసిపోయింది. టార్పాలిన్లు కప్పినా గాలివానకు కొట్టుపోయాయి. దీంతో ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో కారు చీకట్లు కమ్ముకున్నాయి. మామిడితోటలు, వరి, మొక్కజొన్న పంటలకు తీవ్రంగా నష్టం జరిగింది. తిమ్మాపూర్ మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఐకేపీ కేంద్రాలలో ధాన్యం తడిసింది.



కొనుగోలు కేంద్రంలో కొట్టుకుపోయిన ధాన్యం



కొట్టుకుపోయిన ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం



గన్నేరువరంలో నేలవాలిన వరి



గన్నేరువరంలో వర్షానికి తడుస్తున్న ధాన్యం

ఏ ఒక్కటీ వదలొద్దు

- 13 అసెంబ్లీ స్థానాలపై గులాబీ పార్టీ గురి
- 2014లో జగిత్యాల, 2018లో మంథని దూరం
- ఈసారి పాతజిల్లా క్లీన్‌స్వీప్ చేయాలని బీఆర్ఎస్ నిర్ణయం
- అభివృద్ధి వివరిస్తూనే బీజేపీపై ఎదురుదాడికి ప్రణాళికలు
- సోషల్ మీడియా సమగ్ర వినియోగంపై దృష్టి



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకోవాలని కారు పార్టీ ప్రణాళికలు రచిస్తోంది. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి నేడు బీఆర్ఎస్ పార్టీగా రూపాంతరం చెందడం వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో విడదీయలేని అనుబంధం ఉంది. పార్టీ తొలి ఆవిర్భావ సభ నుంచి తెలంగాణ కోసం ఆమరణ నిరాహార దీక్ష వరకు.. ఇలా ఏది ప్రారంభించినా.. కరీంనగర్ నుంచి మొదలుపెట్టడం సీఎం కేసీఆర్‌కు సెంటిమెంటు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలైన రైతుబంధు, దళితబంధు పథకాలను కూడా కరీంనగర్ జిల్లా నుంచే ప్రారంభించడం గమనార్హం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 13 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. రాష్ట్రం ఆవిర్భవించాక రెండుసార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 2014లో జరిగిన ఎన్నికల్లో కరీంనగర్‌లో జగిత్యాల (జీవన్‌రెడ్డి) మినహా మిగిలిన అసెంబ్లీ స్థానాలు కారు పార్టీ కైవసం చేసుకుంది. 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లోనూ కారు పార్టీ మంథని (శ్రీధర్‌బాబు) మినహా 12 అసెంబ్లీ స్థానాల్లో విజయబావుటా ఎగురవేసింది. క్లీన్‌స్వీప్ చేయాలన్న ప్రతీసారి కాంగ్రెస్ కారు పార్టీ ఆశలపై నీళ్లు చల్లుతూ వస్తోంది. దీంతో ఈసారి ఎలాగైనా మొత్తం స్థానాలు సాధించాలని వ్యూహరచన చేస్తోంది. ఇందుకు 25న జరిగే నియోజకవర్గాల ప్లీనరీలను వేదికగా చేసుకుని కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసేందుకు సిద్ధమవుతోంది. అందుకే.. అన్ని స్థానాల్లోనూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం చేసిన పనులను వివరించడం, బీజేపీ నిధులు, విధుల విషయంలో అడ్డుపడుతున్న తీరును ప్రజలకు తెలియజేయాలని పలు తీర్మానాలను, నిర్ణయాలను ఆమోదించేందుకు సిద్ధమవుతోంది.

సోషల్ మీడియా వినియోగం..!

పార్టీ 13 స్థానాలను సాధించే క్రమంలో మొత్తం బాధ్యతలను జిల్లా మంత్రులు, జిల్లా పార్టీ ఇన్‌చార్జులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను, పార్టీ శ్రేణులకు అప్పగించింది. పక్కా వ్యూహం ప్రకారం.. బీజేపీ, కాంగ్రెస్‌ల తీరును ఎండగడుతూ.. బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి పనులను, పూర్తి చేసిన పనులకు శంకుస్థాపనలను ప్రజలకు చేరేవిధంగా వ్యవహరించాలని అధిష్టానం ఆదేశించింది. ఇందుకోసం ప్రధాన మీడియాతోపాటు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాలను సమగ్రంగా వినియోగించుకోవాలని, ఇందుకు సోషల్ మీడియా వారియర్లను పల్లెలు, మండలాలు, నియోజకవర్గాల వారీగా బలోపేతం చేయాలని ఆదేశించింది. పార్టీ చేపట్టిన కార్యక్రమాలతోపాటు, ప్రతిపక్షాల విమర్శలకు ఎదురుదాడి కూడా అంతే దూకుడుగా ఉండాలని, ఆరోపణలను ఎండగట్టేలా సోషల్‌మీడియాను పూర్తిస్థాయిలో వాడుకోవాలని సూచించింది.

కీలక తీర్మానాలివే..!

- వ్యవసాయం రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులు, కాళేశ్వరం తదితర ప్రాజెక్టులు.
- సామాజిక భద్రత: సమాజంలో పలువురుకు అందజేస్తున్న పింఛన్లు.
- మహిళా సాధికారత: సంఘాలు–రుణాలు, పింఛన్లు, షాదీముబాకర్ తదితరాలు.
- బీసీ సంక్షేమం: గొర్రెల పంపిణీ, మత్స్యకారులు, చేనేత, గీత కారులు ఇతర కులవృత్తుల సంక్షేమం, రుణాలు మొదలైనవి.
- దళితసంక్షేమం: దళితబంధు, గురుకులాలు.
- గిరిజన సంక్షేమం: తండాల పంచాయతీలుగా అప్‌గ్రేడ్, రిజర్వేషన్లు, మిషన్ భగీరథ తాగునీరు
- విద్య– ఉద్యోగం: గురుకులాలు, మోడల్ స్కూళ్లు, మన ఊరు–మనబడి, హైదరాబాద్‌లో ఉపాధి అవకాశాల సృష్టి.
- పట్టణ ప్రగతి/పల్లె ప్రగతి.
- మైనార్టీ వెల్ఫేర్
- ధరల పెరుగుదల మోదీ వైఫల్యం.
- తెలంగాణపై వివక్ష
- విభజన హామీల అమలు
- సింగరేణి గనుల వేలం
- కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు వేధింపులు తదితరాలపై కీలకమైన నేతలతోపాటు సాధారణ కార్యకర్తలను సైతం సిద్ధం చేసేందుకు 13 నియోజకవర్గాల్లో జరిగే.. ప్లీనరీ సమావేశాలను వేదికగా ఎంచుకుంది.

క్లుప్తంగా

వైద్య కళాశాల పనులు త్వరగా పూర్తిచేయండి



కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. కొత్తపల్లి పట్టణ శివారులోని తెలంగాణ సీడ్ గోదాంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల పనులను కలెక్టర్ పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేలా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కళాశాలలోని ప్రతి విభాగాన్ని పరిశీలించి గుత్తేదారులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట శిక్షణ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, ఆర్ అండ్‌బీ అధికారులు ఉన్నారు.

పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



కరీంనగర్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఎం నగర శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి గుడికందుల సత్యం మాట్లాడుతూ, టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు గడుస్తున్నా కరీంనగర్ నియోజకవర్గంలో ఏ ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు పున్నం రవి, పుల్లెల మల్లయ్య తదితరులు ఉన్నారు.

అల్ఫోర్స్‌లో వేసవి శిక్షణ శిబిరం



కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో అల్ఫోర్స్ గ్రూపు ఆఫ్ స్కూల్స్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. నిపుణుల సమక్షంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు స్విమ్మింగ్, హ్యాండ్ రైటింగ్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, గణితం, క్రికెట్ తదితర క్రీడాంశాల్లో 21 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

27న మినీ జాబ్‌మేళా

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ప్రైవేట్‌రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 27న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నోడల్ ఉపాధి అధికారి దేవేందర్‌రావు ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, డిప్లొమా, ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానికల్ ట్రేడర్స్, డిప్లొమా మెకానికల్ చదివినవారు అర్హులని తెలిపారు. నిరుద్యోగ యువతి, యువకులు తమ బయోడేటా, మూడు సెట్స్ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 75066 79998, 96666 84012 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

బలగం దూరం.. బతుకు భారం

- నిరాదరణకు గురవుతున్న వృద్ధులు
- ప్రజావాణి మెట్లెక్కినా న్యాయమేది..?
- నోటీసులతో సరి.. ఆపై వాయిదా
- ఏటా 40కి పైగా ఫిర్యాదులు
- అధికారుల ఉదాసీనత.. తప్పని నిరీక్షణ

రెండేళ్లుగా తిరిగినా పరిష్కారమేది..?



నా భర్త పేరున ఉన్న భూమిని నా పేరు చేయండని రెండేళ్లుగా తిరుగుతుంటే పట్టించుకుంటలేరు. నోటీసులు పంపుతుండ్రు, వాయిదాలు వేస్తుండ్రు. కొత్తపల్లి మండలం బావుపేట మా గ్రామం. నా భర్త గంగారాం 7 ఎకరాలకు పైగా భూమిని సంపాదించిండు. దాన్ని నా పెద్ద కొడుకు రాజయ్య, చిన్న కొడుకు మరణించగా కోడలు పద్మ సాగు చేసుకుంటున్నారు. అయితే ఇప్పటిదాకా నా పెద్ద కొడుకే చూసుకున్నడు. లక్షలు ఖర్చు పెట్టిండు. కోడలు ఇప్పటికీ బుక్కెడు బువ్వ పెట్టింది లేదు. ఇదెక్కడి అన్యాయం. నా భర్త భూమిని నా పేరున చేస్తే నేనే ఎలాగోలా బతుకుతా.

– పెద్ది రుక్కవ్వ, బావుపేట, కొత్తపల్లి

ఎన్నాళ్లని తిరగాలే..



అయ్యా మాది సీతారాంపూర్(కరీంనగర్). నా భర్త ఐలయ్య 2015లో మరణించారు. మాకు ఇద్దరు కుమారులు, నలుగురు కూతుళ్లు. ప్రస్తుతం నా వయసు 75ఏళ్లు. ఎనిమిదేళ్ల నుంచి కొడుకులు నా బాగోగులు పట్టించుకోవడం లేదు. సీతారాంపూర్‌లో 22 గుంటలు, రేకుర్తిలో 1.25 ఎకరాలుండగా వాటిని ఇద్దరూ వారి పేరున దొంగతనంగా మార్చుకున్నారు. నా కూతుళ్లకు 29 సర్వే నంబర్‌లో నాలుగున్నర గుంటలు గిఫ్ట్ డీడ్ చేస్తే సదరు వివరాలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టించారు. బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించడంతో పాటు నా పోషణ అందరూ చూసుకునేలా చర్యలు తీసుకోవాలని తిరిగితే పట్టించుకుంటలేరు. నా కూతుళ్లే నన్ను పోషిస్తున్నారు. ఆస్తులు తీసుకునేది కొడుకులు.. నేను ఉండాల్సింది కూతుళ్ల దగ్గరా.. ఇదెక్కడి అన్యాయం.

– కూతుళ్లతో బొంతల నాగమల్లమ్మ, సీతారాంపూర్, కరీంనగర్

కరీంనగర్ అర్బన్: కాటికి కాళ్లు చాచిన వృద్ధుల బతుకు భాగంగా మారుతోంది. పట్టెడన్నం పెట్టి ఆప్యాయతను చూపాల్సిన సంతానం నిర్దయగా వదిలేస్తున్నారు. తల్లిదండ్రుల జీవన చరమాంకంలో తనయుల ప్రవర్తన వారి హృదయాలను ద్రవింపజేస్తోంది. ఎవరికీ చెప్పుకోలేక నాలుగు గోడల మధ్య నలుగుతున్న వారెందరో ఉంటుండగా.. బంధాలనే ప్రశ్నార్థకం చేస్తున్న ఘటనలతో పలువురు వృద్ధులు విధిలేని పరిస్థితుల్లో ప్రజావాణిని ఆశ్రయిస్తున్నారు.

చట్టమేం చెబుతోంది..

తల్లిదండ్రులను ఒంటరి చేసి వారి బాగోగులను పట్టించుకోకపోవడం చట్టరీత్యా నేరం. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం, నిర్వహణ పేరుతో ప్రభుత్వం 2007లో చట్టాన్ని తీసుకొచ్చింది. అవగాహన లేక కొందరు ఈ చట్టాన్ని వినియోగించుకోవడం లేదు. నిరాదరణకు గురైన తల్లిదండ్రులకు వారి సంతానం నెలకు రూ.10వేల వరకు ఖర్చుల నిమిత్తం చెల్లించాలి. కేసు వేసిన 90 రోజుల్లోనే తీర్పు వెలువడుతుంది. తల్లిదండ్రుల ఆస్తిని ఆక్రమించి అనుభవిస్తుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. కేసు వేసి తిరిగి ఆస్తిని స్వాధీనం చేసుకునే హక్కు వృద్ధులకు ఉంది. మానసికంగా, శారీరకంగా వృద్ధులను వేధిస్తే మూడు నెలల వరకు జైలు, రూ.5వేల వరకు జరిమానా విధిస్తారు. చట్ట ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రుల్లో వృద్ధులకు ప్రత్యేకంగా పడకలు కేటాయించి, దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధులకు చికిత్స అందించాలి. ప్రతి జిల్లా ఆసుపత్రిలో వృద్ధులకు ప్రత్యేక విభాగం నెలకొల్పాలని చట్టం చెబుతోంది.

అధికారులేం చేస్తున్నట్లు..

కుమారుల నిరాదరణతో కలెక్టరేట్‌కు చేరుతున్న వృద్ధులకు యంత్రాంగం భరోసా కరువవుతోంది. చట్ట ప్రకారం చర్యలు తీసుకునే సర్వాధికారం ఉన్నా మాకేమన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో తమకు న్యాయం చేయాలని మళ్లీ మళ్లీ ప్రజావాణిని ఆశ్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంలో జరిగే ప్రజావాణి దరఖాస్తులపై అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ స్పష్టంగా ఆదేశిస్తున్నా ఆచరణలో అంతంతమాత్రమే. తమ సంతానం పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేయడమే తరువాయి అధికారి చర్యలు చేపట్టాలి. నిర్దిష్ట సమయాన్ని నిర్ణయించి ఫిర్యాదుదారు, వారి సంతానాన్ని విచారించి భృతి కల్పించాలి. వినని క్రమంలో చట్టరీత్యా చర్యలకు సిఫారసు చేయాలి.

ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయరూ..

మలి వయసులో నిరాదరణకు గురవుతున్న వారికి చట్టం చుట్టంగా ఉండాలంటే కలెక్టర్ చొరవ చూపాల్సిన అవసరం ఉంది. ప్రతి సోమవారం జరిగే ప్రజా వాణిలో సదరు సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి. ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే న్యాయం జరిగేలా చొరవ చూపాలి.

ఎంపీ సంజయ్.. ఉత్తుత్తి పర్యటనలు వద్దు



కరీంనగర్: వడగండ్ల వానలతో నష్టపోయిన పంటలను పరిశీలిస్తూ, పరామర్శల పేరిట రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను విమర్శిస్తున్న ఎంపీ బండి సంజయ్ తన తీరు మార్చుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సూచించారు. మీసేవ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీ సంజయ్ ఉత్తుత్తి పర్యటనలు, విమర్శలు చేయడం మానుకొని కేంద్రం నుంచి రైతులకు నష్టపరిహారంగా ఎంత ఇప్పిస్తారో వెల్లడించాలని సవాల్ విసిరారు. సీఎం కేసీఆర్ ఇటీవల జిల్లాలో పర్యటించి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం హామీ ఇచ్చారని, ఉమ్మడి జిల్లాలో 9,500 మంది రైతులకు రూ.8.16 కోట్లు కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయని, పది రోజుల్లో నేరుగా నష్టపోయిన రైతుల ఖాతాల్లో జమ కానున్నాయని వెల్లడించారు. ఎంపీ సంజయ్ ప్రతీ అంశంపై వరద, బురద రాజకీయాలతో దద్దమ్మ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎంపీకి చేతనైతే కేంద్రంతో ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సురేందర్ రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, షుక్రోద్దీన్, రాజేందర్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు బీఆర్‌ఎస్

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: క్రమశిక్షణకు మారుపేరు బీఆర్‌ఎస్ పార్టీ అని, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. మీసేవ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావం అనంతరం మొదటిసారిగా మంగళవారం కరీంనగర్ నియోజక వర్గస్థాయి ప్లీనరీ సమావేశాన్ని రేకుర్తిలోని రాజశ్రీ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచే అన్ని గ్రామాలు, పట్టణాల్లో శాఖ అధ్యక్షులు విధిగా పార్టీ జెండాలు ఆవిష్కరించి పండుగ వాతావరణంలో రాజశ్రీ గార్డెన్‌లో జరిగే ప్లీనరీ తరలిరావాలని సూచించారు. ప్రతీ కార్యకర్త, నాయకులు విధిగా గులాబీ కలర్ చొక్కా, బ్యాడ్జీ ధరించి రావాలన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని కార్యకర్తలకు వివరించి రానున్న రోజుల్లో ప్రజాక్షేత్రంలో వాస్తవాలను వెల్లడించి బీఆర్‌ఎస్‌ను తిరుగులేని శక్తిగా తయారు చేయడమే లక్ష్యంగా కార్యకర్తలకు దిశానిర్దేశనం చేయనున్నట్లు వెల్లడించారు. రూ.47లక్షల కోట్ల కేంద్రబడ్జెట్‌లో బీసీలకు నికరంగా రూ.2వేల కోట్లు కూడా దక్కకపోవడానికి ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ లేకపోవడమే కారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 125 అడుగుల అంబేద్కర్ విగ్రహంతో పాటు, రాష్ట్ర సచివాలయానికి బాబాసాహెబ్ పేరు పెట్టిందని, అదే స్ఫూర్తితో కేంద్రం నూతన పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్, వాసాల రమేష్, కె.శ్రీనివాస్, కుల్దీప్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక ఆత్మీయ సంబరాలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

కరీంనగర్: కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో మే1, 2వ తేదీల్లో కార్మిక ఆత్మీయ సంబరాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కార్మిక, వివిధ సంక్షేమ శాఖల అధికారులతో మే డే ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కార్మికులుగా గుర్తింపు పొందిన లబ్ధిదారులందరికీ పరిహారం చెక్కులు పంపిణీ చేయాలని సూచించారు. సీఎస్‌సీ హెల్త్ కేర్ ద్వారా మంగళవారం నుంచి మే డే వరకు హెల్త్ క్యాంపులు నిర్వహించి వివిధ రక్త పరీక్షలు, ఊపిరితిత్తులు, కంటి, చెవి, ఈసీజీ మొదలగు 132 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందించాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో కార్మిక సంక్షేమ భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించి మే 1 నాడే భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్మికశాఖ అధికారి రమేశ్‌బాబు, చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు సంపత్, పౌరసరఫరాల అధికారి శ్రీకాంత్, సహాయ ఎంవీఐ రజినిదేవి, జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

- కేసీఆర్ అరాచకాలకు అంతం పలుకుదాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్



పార్టీలోకి ఆహ్వానించిన బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: తెలంగాణలో అధికారంలోకి రాబోయేది బీజేపీయేనని, కేసీఆర్ నియంత, అవినీతి, కుటుంబ అరాచకాలకు అంతం పలకడమే లక్ష్యంగా పార్టీ పోరాడుతోందని, రామరాజ్యం కోరుకునేవాళ్లంతా బీజేపీలో చేరాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల నియోజకవర్గం గంభీరావుపేట మండలం జగదంబ తండా గ్రామ ఉప సర్పంచ్ ప్రమీల, వార్డ్ మెంబర్స్, రాజమణి, సోనా, అమృత, సరిత, సక్రి తోపాటు సుమారు వందమంది కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో సోమవారం సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరగా, వీరందరికీ కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదని, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌తో 30 లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్తు అంధకారంలో పడిందన్నారు. వడగండ్ల వానతో పంట నష్టపోయి రైతులు అల్లాడుతుంటే కేసీఆర్ మాత్రం ఇతర రాష్ట్రాల్లో బహిరంగ సభల పేరుతో రాజకీయాలు చేస్తున్నారే తప్ప రైతులను ఆదుకున్న పాపాన పోలేదన్నారు. కేసీఆర్ పాలనకు చరమగీతం పలకాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిబోయిన గోపి, మండల అధ్యక్షుడు గంట అశోక్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు తిరుపతి, ఆకుల మురళీమోహన్‌గౌడ్, కోడె రమేష్, మహేశ్ యాదవ్, అయోధ్య రవి, మద్దుల రాజిరెడ్డి, భాస్కర్ నాయక్, శ్రవణ్‌యాదవ్, కొక్కు దేవేందర్‌యాదవ్, అన్వర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి సీహెచ్ జనార్దన్‌రావు సూచించారు. మంకమ్మతోటలోని ధన్గర్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రగతి, వచ్చే విద్యా సంవత్సరం చేపట్టాల్సిన అంశాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 6 నుంచి 9వ తరగతుల వరకు విద్యార్థుల ప్రగతిపై తరగతి వారీగా పరిశీలన చేసి ఉపాధ్యాయుల నుంచి విద్యార్థుల గ్రేడ్‌లను అడిగి తెలుసుకున్నారు. తక్కువ గ్రేడ్ వచ్చిన విద్యార్థులపై తగు శ్రద్ధ, రాబోవు విద్యా సంవత్సరంలో చేపట్టాల్సిన తదితర విషయాల గురించి చర్చించి తగు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రగతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో మధుసూదనాచారి, హెచ్‌ఎం పుల్లూరి శ్రీనివాస్, ఎస్‌ఎంసీ చైర్మన్ విజయ, ఉపాధ్యాయులు తిరుణహరి, వెంకటప్రసాద్, పవన్‌కుమార్, రమాదేవి, త్రివేణి, మంజుల, రాధిక, సంజీవయ్య, బాలయ్య, ఆనందం, మోహన్, లత, మాధవీలత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ సరఫరా చేయాలి



సమావేశంలో నాయకులు

సైదాపూర్(హుస్నాబాద్): విశ్వకర్మ పంచకులాలు చేతివృత్తులకు ఉపయోగిస్తున్న విద్యుత్‌ను 200 యూనిట్ల వరకు బిల్లు లేకుండా ఉచితంగా సరఫరా చేయాలని విశ్వకర్మ పరిషత్తు జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీలకు ఉచిత కరెంట్, రైతులకు వ్యవసాయానికి ఉచిత కరెంట్ సరఫరా చేసినట్లు విశ్వకర్మలు నిర్వహిస్తున్న చేతి వృత్తుల చిన్న తరహా పరిశ్రమలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేయాలని, అంతకంటే ఎక్కువ యూనిట్లు ఉంటే 4వ కేటగిరీ కింద బిల్లులు వేయాలన్నారు. అలాగే 50 ఏళ్లు నిండిన విశ్వకర్మలకు ఆసరా పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. విశ్వకర్మల అభివృద్ధికి 2013లో అప్పటి ప్రభుత్వం రూ.250 కోట్లు ప్రకటించిందని, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వకర్మల హక్కుల సాధనకు నిర్వహించే ఆత్మగౌరవ సభను మండలం నుంచి విశ్వకర్మలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ ఎగ్గోజు సుదర్శనాచారి, కో కన్వీనర్ నాగభూషణాచారి, దామోదరాచారి, భాస్కరాచారి, శంకరాచారి, సంపత్, మండల అధ్యక్షుడు దుంపేటి ఆంజనేయులు, రమణాచారి, బ్రహ్మాచారి, రాజు, రమేష్ పాల్గొన్నారు.

ఆర్టిజన్ల సమ్మెకు బీజేపీ మద్దతు



ఎంపీ సంజయ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్టిజన్లు

కరీంనగర్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ మంగళవారం నుంచి సమ్మెలోకి వెళ్లనున్న విద్యుత్ ఆర్టిజన్లకు బీజేపీ రాష్ట్ర శాఖ తరఫున మద్దతు ప్రకటిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఆర్టిజన్ల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తామని కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ సమ్మె చేస్తున్న ఆర్టిజన్లపై ఎస్మా ప్రయోగించి ఉద్యోగాల నుంచి తొలగిస్తామనడం దుర్మార్గమన్నారు. రేపటి సమ్మెను భగ్నం చేసేందుకు ఆర్టిజన్లను ముందస్తుగా అరెస్టులు చేస్తూ బెదిరింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. కాగా సోమవారం కరీంనగర్‌లో పర్యటించిన బండి సంజయ్‌కుమార్‌ను ఎంపీ కార్యాలయంలో తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు మధుకుమార్, రవీందర్‌రెడ్డి తదితరులు కలిసి సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారి సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయడంతోపాటు ఆర్టిజన్లకు విద్యుత్ సర్వీస్ రూల్స్‌ను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ల పక్షాన ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు.

రోజూ కోవిడ్ వ్యాక్సినేషన్ చేయాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి



కరీంనగర్‌టౌన్: కంటి వెలుగు, ఆరోగ్య మహిళా, న్యూట్రిషన్ కిట్, కోవిడ్ వ్యాక్సినేషన్ అమలు తీరుపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.లలితాదేవి జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులతో సోమవారం జూమ్ వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 18 ఏళ్లు పైబడిన వారందరికీ కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రికాషనరీ డోస్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోజూ వేయాలని సూచించారు. గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ కార్యక్రమం త్వరలో ప్రారంభం అవుతున్నందున స్టోర్ రూమ్‌లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గర్భిణుల నమోదును కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 100 శాతం నిర్వహించడం లేదని, తప్పకుండా నమోదు చేసి వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా 8 ఆరోగ్య సమస్యలను గుర్తించి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని రెఫెరల్ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియం చేసుకునేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. వెబ్‌నార్‌లో వైద్యులు కె.రవీందర్‌రెడ్డి, జ్యోతి, శిల్పారెడ్డి, నాగశేఖర్, రంగారెడ్డి, టి. రవీందర్, వినీత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో మంగళవారం నిర్వహించే కంటి వెలుగు శిబిరాల వివరాలను డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి ప్రకటించారు. కరీంనగర్ నగరంలో 2,3,9,23,24,25,26,34,38,50,52,59వ డివిజన్‌లలో, హుజురాబాద్ పట్టణం 20వ వార్డు, అదే మండలంలోని సింగపూర్, రాంపూర్ గ్రామాల్లో శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణం 14 వార్డు, అందే మండలంలోని పాపయ్యపల్లి, మాచినపల్లి, వీణవంక మండలం గన్ముక్కుల, వల్బాపూర్, చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి, నవాబుపేట, చొప్పదండి మండలం ఆర్నకొండ, చిట్యాలపల్లి, ఇల్లందకుంట మండలం సీతంపేట, గంగాధర మండలం నాగిరెడ్డిపూర్, గట్టుబూత్కూర్, రామడుగు మండలం వెలిచాల, దత్తోజిపేట, కొత్తపల్లి మండలం చింతకుంట, ఖాజీపూర్, కరీంనగర్ రూరల్ మండలం దుర్శెడ్, మానకొండూరు మండలం గట్టుదుద్దెనపల్లి, అన్నారం, రంగంపేట, దేవంపల్లి, సైదాపూర్ మండలం జాగీర్‌పల్లి, రాయికల్, శేశవపట్నం మండలం గద్దపాక, ఇప్పలపల్లి, తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం, పోలంపల్లి, గొల్లపల్లి, గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామంలో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ బ్యాంకు ఉద్యోగి మృతి



హరీశ్ (ఫైల్)

చొప్పదండి: పట్టణంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో పని చేస్తున్న వేముల హరీశ్ (36) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 20న బ్యాంకు విధులు ముగించుకొని సాయంత్రం తన స్వగ్రామం రామడుగు మండలం రుద్రారం వెళ్తుండగా, చొప్పదండి– గుమ్లాపూర్ మధ్య గల రోడ్డులో గేదె అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడింది. హరీశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనం ద్వారా కరీంనగర్ తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయిస్తుండగా బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించి అవయవ దానం చేశారు. చొప్పదండి ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు, సిబ్బంది సంతాపం ప్రకటించారు. మృతుడి తండ్రి రాజేశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉపేంద్రచారి తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని తీన్‌ఖని చౌరస్తా వద్దనున్న ప్రభుత్వ ఉర్దూ మీడియం స్కూల్‌లో ఈ నెల 11న రాత్రి కుట్టు మెషీన్లు, ఆటవస్తువులు చోరీ చేసిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం మంచినీళ్ల బావి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. ఆ సమయంలో తీన్‌ఖని చౌరస్తాకు చెందిన సాయికుమార్, వైభవ్‌లు కుట్టు మెషీన్లను విక్రయించేందుకు తీసుకెళ్తూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. 7 కుట్టు మెషీన్లు, ఆటవస్తువులు స్వాధీనం చేసుకొని, నిందితులు ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరో ముగ్గురు మైనర్లు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

నేటి నుంచి ఓపెన్ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు

కరీంనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 25 నుంచి మే 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ చలువాజి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్‌లో 1,032 మంది, ఎస్‌ఎస్‌సీలో 519 మంది కోసం కరీంనగర్‌లో మూడు ఇంటర్మీడియట్ సెంటర్లు, మూడు ఎస్‌ఎస్‌సీ సెంటర్లు, హుజూరాబాద్‌లో 2 ఇంటర్, ఒక ఎస్‌ఎస్‌సీ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఖాజీపూర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్ సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని 18 ఏళ్ల పైబడిన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో ఏ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, సర్పంచ్ ఇల్లందుల రాజమ్మ, శిబిరం ఇన్‌చార్జి డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ హరీశ్, సోమినేని తిరుపతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫకీర్‌పేటలో ప్రీ స్కూల్ మేళా



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఫకీర్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ప్రీస్కూల్ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కటకం నందయ్య, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేచల్ ఏలియాస్, ఉపాధ్యాయుడు భూపాల్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ నీల, ఆయా కళ తదితరులు పాల్గొన్నారు.

ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని కోతిరాంపూర్ సెక్టార్ పరిధిలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సోమవారం అన్నమనేని గార్డెన్‌లో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఏడాదిలో నేర్పిన వాటిపై పిల్లలతో ఆక్టివిటీస్, సృజనాత్మక కార్యక్రమాలు చేయించారు. అనంతరం అసైన్‌మెంట్ కార్డులను కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్ చేతుల మీదుగా అందజేశాఉ. కార్యక్రమంలో సీడీపీవో ఉమారాణి, సూపర్‌వైజర్ విజయ, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, శ్యామల, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘటంకుండ ఊరేగింపు

కరీంనగర్‌కల్చరల్: గౌడ కులస్తుల అధ్వర్యంలో నిర్వహించే రేణుకాదేవి ఎల్లమ్మతల్లి బోనాల జాతరలో భాగంగా సోమవారం పాతబజార్ నుంచి ఘటం కుండ ఊరేగింపు ఘనంగా జరిగింది. భక్తిశ్రద్ధలతో ఘటాన్ని బైపాస్‌రోడ్డులోని ఎల్లమ్మతల్లి ఆలయానికి తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, సుడా డైరెక్టర్ శ్రీనివాస్, కోడూరి మహేందర్, గుగ్గిళ్ల శ్రీనివాస్, మాచెర్ల ప్రసాద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శివకల్యాణం

కరీంనగర్ కల్చరల్: నగరంలోని జెడ్పీక్వార్టర్స్ ఆవరణలో గల శివాలయంలో మంగళవారం ఉదయం శివకల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కొస్న కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే గురువారం అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి హోమం, ఫలరసపంచామృతాభిషేకం, అన్నదానం, సాయంత్రం పడిపూజ, అల్పాహారం ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ఈ రెండు కార్యక్రమాల్లో పాల్గొని తరించాలని కోరారు.

ప్రముఖ సాహితీవేత్త బాల శ్రీనివాస మూర్తి మృతి

కరీంనగర్‌కల్చరల్: ప్రముఖ సాహితీవేత్త, తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు ప్రొఫెసర్ గుమ్మన్నగారి బాల శ్రీనివాస మూర్తి సోమవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన అకాల మరణం సాహితీ లోకానికి తీరని లోటని పలువురు సాహితీవేత్తలు అన్నారు. ఆయన ఆధునిక తెలుగు సాహిత్యంలో సంప్రదాయాన్ని మేళవించి పరిశోధనలు చేశారు. సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్త అనిల్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డా.నలిమెల భాస్కర్, డా.మచ్చ హరిదాసు, దాస్యం సేనాధిపతి, అన్నవరం దేవేందర్, గాజుల రవీందర్, కలువకుంట రామకృష్ణ, స్తంభంకాడి గంగాధర్ తదితరులు సంతాపం ప్రకటించారు.

మార్చురీ పేరిట రూ.20 లక్షలు వృథా

- అవసరానికి తగ్గట్టుగా లేని నిర్మాణం
- పోస్టుమార్టంకు సరిపోదని తేల్చేసిన అధికారులు
- ప్రారంభం కాకుండానే మూలనపడ్డ భవనం

"ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వెనుక భాగంలో నూతనంగా మార్చురీ భవన నిర్మాణం చేసి ఎనిమిదేళ్లవుతోంది. రూ.20 లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ భవనం ప్రారంభం కాకుండా మరుగున పడింది. భవన నిర్మాణాన్ని అవసరాలకు తగినట్లు చేయకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. అయితే నిర్మాణం పూర్తయిన నాటి నుంచి ప్రారంభం అప్పుడు ఇప్పుడు అంటూ దాటవేసి చివరకు అది సరిపోదని అధికారులు చేతులెత్తేశారు. దీంతో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన మార్చురీ భవనం వృథాగా మారింది."



మార్చురీ కోసం నిర్మించిన భవనం

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్మించిన మార్చురీ నూతన భవనం ప్రారంభానికి నోచుకోకుండానే మూలన పడింది. ఇందుకు చాలా కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. గదులు ఇరుకుగా ఉండటం ఒకటైతే, నూతనంగా నిర్మించిన మార్చురీ వెనుక భాగంలో ఉన్న ప్రైవేటు వైద్యులు అది ప్రారంభం కాకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం నిర్వహిస్తున్న మార్చురీ ఆసుపత్రి ముందు భాగంలో ఉన్నందున మృతుల బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత భవనాన్ని ఆధునీకీకరించేందుకు స్థలం లేక పోవడంతో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మంచినీరు, మూత్రశాలలు కూడా అందుబాటులో లేవు. శవ పరీక్ష సమయంలో వచ్చిన బంధువులు ఒక్కోసారి ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించాల్సి ఉంటుంది. హత్య, ఆత్మహత్య, అనుమానాస్పద మృతులకు శవపరీక్ష తప్పనిసరి. కోర్టు కేసుల్లో నిందుతుడికి శిక్షపడే విషయంలో వైద్యులిచ్చే నివేదిక ఎంతో కీలకమైంది. గుర్తు తెలియని శవాలను భద్రపరచడానికి రిఫ్రిజిరేటర్లు ఉండాల్సి ఉంటుంది. అన్ని సౌకర్యాలు సమకూర్చాలంటే నూతన భవనంలోకి మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ ఆ భవనం సరిపోదని అధికారులు చెప్పడంతో పాటు ఆ భవనంకు ఇరువైపుల స్థలమే లేకుండా ల్యాబ్‌లు నిర్మాణం చేయడంతో మార్చురీ కథ కంచికి చేరింది.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా..?

శవ పరీక్షల కోసం నిర్మాణం చేసిన నూతన భవనం ఎనిమిదేళ్లుగా వృథాగానే ఉంటుంది. అయితే కోవిడ్ విజృంభణ సమయంలో మృతులు ఎక్కువగా ఉండడంతో శవాలను భద్రపర్చేందుకు ఉపయోగించారు. ఆ తర్వాత ఖాళీగానే ఉంది. ఇటీవల కాలంలో గుర్తు తెలియని వ్యక్తులు శవపరీక్ష గది తాళాలను తొలగించి ఉపయోగిస్తున్నట్లు తెలిసింది. ఈ భవనాన్ని కొంత మంది అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇది నిత్యకృత్యంగా సాగుతుండడంతో పెద్దఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

పోస్టుమార్టంకు సరిపోవడం లేదని..

నూతనంగా నిర్మించిన పోస్టుమార్టం గది శవ పరీక్షలకు సరిపోయేంత లేదు. టేబుల్స్ నిర్మాణం కూడా శాస్త్రీయంగా జరగలేదు. దీంతో కొత్త మార్చురీ భవనంలోకి మార్చలేకపోయాం. మార్చురీ భవనంలో ఇతరులు ఉంటున్న విషయం నా దృష్టికి రాలేదు. ఎవరైనా ఉంటే వెంటనే ఖాళీ చేయిస్తాం.

– డాక్టర్ రత్నమాల, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్

చిత్ర కథ: డ్రెయినేజీల నిర్మాణం చేపట్టండి



నగరంలోని శాతవాహనయూనివర్సిటీ వద్ద గల అస్తపురం ప్రాంతంలో డ్రెయినేజీలు లేక పోవడంలో మురుగునీరంతా ఇళ్ల మధ్యనే నిలుస్తోంది. ముగురునీటితో దుర్వాసత వెలువడి రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీలు నిర్మాణం చేపట్టి ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా చూడాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

కొత్తపల్లి: రైతులు పండించిన వరిధాన్యాన్ని గిట్టుబాటు ధరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్ అన్నారు. కొత్తపల్లి మండలం కమాన్‌పూర్, ఎలగందుల, నాగులమల్యాల, ఖాజీపూర్, బద్దిపల్లి గ్రామాల్లో కరీంనగర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. రైతును రాజు చేయాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ధాన్యానికి మద్దతు ధర చెల్లిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, కరీంనగర్ పీఏసీఎస్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఫక్రుద్దీన్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, సర్పంచులు సంపత్, ప్రసాద్, రాజమ్మ, మధు, ఎంపీటీసీ కొమ్ము హేమలత, సోమినేని తిరుపతి, సింగిల్‌విండో, ఏఎంసీ డైరెక్టర్లు, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

‘పొన్నం’ వ్యాఖ్యలు హాస్యాస్పదం

- మేయర్ వై.సునీల్‌రావు



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్: బీజేపీ పార్టీకి కాంగ్రెస్ క్యాడర్ అంతా ఏనాడో అమ్ముడు పోయిందనే విషయాన్ని ఏఐసీసీ సభ్యుడు పొన్నం ప్రభాకర్ గుర్తుంచుకోవాలని మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీపై కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టాతూ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉప ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా పనిచేసింది కాంగ్రెస్ పార్టీ అనే విషయాన్ని పొన్నం ప్రభాకర్ మరిచిపోతే ఎలా అని ఎద్దేవా చేశారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో మీ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్థానికేతర వ్యక్తికి టికెట్ ఇచ్చి నిలబెట్టి బీజేపీ గెలుపునకు సహకరించింది కాంగ్రెస్ పార్టీ కాదా..., బీజేపీకి అమ్ముడు పోయింది మీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ స్థాపించిన బీఆర్‌ఎస్ పార్టీకి ఎవరి స్నేహం, మద్దతు అవసరం లేదని తేల్చి చెప్పారు. ఏనాడో కరీంనగర్ ప్రజలు పొన్నంను మరిచిపోయారని అలాంటి నీకు కేసీఆర్ పాలన, బీఆర్‌ఎస్ పార్టీపై విమర్శించే అర్హత లేదని మండిపడ్డారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఏసీపీ

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గౌరిశెట్టి రాజేశం-చండికాంబ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కరీంనగర్ టౌన్ ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ మనోజ్‌కుమార్, నర్సింగ్‌రావు, కన్న కృష్ణ, కరుణాకర్, అశోక్‌రావు, బాల్‌నారాయణ, రమేశ్, హన్మండ్లు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందజేస్తున్న ఎంపీ బండి సంజయ్

కరీంనగర్‌స్పోర్ట్స్: ఖేలో కరీంనగర్ జీతో కరీంనగర్ పేరుతో ఇటీవల కరీంనగర్ పార్లమెంట్ క్రీడోత్సవాల్లో గెలిచిన క్రీడాకారులకు సోమవారం అంబేడ్కర్ స్టేడియంలో బహుమతులు అందజేశారు. పార్లమెంట్ పరిధిలోని కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల నుంచి యువతీ యువకులు పాల్గొన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌లో గెలుపొందినవారికి ఎంపీ బండి సంజయ్ బహుమతులు అందజేశారు. డీవైఎస్‌ఓ రాజవీరు, బీజేపీ కరీంనగర్, సిరిసిల్ల, హన్మకొండ జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, ప్రతాప రామక్రిష్ణ, రావు పద్మ, సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి, హుస్నాబాద్ నేత బొమ్మ శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ బోనాల జాతర విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కోడూరి సత్యనారాయణగౌడ్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లో ఈనెల 25న గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుకాదేవి ఎల్లమ్మతల్లి బోనాల జాతరను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్ అన్నారు. సోమవారం బైపాస్‌రోడ్డులోని ఎలమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1947 నుంచి ఈ బోనాల జాతర నిర్వహిస్తున్నారని, ఆలయానికి పెద్ద చరిత్ర ఉందని అన్నారు. గౌడ కులస్తులందరూ కలిసికట్టుగా పనిచేస్తూ ఆలయ అభివృద్ధి కోసం ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఆలయం అభివృద్ధి దశలో నడుస్తోందని, రాబోయే జాతర వరకు వాటర్ ఫౌంటేన్, పచ్చని చెట్లతో కూడిన ఆహ్లాదకరమైన టూరిస్ట్ కేంద్రంగా ఆలయం రూపుదిద్దుకుంటుందని అన్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు రాంనగర్ నుంచి బోనాలతో ర్యాలీగా బయలు దేరి కోతిరాంపూర్ మీదుగా ఎల్లమ్మతల్లి ఆలయానికి చేరుకుంటారని తెలిపారు. రాత్రి 10 గంటలకు రేణుకాదేవి జమదగ్నుల కల్యాణం ఉంటుందని, బుధవారం నాగవెల్లి పట్నాలు, మొక్కుల చెల్లింపులతో జాతర ముగుస్తుందని అన్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో సుడా డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, కొడూరి మహేందర్‌గౌడ్, గుగ్గిళ్ల శ్రీనివాస్, ప్రసాద్, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐఎఫ్‌బీ నాయకులు

కరీంనగర్: అకాల వర్షాలు, వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ, జిల్లాలో వడగండ్ల వానలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు రైతులను ఓదార్చడంతో పాటు నష్టపరిహారం వచ్చేలా చూడాలన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో చొప్పదండి, కాట్నపల్లి, మల్లన్నపల్లి, గుమ్లాపూర్, వెదురుగట్ట, భూపాలపట్నం, రాగంపేట తదితర గ్రామాలల్లో గాలి దుమారం, వడగండ్ల వానకు వేలాది ఎకరాల్లో వడ్లు నేలరాలిపోయాయని వాపోయారు. క్షేత్రస్థాయిలో అన్నిచోట్ల వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో జిల్లా కమిటీ సభ్యులు కురువల్లి శంకర్, జి. ప్రశాంత్‌కుమార్, బద్రినేత తదితరులు ఉన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష కేంద్రాల పరిశీలన

హుజూరాబాద్: హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో మంగళవారం నుంచి జరుగనున్న ఓపెన్ ఇంటర్, ఓపెన్ టెన్త్ పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు సోమవారం పరిశీలించారు. తగిన ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ఎంఈవో కేతిరి వెంకట నర్సింహారెడ్డి, ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



చామనపల్లిలో వరిపంటను పరిశీలిస్తున్న రోహిత్‌రావు

కరీంనగర్‌రూరల్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మెన్నేని రోహిత్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ మండలం చామనపల్లి, తాహెర్‌కొండాపూర్, జూబ్లీనగర్, ఫకీర్‌పేట గ్రామాల్లో వర్షాలతో నష్టపోయిన వరిపంటను పరిశీలించారు. రైతులను పంట నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు సీఎం కేసీఆర్ అండగా ఉంటారని చెప్పడం సరికాదన్నారు. గత నెలలో రామడుగుకు వచ్చి సీఎం చేసిన హామీలు ఇంతవరకు అమలు కావడం లేదని ఆరోపించారు. పంటల బీమా విధానంలో రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు సాయిలు, కనుకయ్య, హరీశ్, శ్రీనివాస్, శంకరయ్య, తిరుపతి, రాజయ్య, సుదర్శన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేగుర్తిలో ఇసుక లారీల అడ్డగింత

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చేగుర్తిలో సోమవారం రైతులు ఇసుక లారీలను అడ్డుకుని నిరసన తెలిపారు. దారి లీజు ముగిసిందని మళ్లీ ఇవ్వలేమంటూ క్వారీ నిర్వాహకులకు తేల్చి చెప్పారు. అనంతరం కలెక్టరేట్ ప్రజావాణిలో కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులకు అవసరమైన ఇసుకను తరలించేందుకు చేగుర్తి శివారులో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎస్ఎస్ లాజిస్టిక్ సంస్థ లారీలు, టిప్పర్ల రాకపోకలకు అవసరమైన దారిని ఏడాదిపాటు లీజుకు ఇచ్చామని, గడువు ముగిసిందని తెలిపారు. ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు అడుగంటాయని, లారీల రాకపోకలతో పంటలపై దుమ్ము పడి దిగుబడి తగ్గిందని వివరించారు. క్వారీ కోసం మరో దారిని ఏర్పాటు చేసుకునేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

‘తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి’

కరీంనగర్: రెండు రోజులుగా కురిసిన అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే బేషరతుగా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పంటల బీమా పథకాన్ని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలో అమలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని దీనికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. తక్షణమే ప్రభుత్వం అధికారులతో సర్వే చేయించి యుద్ధ ప్రాతిపదికన రైతులకు సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా ఎకరానికి రూ.10వేలు పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయఅధికారులు, కలెక్టర్ పంట నష్టపోయిన రైతులను పరామర్శించి భరోసా కల్పించి పరిహారం ఇప్పించాలని, లేనిపక్షంలో కేంద్ర, ,రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఆగ్రహానికి గురికాక తప్పవని హెచ్చరించారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న జోజిరెడ్డి

కరీంనగర్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ(ఏఐఎఫ్‌బీ) కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సంఘ కార్యాలయంలో మాట్లాడారు. ఆరుగాలం శ్రమించిన రైతాంగానికి అకాల వర్షాలు, వడగండల్ల వల్ల అన్నమో రామచంద్రా అన్న పరిస్థితి నెలకొందని, కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు మానవనీయ కోణంలో ఆలోచించి సహాయం చేయాలి కానీ.. వరద, బురద రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. సీఎం కేసీఆర్ చెబుతున్న మాటలకు చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోయిందని విమర్శించారు. తక్షణమే రైతులను ఆదుకోవాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలతో పాలకులకు బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని లేకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో చొప్పదండి నియోజకవర్గం కన్వీనర్ పెద్దెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామ నూతన పంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం సర్పంచ్ తాటికొండ పుల్లాచారి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింత శ్రావణ్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీకాంత్ రెడ్డి, కాంట్రాక్టర్ రవీందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి కవిత, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో చేపడుతున్న స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బృందావనం ఫంక్షన్ హాల్ బ్యాక్ సైడ్ ఏరియా, కాకతీయ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ సుధీర్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..?



కరీంనగర్ మండలం మొగ్ధుంపూర్ స్టేజీ వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చివేయడంలో ఆర్‌అండ్‌బీ శాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఆర్నెళ్ల నుంచి మొగ్ధుంపూర్-నగునూరు వెళ్లే దారిలో మూలమలుపు వద్ద ఉన్న గుంతలో పడి పలువురు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. శనివారం కురిసిన వర్షానికి గుంతలో నీరు నిల్వడంతో వాహనదారులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు చిన్న వాహనదారులు నీటిలో పడిపోయారు. ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చివేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లన్న యాదవ్ కోరారు.

– కరీంనగర్‌రూరల్

క్లుప్తంగా...

వివేకా కేసు దర్యాప్తు గడువు పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో దర్యాప్తు కాల పరిమితిని సుప్రీంకోర్టు పొడిగించింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 30వతేదీతో గడువు ముగియనుండగా తాజాగా జూన్ 30 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యా యమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు వెలువరించింది. మరోవైపు ఈ కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్‌కి సంబంధించి తెలంగాణ హై కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ముగించింది. సునీత తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా, అవినాశ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ గురించి ఈ సమయంలో అడగాల్సిన అవసరం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా మంగళవారం తెలంగాణ హైకోర్టు ముందుకు రానున్న పిటిషన్‌లో ముందస్తు బెయిల్‌కు సంబంధించి అవినాశ్ రెడ్డి తన వాదనలు వినిపించుకోవచ్చని ధర్మాసనం చెప్పింది.

మంజీరా కుంభమేళా ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల పరిధిలోని రాఘవాపూర్–హుమ్నాపూర్ గ్రామాల శివారులోని పంచవటి క్షేత్రంలో మంజీర (గరుడగంగ) కుంభమేళా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. క్షేత్రంలోని ఆలయాల్లో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం, గంగా స్నానాలు, బోనాల ఊరేగింపు, గంగపూజ, హోమం, పూర్ణాహుతి, అమృత స్నానాల కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, జహీరాబాద్, నారాయణఖేడ్ ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, భూపాల్‌రెడ్డి ఉత్సవాలకు హాజరయ్యారు.

నేటి నుంచి రామానుజుల జయంతి వేడుకలు

శంషాబాద్ రూరల్: భగవద్రామానుజుల 1006వ జయంతి సందర్భంగా మంగళవారం నుంచి ముచ్చింతల్ సమీపంలోని శ్రీరామనగరం సమతా స్ఫూర్తి కేంద్రంలో వేడుకలు నిర్వహించనున్నారు. మే 1 వరకు జరిగే ఈ వేడుకల్లో రోజూ తిరుమంజన సేవ, తిరువీధి సేవలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.


ఔరంగాబాద్ సభకు హాజరైన జనం

నదులున్నా తాగునీరేదీ?

▶ మొదటి పేజీ తరువాయి

దేశం ముందుకెళ్లదు. అనివార్యమైన మార్పును తీసుకురావడం కోసమే బీఆర్‌ఎస్ పుట్టింది. ఒక కులం, మతం, వర్గం కోసం ఆవిర్భవించలేదు. బీఆర్‌ఎస్‌కు ఒక లక్ష్యం ఉంది. మార్పు వచ్చే వరకు పార్టీ పోరాటం ఆగదు. నిజాయితీగా మేం చేసే పోరాటానికి విజయం తథ్యం. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ నీరు ఇస్తాం. కొత్త పార్టీ అనగానే కొందరు అపవాదులు సృష్టిస్తారు. ఎన్ని అవాంతరాలు సృష్టించినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదు..' అని కేసీఆర్ స్పష్టం చేశారు.

అబద్ధమైతే సీఎం పదవిలో నిమిషం కూడా ఉండను

'వాస్తవానికి దేశంలో సమృద్ధిగా నీటి వనరులున్నాయి. వీటిని సాగు యోగ్యత ఉన్న భూములకు అందించాల్సి ఉంది. 24 గంటలు విద్యుత్ సరఫరా చేయగల వనరులు ఉన్నాయి. దేశం మొత్తం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వొచ్చు. నేను చెప్పేది అబద్ధమైతే ఒక్క నిమిషం కూడా సీఎం పదవిలో ఉండను. తెలంగాణలో మంచినీటి సమస్య లేకుండా చేశాం. తెలంగాణ రాకముందు రోజుకు 3 గంటలే కరెంటు ఉండేది. ఒక్కోసారి అది కూడా ఉండేది కాదు. ప్రస్తుతం తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తున్నాం. భూముల రిజిస్ట్రేషన్లు పావుగంటలో అవుతున్నాయి. రైతు చనిపోతే బీమా కల్పిస్తున్నాం. ఇవి మహారాష్ట్రలో ఎందుకు అమలు కావడం లేదు? తెలంగాణలో సాధ్యమైనప్పుడు మహారాష్ట్రలో ఎందుకు సాధ్యం కాదు? ఎందుకంటే ప్రధాని, రాష్ట్రాల సీఎంలకు ఆ పనిచేసే సామర్థ్యాలు లేవు..' అని కేసీఆర్ విమర్శించారు.

కొత్త సంకల్పంతో ముందుకు సాగాలి

'నా మాటలు ఇక్కడ విని ఇక్కడే మరిచిపోకండి. గ్రామాలకు వెళ్లి చర్చ చేయండి. మీ ఇంటివాళ్లు, స్నేహితులు, వీధిలో ఉన్న వారితో చర్చించండి. దేశంలో ఉండాల్సిన స్థితిలో ఉందా? లేదా? అనే విషయంపై చర్చ పెట్టాలి. లక్ష్యం లేని ప్రయాణం ఎక్కడికి వెళుతుంది? దేశం కొత్త లక్ష్యాలు, కొత్త సంకల్పంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయ్యింది. అయినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. శంభాజీనగర్‌లో వారానికోసారి నీళ్లు వస్తాయా? మహారాష్ట్రలో కేబినెట్ ఉంటుంది. చీఫ్ సెక్రటరీ ఉండరా?..' అని ప్రశ్నించారు.


ఔరంగాబాద్ సభలో సీఎం కేసీఆర్

తెలంగాణ మోడల్ అమలు చేస్తే ఎందుకు వస్తా?

'కేసీఆర్‌కు మహారాష్ట్రలో ఏం పని అని ఫడ్నవీస్ అంటున్నారు. తెలంగాణ లాంటి మోడల్ మహారాష్ట్రలో తీసుకొస్తే నేనెందుకు వస్తాను? మహారాష్ట్రలో దళితబంధు, రైతుబంధు అమలు చెయ్.. 24 గంటల కరెంటు ఇవ్వు. రైతుబంధు, రైతుబీమా కల్పించండి. ఇవన్నీ అమలు చేస్తే మహారాష్ట్రకు రానే రాను. అంబేడ్కర్ జన్మించిన నేలపై దళితులను పట్టించుకోరా? దళితబంధు లాంటి పథకం మహారాష్ట్రలో ఎందుకు అమలు చేయరు?..' అని నిలదీశారు.

ప్రజల ఆకాంక్ష గెలవాలి

'దేశంలో పరివర్తన రావాల్సిన అవసరం ఉంది. ఒక పార్టీ గెలిస్తే.. మరో పార్టీ ఓడిపోవడం పరివర్తన కాదు. ఎవరు గెలిచినా సమస్య అపరిష్కృతంగానే ఉంటోంది. అందువల్ల పార్టీలు గెలవడం ముఖ్యం కాదు.. ప్రజల ఆకాంక్ష గెలవడం ముఖ్యం. పరివర్తన రానంత కాలం ఈ దేశం ఇలాగే కునారిల్లుతుంది. ఎంత త్వరగా మేల్కొంటే.. అంత త్వరగా బాగుపడతాం..' అని కేసీఆర్ అన్నారు. నూతనంగా నిర్మించే పార్లమెంటుకు అంబేడ్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

అభయ్ పాటిల్ ఇంటికి కేసీఆర్

హైదరాబాద్ నుంచి ఔరంగాబాద్ సభకు వెళ్లిన కేసీఆర్, విమానాశ్రయం నుంచి నేరుగా వైజాపూర్ మాజీ ఎమ్మెల్యే అభయ్ పాటిల్ ఇంటికి చేరుకున్నారు. ఆయనకు అక్కడ అపూర్వ స్వాగతం లభించింది. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీసు ఏర్పాటు చేస్తామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. కేసీఆర్ వెంట పార్టీ ఎంపీలు కేశవరావు, రంజిత్ రెడ్డి, సంతోష్ కుమార్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, కడియం శ్రీహరి, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఉన్నారు.

కార్యోన్ముఖులుగా కార్యకర్తలు

నేడు బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడంలో భాగంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ప్రతినిధుల సభలు నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 27న బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో మంగళవారం నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే ప్రతినిధుల సభల్లో సుమారు 3 వేల నుంచి 3,500 మంది కార్యకర్తలు పాల్గొనే అవకాశం ఉంది. రాష్ట్రమంతా కలుపుకుని క్షేత్ర స్థాయిలో క్రియాశీలంగా పనిచేస్తున్న సుమారు నాలుగు లక్షల మంది కార్యకర్తలు, నేతలు ఈ సభల్లో భాగస్వాములు కానున్నారు. ఈ సభల్లో ఆరు తీర్మానాలు చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే దిశా నిర్దేశం చేశారు. సాగు, సంక్షేమం, పల్లె ప్రగతి– పట్టణ ప్రగతి, విద్య ఉపాధి, బీజేపీ వైఫల్యాలు, స్థానిక అంశాలపై ప్రతినిధులు తీర్మానాలు చేయనున్నారు.

నేటి నుంచి ఆర్టి'జనుల' సమ్మె

- పిలుపునిచ్చిన ఆర్టిజన్ల ప్రాతినిధ్య సంఘాలు
- సమ్మెతో తమకు సంబంధం లేదన్న ప్రధాన ఉద్యోగ సంఘాలు
- ఎస్మా ప్రయోగిస్తామని యాజమాన్యాల హెచ్చరిక
- విద్యుత్ సంస్థల్లో తీవ్ర ఉత్కంఠ పరిస్థితులు

సాక్షి, హైదరాబాద్: తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర విద్యుత్ సంస్థల్లోని 'ఆర్టిజన్లు' మంగళవారం ఉదయం 8 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతారని ఉద్యోగ సంఘాలు ప్రకటించాయి. 23 వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను గతంలో విద్యుత్ సంస్థలు ఆర్టిజన్ల పేరుతో విలీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్టిజన్ల సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలంగా పోరాడుతున్నా ఫలితం లేకపోవడంతో ఈనెల 25 నుంచి సమ్మెబాటపట్టాలని.. తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్82), ఇత్తెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్‌లు పిలుపునిచ్చాయి. కాగా, విద్యుత్ సంస్థల్లో సమ్మెలపై నిషేధం అమల్లో ఉందని, ఎవరైనా సమ్మెకు దిగినా, విధులకు గైర్హాజరైనా అత్యవసర సేవల నిర్వహణ చట్టం (ఎస్మా) ప్రయోగించి ఉద్యోగం నుంచి తొలగించాలని అధికారులకు విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఆదేశాలు జారీచేశాయి. దీంతో సమ్మెపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

స్టాండింగ్ ఆర్డర్స్ రద్దు చేయాలి..

రెగ్యులర్ విద్యుత్ ఉద్యోగులకు ఏపీ ఎలక్ట్రిసిటీ బోర్డు సర్వీస్ రూల్స్‌ను, ఆర్టిజన్ల కోసం 'స్టాండింగ్ ఆర్డర్స్' పేరుతో ప్రత్యేక సర్వీస్ రూల్స్‌ను అమలు చేస్తున్నారు. అయితే, తమకూ ఎలక్ట్రిసిటీ బోర్డు సర్వీస్ రూల్స్‌ను వర్తింపజేయాలని ఆర్టిజన్లు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, 7% ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ అమలు, ఇతర సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న విద్యుత్ ఉద్యోగ సంఘాల ఉభయ జేఏసీలతో సంస్థల యాజమాన్యాలు వేతన సవరణ ఒ ప్పందం కుదుర్చుకోగా, దీన్ని 'ఆర్టిజన్ల' సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. విద్యార్హతలు, నైపుణ్యం ఆధారంగా ఆర్టిజన్లను రెగ్యులర్ పోస్టులకు తీసుకుని పదోన్నతి కల్పించాలని, 50% ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలని, కనీసం రూ.25 వేలకు తగ్గకుండా మాస్టర్ స్కేల్‌ను ఖరారు చేయాలని ఈ సంఘాలు సమ్మె నోటీసుల్లో కోరాయి.

నిరంతర విద్యుత్ సరఫరాపై ప్రభావం !

నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగింపులో ఆర్టిజన్ల సేవలు కీలకం. ఎక్కడ చిన్న అంతరాయం కలిగినా రంగంలో దిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు. మరమ్మతులు, నిర్వహణ విభాగాల్లో వీరి సంఖ్యే అధికం. దీంతో ఆర్టిజన్లు పాక్షికంగా సమ్మెకి దిగి నా నిరంతర విద్యుత్ సరఫరాపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

సమ్మెలో పాల్గొంటే కఠిన చర్యలు

విద్యుత్ సంస్థల్లో ఎస్మా కింద సమ్మెలపై నిషేధం అమల్లో ఉన్నందున ఆర్టిజన్లు పిలుపునిచ్చిన సమ్మె పూర్తిగా చట్టవిరుద్ధమని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు స్పష్టం చేశారు. సమ్మెకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏప్రిల్ 15న అన్ని ఉద్యోగ సంఘాలతో పాటే ఆర్టిజన్లకు కూడా సహేతుకమైన వేతన సవరణ చేశామన్నారు. కాగా, ఆర్టిజన్ల సమ్మెతో తమకు సంబంధం లేదని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ, టీఈఈ 1104 యూనియన్, టీఎస్‌పీఈయూ–1535, బీఆర్‌వీకేఎస్, టీఎస్ఈఈయూ–327 యూనియన్లు ప్రకటించాయి.

యువతి గొంతు కోసిన ప్రేమోన్మాది

అడ్డుకున్న స్థానికులు.. ఆస్పత్రిలో చేరిక

అమీర్‌పేట/రహమత్‌నగర్: యువతిపై కత్తితో దాడి చేసాడో ప్రేమోన్మాది. తనను కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుంటోందని కక్షగట్టి గొంతు కోసాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసుల కథనం మేరకు బోరబండ బంజారానగర్‌లో సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా.. మహబూబ్‌నగర్ జిల్లా తుర్కపల్లికి చెందిన సిద్దప్ప కుమార్తె లక్ష్మి గత కొంత కాలం క్రితం నగరానికి వచ్చి బోరబండ సైట్–1లో ఉంటోంది. స్థానిక స్వరాజ్‌నగర్‌కు చెందిన కిషోర్‌తో పరిచయమైంది. అతను మోతీనగర్‌లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపగా లక్ష్మి చాలా కాలం అక్కడే పనిచేసింది. ఇద్దరి మధ్య మనస్పర్ధలు రావడంతో అక్కడ పని మానివేసింది. కిషోర్ కూడా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఎత్తివేశాడు. ఆ తర్వాత అతను పలు మార్లు మాట్లాడేందుకు ప్రయత్నించినా నిరాకరించింది. కాగా, ఇటీవల వేరే వ్యక్తితో లక్ష్మికి నిశ్చితార్థం జరిగినట్లు కిషోర్‌కు తెలిసింది. వేరే వ్యక్తిని పెళ్లి చేసుకోవడాన్ని కిషోర్ జీర్ణించుకోలేక ఎలాగైనా ఆమెను మట్టు పెట్టాలనే నిర్ణయానికి వచ్చాడు. ఈ క్రమంలో హౌస్ కీపింగ్ పని చేస్తున్న లక్ష్మి సోమవారం పని ముగించుకుని సాయంత్రం 4.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా బంజారానగర్‌లో ఆమెను అడ్డగించాడు. కళ్లల్లో కారం చల్లి ఫాస్టు ఫుడ్ సెంటర్‌లో ఉల్లి గడ్డలు కోసే కత్తితో గొంతు కోశాడు. స్థానికులు వారించగా కత్తి చూపి బెదిరించాడు. అందరూ చూస్తుండగానే గొంతుపై రెండు, చేతులపై రెండు పోట్లు పొడిచాడు. అంతలోనే స్థానికులు పట్టుకున్నారు. తీవ్ర గాయాలైన యువతిని ప్రయివేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆమె తలకు హెల్మెట్ ఉండటంతో తలపై తీవ్రగాయాలు కాకుండా తప్పించుకోగలిగినప్పటికీ ప్రస్తుత పరిస్థితి ఒకింత ఆందోళనకరంగానే ఉందని పోలీసులు తెలిపారు.


నిందితుడు కిషోర్

ఆర్అండ్‌బీ పునర్విభజన

- తుది దశకు ప్రక్రియ
- ఆదిలాబాద్ సర్కిల్ విభజన
- కొత్తగా మంచిర్యాల సర్కిల్ ఏర్పాటు
- ఉట్నూర్ సబ్ డివిజన్ ఎత్తివేసే అవకాశం
- త్వరలో రానున్న స్పష్టత

సాక్షి, ఆదిలాబాద్: రోడ్లు, భవనాల శాఖలో పునర్విభజన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. త్వరలోనే స్పష్టత రానుంది. గతేడాది నుంచి మొదలైన ప్రక్రియ కార్యరూపం దాల్చేందుకు సిద్ధమవుతుంది. అవిభాజ్య ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్ సర్కిల్‌గా నాలుగు డివిజన్‌లు, 9 సబ్ డివిజన్‌లతో కొనసాగుతుంది. జిల్లాల విభజన తర్వాత కూడా ఇదే విధంగా కొనసాగుతూ వస్తుంది. కొత్త జిల్లాల ఏర్పాటు తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని ఈ శాఖలో పునర్విభజన చేపట్టాలని గతేడాది సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు తాజాగా కొత్తగా పోస్టులు మంజూరుతో ఇక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇదిలా ఉంటే మే మొదటి వారంలో కొత్త ఆఫీసులు ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.


ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయం

కొత్తగా మంచిర్యాల సర్కిల్..

ప్రస్తుతం ఆదిలాబాద్ సర్కిల్ కేంద్రంగా ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ డివిజన్‌లుగా ఉంది. ఆదిలాబాద్, బోథ్, ఉట్నూర్, నిర్మల్, ఖానాపూర్, భైంసా, మంచిర్యాల, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ సబ్ డివిజన్లుగా కొనసాగుతున్నాయి. ఈ సర్కిల్‌ను విభజించి కొత్తగా మంచిర్యాల సర్కిల్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం జరిగింది. ఉత్తర్వులు వెలబడటమే తరువాయి. రాష్ట్రంలో పలు కొత్త సర్కిళ్లు ఏర్పాటు చేస్తుండగా, అందులో మంచిర్యాల ఒకటి. తద్వారా ఈ సర్కిల్ పరిధిలో సూపరింటెండింగ్ ఇంజినీర్ పోస్టు ఏర్పడనుంది.

ఉద్దేశం ఇది..

గతేడాది హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ ఆర్అండ్‌బీ అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పునర్విభజన ఉద్దేశాలను వెల్లడించారు. ప్రధానంగా శాఖ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. బాధ్యతల పునర్విభజన, వానలు, వరదలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, నిర్వహణ, మరమ్మతులు, ఇతర పనులపై సత్వర నిర్ణయం, వెంటనే పనులు చేపట్టే దిశగా కింది స్థాయి ఇంజినీర్లకు నిధుల కేటాయింపు వంటి వ్యూహాలను అవలంభించాలని చెప్పారు. ఇంజినీర్లు ఎక్కడికక్కడే రోడ్లను విభజించుకొని పని విభజన చేసుకోవాలని ఈ పునర్విభజన ఉద్దేశాన్ని అప్పట్లో వెల్లడించారు.


సబ్ డివిజన్ల మార్పులు చేర్పులు..

సబ్ డివిజన్ల మార్పులు చేర్పులపై ఆర్అండ్‌బీ శాఖలో చర్చ సాగుతుంది. అయితే ఉత్తర్వులు వచ్చిన తర్వాతే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంటుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

- ప్రధానంగా ప్రస్తుతం మంచిర్యాల డివిజన్‌లో ఒక మంచిర్యాల సబ్ డివిజన్ మాత్రమే ఉంది. ఆసిఫాబాద్ డివిజన్‌లో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లు ఉన్నాయి. మంచిర్యాల సర్కిల్‌తో పాటు ఇక్కడ మరో రెండు సబ్ డివిజన్‌లు ఏర్పాటయ్యే అవకాశం ఉందంటున్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఈ సబ్ డివిజన్ ఉండే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు.
- ఇక ఖానాపూర్ నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం ఖానాపూర్ సబ్ డివిజన్‌తో పాటు ఉట్నూర్ సబ్ డివిజన్ ఉంది. ఒకే నియోజకవర్గంలో రెండు సబ్ డివిజన్లు ఉన్న దృష్ట్యా ఉట్నూర్ తొలగించనున్నారని చెబుతున్నారు.
- ఈ పునర్విభజనలో ఆదిలాబాద్, మంచిర్యాల సర్కిళ్లలో 5 చొప్పున సబ్ డివిజన్లు ఉండే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.
- ఇదిలా ఉంటే ఆదిలాబాద్ కేంద్రంగా భవనాల నిర్మాణాలకు సంబంధించి ఒక సబ్‌డివిజన్ ఏర్పాటయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అంతే కాకుండా కొత్త సెక్షన్లు ఏవైనా ఏర్పాటుపై కూడా నిర్ణయం జరిగే అవకాశం ఉంది. ఈ విషయంలో ఆర్అండ్‌బీ ఆదిలాబాద్ ఎస్ఈ రాజేందర్ నాయక్‌ను వివరణ కోరగా.. పైనుంచి ఉత్తర్వులు వస్తేనే ఏదైనా స్పష్టత ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు.

గతి తప్పిన 'ప్రగతి' కార్డులు

- తప్పుల తడకగా ప్రోగ్రెస్ కార్డులు
- ఏ–1 వచ్చిన వారికి సైతం ఈ–గ్రేడుగా ముద్రణ
- విద్యార్థుల్లో నిరుత్సాహం
- సాఫ్ట్‌వేర్‌లో లోపాలే కారణమని ఉపాధ్యాయుల ఆరోపణ
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పరిస్థితి



F.A - IV			S.A - II (100M)		
Marks	Grade	Grade Points	Marks	Grade	Grade Points
34.00	B+	4	43.00	C	0
40.00	A	6	40.00	C	0
34.00	B+	4	27.00	B+	4
43.00	A	6	30.00	B+	4

జగిత్యాలలో తప్పులు వచ్చిన ప్రోగ్రెస్ కార్డు

జిలా	స్కూళ్లు	విద్యార్థులు
సిరిసిల్ల	510	47,654
జగిత్యాల	783	53,382
పెద్దపల్లి	591	43,242
కరీంనగర్	652	54,257

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అవసరమైతే.. తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థికి ఒక మార్కు కలిపి పాస్ చేయాలని చూస్తారే తప్ప.. ఏ టీచరూ ఫెయిల్ చేయాలని చూడరు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మాత్రం మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు వారి ప్రోగ్రెస్ కార్డులపై తక్కువ గ్రేడులు ముద్రించి రావడంతో నిరాశ చెందుతున్నారు. 90 శాతం మార్కులు తెచ్చుకున్న వారికి ఏ–ప్లస్ లేదా ఏ–గ్రేడు వస్తాయి. కానీ, విచిత్రంగా మార్కుల స్థానంలో అంతా సవ్యంగానే ఉన్నా.. గ్రేడుల వద్ద మాత్రం ఈ–గ్రేడు ముద్రితమైంది. ఇది చూసిన విద్యార్థులు వెంటనే వెళ్లి తమ క్లాస్ టీచర్లకు ఫిర్యాదు చేశారు. వాస్తవానికి ప్రోగ్రెస్ కార్డులను చూసుకునే సమయంలోనే ఉపాధ్యాయులు ఈ తప్పులను గుర్తించారు. తుది కార్డులు కావడంతో మార్పులు చేయడం సాధ్యం కాక వాటిని అలాగే విద్యార్థులకు అందజేశారు.

ఏం జరిగింది?

విద్యార్థులకు ఏడాదిలో నాలుగు ఎఫ్ఏ (ఫార్మాటివ్ అసెస్‌మెంట్), రెండు ఎస్ఏ (సమ్మేటివ్ అసెస్‌మెంట్స్) నిర్వహిస్తారు. ఫార్మాటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు 20 మార్కుల చొప్పున ఏడాదిలో మొత్తం నాలుగుసార్లు నిర్వహిస్తారు. వీటిని సగటు తీసి, చివరి పరీక్షలో కలుపుతారు. 80 మార్కులకు నిర్వహించే సమ్మేటివ్ పరీక్షలకు జోడించి మొత్తం మార్కులకు గ్రేడులు నిర్ణయిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం సజావుగానే సాగింది. వీటిని ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఇక్కడే పొరపాటు జరిగి ఉంటుందని భావిస్తున్నారు. https://cce.telangana.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. తర్వాత ఫైనల్ ప్రోగ్రెస్ కార్డులను ప్రింట్ తీసి, విద్యార్థులకు ఇవ్వాలి. సోమవారం ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లోని పలు పాఠశాలల్లో పలు వురు విద్యార్థులు తమకు తక్కువ గ్రేడ్లు రావడం చూసి, అవాక్కయ్యారు. టీచర్ల దృష్టికి తీసుకెళ్తే ప్రింటింగ్ మిస్టేక్ అని సర్దిచెప్పి, పంపారు.

సాఫ్ట్‌వేర్‌లో లోపాలున్నాయా?

వెబ్‌సైట్‌లోని సాఫ్ట్‌వేర్‌లో లోపాలు ఉన్నాయని పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు మార్కులు అప్‌లోడ్ చేసే సమయంలో జాగరూకతతో వ్యవహరించకపోవడం కూడా కారణమై ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. పలు జిల్లాల్లోనూ ఇదే సమస్య రావడం ఇందుకు నిదర్శమన్నారు. కొందరు సిబ్బందికి ఆన్‌లైన్, కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడమూ ఓ కారణమై ఉండొచ్చని పలువురు టీచర్లు తెలిపారు. తుది ప్రోగ్రెస్ కార్డులో ఇలా తప్పులు రావడంతో విద్యార్థులతోపాటు తామూ నిరుత్సాహానికి గురయ్యామని అన్నారు.

జగిత్యాలలో ఇలా..

జగిత్యాల జిల్లాలోని ఓ ప్రైమరీ స్కూల్ విద్యార్థికి 43 మార్కులు వచ్చాయి. వీటికి ఆ చిన్నారికి సీ–2 గ్రేడు రావాలి. కానీ, సీ అని వచ్చింది. మరో సబ్జెక్టులో 40 మార్కులు వచ్చాయి. అంటే డీ' గ్రేడు ఇవ్వాలి. కానీ, 'సీ' ఇచ్చారు. ఈ ప్రోగ్రెస్ కార్డు పోస్టు ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి తప్పులకు కొదవలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. మార్కులతో సంబంధం లేని గ్రేడులు చూసి, విస్తుపోవడం విద్యార్థుల వంతవుతోంది.

ముఖరా(కె)ను ఆదర్శంగా తీసుకోవాలి

- ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి

ఇచ్చోడ: ముఖరా(కె) పంచాయతీని ప్రతీ సర్పంచ్ ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా హైదారాబాద్‌లోని రాజేందర్‌నగర్‌లో అవార్డు గ్రహీత సర్పంచులను సోమవారం సన్మానించి మాట్లాడారు. ముఖరా(కె)లో ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరు అభినందనీయమని కొనియాడారు. గ్రామంలో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేస్తూ పంచాయతీకి ఆదాయం తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. సర్పంచ్ కృషికి ప్రత్యేకంగా అభినందించారు.


అవార్డు గ్రహీత సర్పంచులతో సీఎస్ శాంతికుమారి

సంస్థపై దుష్ప్రచారం మానుకోవాలి

- సింగరేణి డైరెక్టర్(పా) బలరాం


మాట్లాడుతున్న డైరెక్టర్(పా) బలరాం

గోదావరిఖని: సింగరేణి నష్టాల్లో ఉందని, అప్పుల పాలైందనే తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని డైరెక్టర్(పా) బలరాం స్పష్టం చేశారు. సోమవారం ఆర్జీ–2 ఏరియాలో సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. సంస్థ వరుస లాభాల్లో ముందుకుసాగుతూ రూ. వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకుందన్నారు. సంస్థకు మంచిపేరు, ప్రఖ్యాతులు ఉన్నాయని, తప్పుడు ప్రచారం సంస్థను కుంగదీసేలా ఉంటుందన్నారు. సింగరేణి ఉద్యోగుల సంక్షేమం కోసం రాజీలేకుండా ముందుకు సాగుతున్నామన్నారు. అన్ని సంఘాలు కలిసి నడిస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బొక్కల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్జీ–2 జీఎం మనోహర్, రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అంథోని నాగేశ్వరరావు, అధ్యక్షుడు ఇ.రాజేశ్వరరావు, ఎస్సీ లైజనింగ్ అధికారి జి.రాజేంద్రప్రసాద్, కేంద్ర కమిటీ సభ్యులు కనుకుల తిరుపతి, సురేందర్, ఇరుగురాల శ్రీనివాస్, ఏరియా రక్షణ అధికారి బి.రవీందర్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ.రమణ, సంక్షేమాధికారి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్రంపై సచిన్ దంపతుల చిత్రం

- వెండి, పట్టు పోగులతో నేసిన వైనం
- సిరిసిల్ల నేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ ఆవిష్కరణ

సిరిసిల్ల: సిరిసిల్ల నేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ వస్త్రంపై మరో చిత్రాన్ని ఆవిష్కరించారు. భారత మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ దంపతుల చిత్రాన్ని వెండి, పట్టుపోగులతో నేశాడు. సచిన్ మిత్రుడు హైదరాబాద్‌కు చెందిన మాజీ క్రికెటర్ చాముండేశ్వరీనాథ్ ఈ చిత్రాన్ని ఆర్డర్ ఇచ్చి మరీ నేపించారు. సచిన్ టెండూల్కర్ జన్మదినోత్సవం సందర్భంగా గోవాలో సోమవారం ఈ వస్త్రాన్ని అందించారు. బట్టపై ఈ చిత్రాన్ని నేయడానికి 20 రోజుల సమయం తీసుకుందని హరిప్రసాద్ తెలిపారు. 47 ఇంచుల వెడల్పు, 60 ఇంచుల పొడవుతో 290 గ్రాముల బరువుతో వస్త్రంపై చిత్రాన్ని ఆవిష్కరించారు. ఇందులో 170 గ్రాముల వెండి పోగులు, పట్టు దారంతో ఈ వస్త్రాన్ని నేయించారు. సచిన్ దంపతుల ముఖ కవళికలు చెదిరిపోకుండా.. వస్త్రంపై చిత్రాన్ని ఆవిష్కరించిన నేత కళాకారుడు హరిప్రసాద్‌ను చాముండేశ్వరీనాథ్ అభినందించారు. గతంలో భారత ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్‌లో హరిప్రసాద్ నేత కళను, ఆయన ప్రతిభను ప్రశంసించారు. తాజాగా సచిన్ దంపతుల చిత్రాన్ని వెండి, పట్టుపోగులతో ఆవిష్కరించడం విశేషం.


బట్టపై చిత్రంతో హరిప్రసాద్, చాముండేశ్వరినాథ్

విశ్రాంత జీవితమూ విలువైనదే!



ఆమె రోజుకు ఆరు గంటలు పని చేస్తారు.
ఇందులో ప్రత్యేకత ఏముంటుంది? నిజమే.
ఆమె వయసు డెబ్బయ్. ఇదీ ఆమె ప్రత్యేకత.
తన కోసమే కాదు... సమాజానికి పనిచేస్తారు.
'సృజనాత్మకత మెదడును చురుగ్గా ఉంచుతుంది.
ఇష్టమైన పని దేహాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
ప్రతిరోజూ విలువైనదే... సద్వినియోగం చేసుకోవాలి'
అంటున్న విజయాగుప్తా పరిచయం.

ఇది స్క్రీన్ ఎరా. టీవీ స్క్రీన్, కంప్యూటర్, ల్యాప్ టాప్ లేదా స్మార్ట్ ఫోన్. ఇరవై నాలుగ్గంటల్లో పద్నాలుగు గంటలు స్క్రీన్‌తోనే గడిపేస్తున్నారు. స్క్రీన్ మీద పని చేయాల్సిన ఉద్యోగులకు తప్పదు. మరి ఖాళీగా ఉంటూ సమయం ఎలా గడపాలో తెలియక స్క్రీన్‌కి అంకితమయ్యే వాళ్లు మాత్రం తప్పనిసరిగా తమ ఇరవై నాలుగ్గంటలనూ ఒకసారి విశ్లేషించుకోవాలని చెబుతున్నారు హైదరాబాద్, హిమాయత్ నగర్‌కు చెందిన విజయాగుప్తా కోత్రికె. తనకిష్టమైన వ్యాపకం కోసం ఇంట్లో ఒక గదిని వర్క్ స్టేషన్‌గా మార్చుకున్నారామె. ఎనిమిదేళ్ల వయసులో గ్రీటింగ్ కార్డు తయారు చేసిన సృజనాత్మకమైన ఆమె విజయ ప్రస్థానం ఇది.

జీవితం ఇచ్చిన గిఫ్ట్

"మా నాన్న ఉద్యోగ రీత్యా నేను పుట్టినప్పుడు చెన్నైలో ఉన్నాం. ఆ తర్వాత హైదరాబాద్‌కి బదిలీ. ముగ్గురు అక్కలు, ముగ్గురు అన్నలతో మొత్తం ఏడుగురం. ఇంట్లో ఎవరూ ఒక్క క్షణం కూడా ఖాళీగా ఉండేవారు కాదు. పెళ్లి పత్రికల వెనుక ఖాళీ పేజీ మీద బొమ్మలు గీసి, పత్రిక మీద ఉండే కొన్ని బొమ్మలను కత్తిరించి అతికించి సొంతంగా గ్రీటింగ్ కార్డు తయారు చేశాను. పెళ్లి తర్వాత కుటుంబ బాధ్యతలతో విరామం వచ్చింది. పిల్లలు పెద్దయ్యి, నాక్కొంత విరామం వచ్చేటప్పటికి యాభై ఏళ్లు నిండాయి. అప్పుడు అనుకోకుండా ఒక వరలక్ష్మీవ్రతంలో వాళ్లిచ్చిన రిటర్న్ గిఫ్టులు చూసినప్పుడు నాలోని సృజనాత్మక కోణం నిద్రలేచింది. ఆ సందర్భం... జీవితం నాకిచ్చిన గిఫ్ట్ అనే చెప్పాలి. ఇక అప్పటి నుంచి రకరకాల ప్రయోగాలు చేయడం మొదలు పెట్టాను. ఇప్పుడు రెండు వందలకు పైగా క్రియేటివ్ పీస్‌లను తయారు చేస్తున్నాను. నాకు ఎగ్జిబిషన్‌లకు వెళ్లడం అలవాటు. కొన్నా కొనక పోయినా సరే... ఎగ్జిబిషన్‌లకు వెళ్లేదాన్ని. ఏ ప్రాంతం ఏ హస్తకళలకు ప్రసిద్ధి అనేది అవగతమైంది. అలా ఉదయ్‌పూర్‌కెళ్లి అక్కడి కళాకారుల పనితీరును తెలుసుకున్నాను. నేను బీఏ హిందీ లిటరేచర్ స్టూడెంట్‌ని కావడంతో భాష సమస్య రాలేదు. మావారి సలహాతో నేను చేస్తున్న పనిని రిజిస్టర్ చేశాను. నాకు వచ్చిన ఆర్డర్‌లకు పని చేసివ్వడంతోపాటు పని నేర్చుకుంటామని వచ్చే మహిళలకు ఉచితంగా నేర్పిస్తున్నాను.



ఇదీ రొటీన్!

ఉదయం ఆరు గంటలకు నిద్ర లేచిన తర్వాత రెండు గ్లాసుల వేడి నీటిని తాగుతాను. అరగంట వాకింగ్, మరో అరగంట డాక్టర్ సూచించిన ఎక్సర్‌సైజ్‌లు. ఎనిమిదింటికి కాఫీ లేదా టీ, ఓ గంట సేపు ఫోన్‌లో మెసేజ్‌లు చెక్ చేసుకుని నా క్లయింట్‌ల నుంచి ఆర్డర్‌లు, ఇతర సందేహాలకు రిప్లయ్ ఇస్తాను. పదిగంటలకు వంట, పూజ పూర్తి చేసి బ్రేక్‌ఫాస్ట్ చేస్తాను. రెండు గంటలు విశ్రాంతి. మధ్యాహ్న భోజనం తర్వాత మా వారు బయటకు వెళ్లినప్పటి నుంచి నా గదిలో పని మొదలు పెడితే ఏడు గంటల వరకు కొనసాగుతుంది. రాత్రి ఎనిమిదిన్నరకు భోజనం. కొద్దిసేపు టీవీలో వార్తా విశేషాలు, గేమ్ షోలు కొద్దిసేపు టీవీ చూడడం పది గంటలకు నిద్ర. వారంలో మూడు రోజులు మా వాసవీ మహిళా సంఘం కార్యకలాపాలతో ఎప్పుడూ ఏదో ఒక వ్యాపకంలో ఉంటాను. హడావుడిగా పరుగులు ఉండవు, కానీ పనిలో ఉంటాను. మా అబ్బాయి, అమ్మాయి కూడా హైదరాబాద్‌లోనే ఉంటారు. వాళ్లు మా ఇంటికి వచ్చే ముందు 'రేపు నీ పనులేంటమ్మా? మేము ఎప్పుడు రావచ్చు' అని అడుగుతారు. పిల్లలు వాళ్ల ఉద్యోగాలు, వ్యాపారాల్లో, వాళ్ల పిల్లల చదువులతో బిజీగా ఉంటారు. పిల్లలు మన కోసం టైమ్ ఎప్పుడిస్తారా అని ఎదురు చూస్తూ ఉంటే ఈ వయసులో తరచూ నిరాశ ఎదురవుతుంటుంది. అందుకే నా టైమ్‌ని సహాయం అవసరమైన బాలికల చదువు, ఉపాధి కల్పనలో నిమగ్నం చేసుకుంటాను. లాభనష్టాల్లేకుండా నడిచే బాలికల హాస్టల్ నిర్వహణ, మహిళా సంఘం కార్యకలాపాలు సంయుక్తంగా చూసుకుంటాం. సహాయం అవసరమై వచ్చిన వాళ్లకు హాస్టల్‌లో వసతి ఇచ్చి, మహిళా సంఘం తరఫున స్కిల్ డెవలప్‌మెంట్, వొకేషనల్ కోర్సుల్లో శిక్షణ ఇస్తాం. ఉడాన్ సర్వీస్ ఆర్గనైజేషన్ లోనూ మెంబర్‌ని. దేశరక్షణలో ప్రాణాలు వదిలిన సైనికుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం పూర్తిగా అందనప్పుడు మా సంస్థ నుంచి వాళ్ల పిల్లల చదువు కోసం స్కూల్ ఫీజులు చెల్లిస్తాం.



ఇదే మంచి సమయం!

నా వయసు మహిళలకు నేను చెప్పగలిగిందొక్కటే... విశ్రాంత జీవితం శాపం కాదు, ఇది ఒక వరం. పిల్లలు మన మీద దృష్టి పెట్టి ప్రత్యేకంగా చూసుకోవాలని కోరుకోకూడదు. ఎవరికి వాళ్లు తమకంటూ ఒక వ్యాపకాన్ని వృద్ధి చేసుకోవాలి. పుస్తకాలు చదవడం కావచ్చు, పూజలు, సత్సంగాలు, ఆలయాల సందర్శనం... ఏదైనా కావచ్చు. మనిషికి సోషల్ లైఫ్ ఉండాలి. ఇంటినుంచి బయటకు వస్తే పరిచయాలు పెరుగుతాయి. భావ సారూప్యం కలిగిన వాళ్లతో స్నేహం ఏర్పడుతుంది. అప్పుడు జీవితంలో ప్రతిరోజూ సంతోషకరంగానే గడుస్తుంది" అన్నారు విజయా గుప్తా కోత్రికె.

– వాకా మంజులారెడ్డి

ఫొటోలు : నోముల రాజేశ్ రెడ్డి

సక్సెస్ స్టోరీ

విజయాన్ని పెట్టెలో పెట్టింది

పిండి కొద్ది రొట్టె ఏమోకాని స్వీటు కొద్ది పెట్టె ఉండాలంటుంది సంగీతా పాండే. స్వీట్ బాక్సులను అందంగా తయారు చేయడం మొదలుపెట్టిన ఈ గోరఖ్‌పూర్ సాధారణ గృహిణి 500 రూపాయల పెట్టుబడితో బయల్దేరి ఆరేళ్లలో 3 కోట్ల టర్నోవర్‌కు చేరింది. అత్తామామలు, భర్త సహకరించకపోయినా గృహిణికి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని పట్టుదలగా విజయం సాధించింది. తనలాంటి 100 మంది స్త్రీలకు ఉపాధి కల్పించడంతో ఆమె పొందుతున్న సంతృప్తి వెల లేనిది.





● స్ఫూర్తి ప్రసంగం చేస్తూ



● సాటి మహిళలకు ఉపాధి కల్పిస్తూ...

ఆరేడేళ్ల క్రితం. ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్. మూడవ సంతానంగా కుమార్తె పుట్టాక 9 నెలలు నిండేసరికి ఇక ఇంట్లో ఉంటూ కేవలం అత్తామామల సేవ, వంట వంటి పనులు మాత్రమే చేయకూడదు అనుకుంది సంగీతా పాండే. భర్తకు పోలీసు ఉద్యోగం. బదిలీల మీద తిరుగుతుండేవాడు. ఆర్థికస్థితి అంతంత మాత్రం. తనూ ఉద్యోగం చేయాలని నిశ్చయించుకుంది. భర్త ఒప్పుకోలేదు. అత్తామామలు ఒప్పుకోలేదు. కాని ఎదిరించి తను చదివిన డిగ్రీ అర్హత మీద ఒక ఆఫీసులో చిన్న ఉద్యోగం తెచ్చుకుంది. మొదటిరోజు కూతురితోపాటు హాజరైంది. ఆఫీసువాళ్లు అభ్యంతరం చెప్పడంతో మరుసటి రోజు పాపను ఇంట్లో వదిలి ఆఫీసుకు వెళ్లింది. మనసు ఒప్పలేదు. పిల్లలను దూరం పెట్టి పని చేసే ఉద్యోగం వద్దు అనుకుని మరుసటి రోజే మానేసింది. కాని ఏదో చేయాలి. ఏం చేయాలి?

స్వీట్‌షాపులో డబ్బాలు

ఆమె ఒకసారి స్వీట్‌షాపులో స్వీట్స్ కొంటున్నప్పుడు ఎవరో వచ్చి ఖాళీ బాక్సులు స్టాకు పడేసి వెళ్లడం చూసింది. తనక్కూడా అలాంటివి తయారు చేసి అమ్మాలని అనిపించింది. అందుకోసం గోరఖ్‌పూర్‌లో వాటిని తయారు చేస్తున్న ఒకరిద్దరు స్త్రీలను కలిసింది. అయితే వారు ఆమెకు పని గురించి అంతంత మాత్రమే చెప్పారు– పోటీకి వస్తుందని.

సంగీతా పాండేకి సృజన ఉంది. కొత్తగా చేసే ఆలోచన ఉంది. అందుకే తానే రంగంలో దిగింది. అప్పటికి తన దగ్గర 1500 ఉన్నాయి. ఓ పాత సైకిలుంది. ఆ సైకిల్ మీద తిరుగుతూ రా మెటీరియల్ కొని తెచ్చింది. 8 గంటల్లో 100 డబ్బాలు తయారు చేసింది. తనే వాటిని సైకిల్ వెనుక కట్టుకుని స్వీట్ షాపులకు అమ్మేందుకు బయలుదేరింది. అవి బాగుండటంతో అమ్ముడుపోయాయి కాని ఇంతకంటే తక్కువకు సరుకు వేస్తున్నారని తెలిసింది.





అసలు కిటుకు

రా మెటీరియల్ లక్నో, ఢిల్లీలలో తక్కువకు దొరుకుతుందని, వాటితో కళాత్మకంగా డబ్బాలు తయారు చేసి తక్కువకు ఇవ్వగలిగితే చాలా గిరాకీ ఉంటుందని తెలుసుకుంది సంగీతా పాండే. వెంటనే చురుగ్గా ఉండే నలుగురైదుగురు స్త్రీలను పనిలోకి తీసుకుంది. డిస్ట్రిక్ట్ అర్బన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ నుంచి 2 లక్షలు లోన్ సాధించింది. పనిలోకి దిగింది. కిలో, అరకిలో, పావుకిలో డబ్బాలు మంచి రంగులతో లోపల జలతారు వస్త్రంతో తయారు చేసి గోరఖ్‌పూర్, లక్నోలలో స్టాకు వేయడం మొదలెట్టింది. 'నాణ్యత విషయంలో ఒక పైసా నష్టం వచ్చినా రాజీ పడకూడదు అనే నియమం పెట్టుకున్నాను' అంటుంది సంగీతా పాండే. ఆ నాణ్యత, ముస్తాబు వల్ల ఆమె ఖాళీ బాక్సులకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ఇప్పుడు ఆమె నగలు కుదువ పెట్టి మరో 3 లక్షలు తీసుకుని వ్యాపారాన్ని విస్తరించింది. ఆ తర్వాత బ్యాంకులే వెతుక్కుంటూ వచ్చి 30 లక్షలు లోను మంజూరు చేశాయి. ఒక ఫ్యాక్టరీ ఆవరణ, పని చేసే స్త్రీలు, వీరు కాకుండా ఇళ్ల దగ్గర ఉంటూ పనిచేసే స్త్రీలు వీరంతా ఒక వ్యవస్థగా ఏర్పడ్డారు. సంగీతా పాండే దూసుకుపోయింది.

గోరఖ్‌పూర్ రత్న

ఇటీవలే ఉత్తరప్రదేశ్ సి.ఎం ఆదిత్యానాథ్ మహిళా అంత్రప్రెన్యూర్‌గా ఎంతో స్ఫూర్తినిస్తున్న సంగీతా పాండేని 'గోరఖ్‌పూర్ రత్న' బిరుదుతో సత్కరించాడు. ఇప్పుడు సంగీతా పాండే తయారు చేస్తున్న స్వీట్ బాక్సులు ఢిల్లీ వరకూ వెళుతున్నాయి. స్వీట్లను ఒకదాని మీద ఒకటి కుక్కే విధంగా కాకుండా సంగీతా స్వీట్‌బాక్సులు ఒకదాని పక్కన ఒకటి అంటకుండా అమర్చేలా ఉండటంతో ఆదరణ పొందుతున్నాయి. సంప్రదాయం కోసం కొద్ది స్వీట్లతో ఒక బుట్టను ప్రెజెంట్ చేసేలా కూడా పెట్టెలు తయారు చేస్తోంది. స్వీట్లలోని రకాలను బట్టి ఈ ప్యాకింగ్ బాక్సులు మారిపోతుంటాయి.

సృజన, శ్రమ కలిస్తే సక్సెస్ అదే వస్తుందనడానికి మరో ఉదాహరణ సంగీతా పాండే.

సాగుబడి

భరణి కార్డ్: ఏప్రిల్ 28 నుంచి

తోట.. ఇక నిండు కుండే!

- మట్టిలో పెట్టిన కుండల ద్వారా నేరుగా వేరు వ్యవస్థకు నీటి తేమ సరఫరా
- కూరగాయలతో పాటు పండ్ల తోటల్లోనూ కుండతో సేద్యం చేస్తున్న తమిళనాడు రైతులు
- మొక్కలు/చెట్ల మధ్య 10 లీటర్ల మట్టి కుండను పాతి పెట్టి.. అప్పుడప్పుడు నీరు నింపితే చాలు..
- మెట్ట ప్రాంత చిన్న, సన్నకారు రైతులతో పాటు పెరటి తోటల సాగుదారులకూ ఉపయోగకరం



● అడుగు దూరంలో కూరగాయ మొక్కలు నాటుకోవాలి





● కుండను ఇలా పాతిపెట్టి నీరు పోశాక మూత పెట్టాలి

పెరుగుతున్న జనాభాకు తోడు నీటి కొరత వ్యవసాయానికి పెద్ద సవాలుగా మారింది. స్ప్రింక్లర్, డ్రిప్ వంటి అధిక ఖర్చుతో కూడిన ఆధునిక నీటిపారుదల సదుపాయాలు ఉన్నప్పటికీ.. గ్రామీణ చిన్న, సన్నకారు రైతులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో నీటి నిర్వహణ ఒకటి. కుండ సేద్యం ద్వారా తక్కువ ఖర్చుతో, కొద్ది నీటితోనే ఎక్కువ ఫలితం పొందడానికి వీలుంది. బక్కెట్లతో/స్ప్రింక్లర్లతో అందించే నీటితో పోల్చితే కుండ సేద్యంలో 70% నీరు ఆదా అవుతుందని నిపుణులు లెక్కగట్టారు.

మట్టి కుండలను నేలలో పాతి పెట్టడం ద్వారా ఉద్యాన పంటలకు నీటిని తగు మాత్రంగా, నిరంతరాయంగా నీరు అందించటం పురాతన పద్ధతి. నీరు వృథా కాకుండా నేరుగా వేరు వ్యవస్థకు నీరందించే సులభమైన కుండ సేద్యాన్ని ఇప్పటికీ రైతులు ఆచరిస్తున్నారు. తమిళనాడులో మెట్ట ప్రాంత చిన్న రైతులు ఈ పద్ధతిలో టమాటో, వంగ, బెండ వంటి కూరగాయ పంటలతో పాటు కొబ్బరి, జామ వంటి తోటలను సైతం సాగు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. సమతలంగా ఉండే పొలాల్లోనే కాదు.. తేమ త్వరగా ఆరిపోయే ఎర్ర నేలలు, ఏటవాలు భూముల్లో కూడా పంటల సాగుకు కుండ సేద్య పద్ధతిని ఉపయోగిస్తున్నారు. యాక్సెస్ అగ్రికల్చర్ (www.accessagriculture.org) స్వచ్ఛంద సంస్థ ఈ రైతుల అనుభవాలను రికార్డు చేసి వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది.



● ముదురు కొబ్బరి చెట్లకూ కుండ సేద్యం



● కుండలకు బదులు ప్లాస్టిక్ బాటిళ్ల నూ వాడొచ్చు..

2 కుండల మధ్య దూరం 32 అంగుళాలు

గుండ్రటి మట్టి కుండలను పంట మొక్కలకు దగ్గరగా మట్టిలో కుతిక వరకు పాతిపెట్టి నీటితో నింపుతారు. కుండకు ఉండే సూక్ష్మ రంధ్రాల ద్వారా నీటి తేమ కుండ చుట్టుపక్కల ఉన్న మట్టి ద్వారా మొక్కల వేర్లకు అవసరమైన మేరకు సజావుగా అందుతుంది. కలుపు సమస్య తగ్గుతుంది. సుమారు 10 లీటర్లు పట్టే గుండ్రటి కుండలను ఎంపిక చేసుకోవాలి. మట్టితో తయారు చేసి కాల్చిన కుండలను వాడాలి. ఒక సెంటీ మీటర్ మందంతో తయారైన కుండా వాడాలి. చెట్లు, మొక్కల దగ్గర్లో కుండ కంటే పెద్ద గుంత తవ్వాలి. తవ్విన మట్టికి.. అంతకు రెట్టింపు మొత్తంలో బాగా చివికిన పశువుల ఎరువును కలపాలి. ఈ మిశ్రమంలో కొంత భాగాన్ని గుంతలో అడుగున వేయండి. గుంత మధ్యలో కుండను జాగ్రత్తగా పెట్టాలి. మిగిలిన ఎరువు కలిపిన మట్టి మిశ్రమాన్ని కుండ చుట్టూ వేసి ఖాళీని నింపాలి. కుండ అంచు నేల పైకి కనపడేలా ఏర్పాటు చేసుకోవాలి. 10 లీటర్లు నీరు పట్టే ప్రతి కుండ తన చుట్టూతా 40 సెంటీమీటర్ల (16 అంగుళాలు) వరకు ఉన్న మట్టిని తేమగా ఉంచుతుంది. అందుకని, రెండు కుండల మధ్య 80 సెంటీమీటర్ల (32 అంగుళాల) దూరం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. కుండ దగ్గరి నుంచి 20 నుంచి 30 సెం.మీ. (8–12 అంగుళాల) దూరంలో కుండ చుట్టూ 4 నుంచి 6 పాదుల్లో కూరగాయ విత్తనాలు విత్తుకోవాలి. లేదా దోసకాయ, బెండ లేదా వంకాయ వంటి మొక్కల నారును నాటుకోవాలి. మొక్కల మధ్య అదే దూరం వదలండి.

ప్లాస్టిక్ బాటిళ్లతో కూడా..

మట్టి కుండలు అందుబాటులో లేకపోతే లీటరు/2 లీటర్ల ప్లాస్టిక్ బాటిళ్లను కూడా ఉపయోగించుకోవచ్చు. ప్లాస్టిక్ బాటిల్ పై భాగాన్ని కత్తిరించాలి. బాటిల్ అడుగు నుంచి బెత్తెడు ఎత్తు వరకు చుట్టూతా అక్కడక్కడా సన్నటి రంధ్రాలు చేయాలి. కొవ్వొత్తి వెలుగులో కాల్చిన మేకు/తీగను గుచ్చి రంధ్రాలు చేయవచ్చు. రంధ్రాలు చేసినంత ఎత్తు వరకు గోనె సంచి ముక్కను చుట్టి నీటితో నింపితే.. బాటిల్‌లో నుంచి నీరు త్వరగా బయటకు వెళ్లిపోకుండా నెమ్మదిగా మట్టిని తడుపుతూ ఉంటుంది. ఈ బాటిళ్లు కూరగాయ తోటలకు సరిపోతాయి. టెర్రస్ గార్డెన్లలోనూ వీటిని వాడొచ్చు.



● కుండకు లీటరు గ్రోత్‌ప్రమోటర్ ద్రావణం

సేంద్రియ ద్రావణం తయారీ ఇలా..

కిలో పండిన అరటి పండ్లు, కిలో బెల్లం, 5 లీ. కొబ్బరి నీళ్లు, 5 లీ. మజ్జిగను ఒక బక్కెట్‌లో పోసి బాగా కలియదిప్పి, పురుగు పుట్రా పడకుండా, బక్కెట్ మూతి కట్టేయాలి. కట్టు విప్పి రోజుకోసారి కలియతిప్పాలి. ద్రావణం కొన్ని రోజుల్లో సిద్ధమైన తర్వాత.. 10 లీటర్ల నీటిని కలపాలి. ఆ ద్రావణాన్ని ఒక్కో కుండకు లీటరు చొప్పున పోయాలి. పొలంలో ఎన్ని కుండలు పెట్టుకుంటే అందుకు తగినంత ద్రావణాన్ని తయారు చేసుకోవాలి. ఈ ద్రావణం పంటల్లో పెరుగుదల లోపం లేకుండా చేస్తుంది.

పండ్ల తోటల్లో ఇలా..

కొబ్బరి మొక్కల మధ్య 60 నుంచి 90 సెం.మీ. (2 – 3 అడుగు)లకు ఒక కుండను పాతి పెట్టాలి. మామిడి తోటల్లో చెట్టు మొదలు నుంచి 50 నుంచి 75 సెం.మీ. (20–30 అంగుళాల) దూరంలో ఒక్కొక్క కుండను పాతిపెట్టాలి. 4×4 మీటర్ల దూరంలో నాటిన ఎదిగిన తోటల్లో 2 చెట్ల మధ్య మధ్యలో ఒక కుండను మట్టిలో పాతి పెడితే చాలు.

కుండల నిండా నీరు పోసిన తర్వాత, నీరు ఎండకు ఆవిరైపోకుండా, దానిపై మట్టి మూకుడును బోర్లించండి. కుండలో నీరు తగ్గిపోతుంటే మళ్లీ మళ్లీ నింపుతూ ఉంటే చాలు. ఎండ తీవ్రతను బట్టి, మట్టి స్వభావాన్ని కొన్ని రోజులకోసారి కుండల్లో నీరు నింపాల్సి వస్తుంది. పంటలు ఆరోగ్యంగా పెరిగి మంచి దిగుబడినివ్వడానికి దోహదపడే సేంద్రియ ద్రావణాన్ని స్వయంగా రైతులే తయారు చేసుకొని వాడుతున్నారు. కొన్ని వారాలకొకసారి ఈ ద్రావణాన్ని కుండకు ఒక లీటరు సేంద్రియ ద్రావణాన్ని పోస్తున్నారు.

ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కుండ సేద్యంపై తెలుగు వీడియో చూడొచ్చు.

28, 29 తేదీల్లో అరకులో పాత విత్తనాల పండుగ

తూర్పు కనుమల వ్యవసాయక జీవవైవిధ్యాన్ని కళ్లకు కట్టే పాత విత్తనాల పండుగ విశాఖ జిల్లా అరకు ప్రాంతంలోని డుంబ్రిగుడ మండలం కిల్లోగూడలో సంజీవని సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ సహకారంతో ఈ నెల 28–29 తేదీల్లో జరగనుంది. ప్రకృతి వ్యవసాయానికి పట్టుకొమ్మ అయిన పాత పంటల విత్తనాల వైవిధ్యాన్ని ప్రతి ఏటా వినియోగిస్తూ పరిరక్షించుకోవటమే ఈ 15వ పాత పంటల జాతర ముఖ్య ఉద్దేశమని సంజీవని వ్యవస్థాపకులు దేవుళ్లు పచారి తెలిపారు. తూర్పు కనుమలు విస్తరించిన ప్రాంతాల్లో వాతావరణ మార్పుల్ని తట్టుకుంటూ రైతులు అనాదిగా సాగు చేస్తున్న చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, దేశీ వరి రకాలను ఈ పండుగ సందర్భంగా ప్రదర్శించి, విక్రయించనున్నట్లు తెలిపారు. అందరూ ఆహ్వానితులే.

దేవుళ్లు – 9440119789

'చౌక'గా నీటి సంరక్షణ!



● వాన నీటిని ఒడిసిపట్టే 'చౌక' ఇదే



● నీటితో నిండుగా ఉన్న 'చౌక'

వేరే ఊర్లో పదో తరగతి చదివే ఓ పిల్లోడు సెలవులకు ఇంటికొచ్చినప్పుడు తన గ్రామ ప్రజలను పీడిస్తున్న కటిక కరువు పరిస్థితులను మార్చడానికి ఏదైనా చెయ్యాలన్న పట్టుదలతో చదువుకు స్వస్తి చెప్పాడు. 16 ఏళ్ల వయసులో ఈ పని చేసిన లక్ష్మణ్ సింగ్ 66 ఏళ్ల వయసులో గత నెలలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు.

రాజస్థాన్‌లోని జైపూర్ నగరానికి 90 కి.మీ. దూరంలో ఉన్న లపోడియా లక్ష్మణ్ సింగ్ స్వగ్రామం. సరిగ్గా ఏభయ్యేళ్ల క్రితం తాగు నీటి కోసం 70 అడుగుల లోతు బావుల్లోకి దిగి తోడుకోవాల్సిన దుస్థితిలో ఉన్న ఆ గ్రామం.. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన లక్ష్మణ్ సింగ్ నిరంతర కృషి వల్ల ఇప్పుడు సస్యశ్యామలంగా మారింది. మండే ఎండల్లోనూ అక్కడి బావుల్లో 3 అడుగుల్లోనే నీరు అందుబాటులో ఉంది. ఊళ్లో పశువులు, మేకలకు గడ్డి కొరత లేదు. గ్రామస్థులకు పాడి పంటలపై మంచి ఆదాయం వస్తోంది.



● పద్మశ్రీ పురస్కారం అందుకుంటున్న లక్ష్మణ్ సింగ్

ఇంతకీ ఆయన ఏం చేశాడంటే.. చిన్నా చితక వర్షాలు మాత్రమే కురుసే పరిస్థితుల్లో పెద్ద చెరువులు తవ్వి ఎదురు చూస్తే ఉపయోగం లేదు. పొలాల్లో వర్షపు నీరు ఎక్కడికక్కడ ఇంకేలా చెయ్యాలనుకున్నాడు. కేవలం 9 అంగుళాల లోతు వాన నీటిని నిలుపుకునేలా తక్కువ ఎత్తులో 3 వైపులా మట్టి కట్టలు వేయటం ప్రారంభించాడు. దీనికి 'చౌక'(చతుర్ముఖి) అని పేరుపెట్టాడు. వాలుకు అడ్డంగా 3 వైపులా మట్టి కట్టలు ఉంటాయి. వర్షపు నీటి ప్రవాహం దీనిలోకి ప్రవేశించి నెమ్మదిస్తుంది. భూమిలోకి ఇంకుతుంది. 'చౌక' మధ్యలో అరడుగు లోతున చతురస్రాకారంలో మడులు మడులుగా బెత్తెడు ఎత్తున మట్టి తవ్వుతారు. నీరు ఇంకడానికి ఇవి ఉపయోగపడుతున్నాయి. పెద్ద వర్షం కురిస్తే నీరు 'చౌక' కట్టలపై నుంచి పొర్లి కిందకు వెళ్లిపోతాయి. కట్ట తెగదు. ఒక చౌక నుంచి కిందికి వెళ్లే నీరు మరో చౌకలోకి వెళ్తుంది. వర్షపు నీరు ఎక్కడికక్కడ భూమిలోకి ఇంకుతోంది. పెద్ద వర్షం కురిస్తేనే నీరు చెరువుల్లోకి చేరుతుంది. గ్రామం చుట్టూ పొలాల్లో 'చౌక'లతో పాటు 3 చెరువులు నిర్మించారు. 1800 ఎకరాలు సాగులోకి వచ్చాయి. పశుగ్రాసానికి, సాగు/తాగు నీటికి కొరత తీరిపోయింది. లపోడియా బాగుపడిన తర్వాత పరిసర 58 గ్రామాలు సైతం ఇలాగే కరువును జయించాయి. 'నీటిని నిల్వ చేయడమే కాక పర్యావరణానికి మద్దతు ఇచ్చే వ్యవస్థను రూపొందించాం. ఇది మట్టిలో తేమను నిలిపి సూక్ష్మజీవులను ప్రోత్సహిస్తుంది. 9 అంగుళాలు నీరున్నా అందులో గడ్డి పెరుగుతుంది. జీవరాశికీ ఇది దన్నుగా నిలుస్తున్నద'న్నారు లక్ష్మణ్ సింగ్.

30న ఖమ్మంలో ఆర్గానిక్ మేళా

ఆదిగురు భారత సంఘం తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30(ఆదివారం) ఉ. 9.30–సా. 7.30 వరకు ఖమ్మంలోని కొత్త బస్టాండ్ పక్కన ఆర్గానిక్ మేళా జరగనుంది. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులను విక్రయిస్తారు. చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్ల తోటలు, మిద్దెతోటల సాగుపై సదస్సు నిర్వహిస్తారు. సదస్సులో పాల్గొన దలచిన వారు ముందుగా రిజిస్టర్ చేసుకోవాలి. గోకృపామృతం/విత్తనాల ఉచిత పంపిణీ ఉంటుంది. అందరూ ఆహ్వానితులే. వివరాలకు.. 70953 14226, 91002 50504.



నేటి నుంచి ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారులు మరో మెగా టోర్నీకి సిద్ధమయ్యారు. దుబాయ్‌లో నేడు మొదలయ్యే ఆసియా బ్యాడ్మింటన్ వ్యక్తిగత చాంపియన్‌షిప్‌లో పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. 61 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో మహిళల సింగిల్స్‌లో భారత స్టార్స్ సైనా నెహ్వాల్ మూడు కాంస్య పతకాలు (2010, 2016, 2018), పీవీ సింధు (2014, 2022) రెండు కాంస్య పతకాలు సాధించారు. అయితే ఈ ఏడాది సైనా నెహ్వాల్ బరిలోకి దిగడంలేదు.

మూడో స్థానంలో అర్జున్

సాటీ జుల్దిజ్ అంతర్జాతీయ బ్లిట్జ్ చెస్ టోర్నీలో 11 రౌండ్‌లు ముగిశాక తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ 7 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. కజకిస్తాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం అర్జున్ ఆరు గేముల్లో గెలిచి, రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మూడు గేముల్లో ఓడిపోయాడు. సిందరోవ్, హు ఇఫాన్, బిబిసారా, గెల్ఫాండ్, క్రామ్నిక్, కాటరీనా లాగ్నోలపై అర్జున్ నెగ్గాడు. నేడు జరిగే మరో 11 రౌండ్‌లతో టోర్నీ ముగుస్తుంది.



ఎస్‌సీజీ గేట్‌కు సచిన్ పేరు

50వ పుట్టిన రోజున క్రికెట్ ఆస్ట్రేలియా కానుక





సిడ్నీ: భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సోమవారం (ఏప్రిల్ 24) 50వ పుట్టినరోజు జరుపుకున్నాడు. క్రికెట్ ప్రేక్షకులకు, ప్రత్యేకించి 'మాస్టర్' బ్యాట్స్‌మన్ అభిమానులకు ఇది పండగ రోజు. ఈ 'ఫిఫ్టీ'ని మరింత చిరస్మరణీయం చేసుకునేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) వైపు నుంచి అపురూప కానుక లభించింది. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ (ఎస్‌సీజీ)లోని ఓ గేట్‌కు సచిన్ పేరు పెట్టింది. ఈ మైదానం అతనికెంతో ప్రత్యేకమైంది. ఈ వేదికపై 'లిటిల్ మాస్టర్' మూడు శతకాలు సహా 785 పరుగులు చేశాడు. అత్యధిక స్కోరు 241 (2004లో). ఇక్కడ సచిన్ 157 సగటు నమోదు చేయడం మరో విశేషం. సోమవారం సచిన్ 50వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్‌సీజీ, న్యూసౌత్‌వేల్స్ వేదికల చైర్మన్ రాడ్ మెక్ గియోచ్, సీఈఓ కెర్రీ మాథర్, క్రికెట్ ఆస్ట్రేలియా సీఈఓ నిక్ హాక్లీ 'సచిన్ గేట్'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సచిన్ అనుభవాన్ని ప్రస్తావించారు. 'భారత్ వెలుపల సిడ్నీ నా ప్రియమైన మైదానం .1991–92లో నా తొలి ఆసీస్ పర్యటన మొదలు కెరీర్ ముగిసేదాకా ఎస్‌సీజీలో నాకు మరిచిపోలేని స్మృతులెన్నో వున్నాయి' అని సచిన్ పేర్కొన్నారు. సచిన్ సమకాలికుడు బ్రియాన్ లారా (విండీస్) కూడా అక్కడ గొప్ప గొప్ప ఇన్నింగ్స్‌ల ఆడటంతో మరో గేట్‌కు లారా పేరు పెట్టారు. తనకు కలిసొచ్చిన ఈ మైదానం పేరును లారా తన కుమార్తెకు 'సిడ్నీ' అని పెట్టుకున్నాడు.

2033 వరకు భారత హాకీ జట్లకు స్పాన్సర్‌గా ఒడిశా ప్రభుత్వం



భువనేశ్వర్: భారత సీనియర్, జూనియర్ పురుషుల, మహిళల హాకీ జట్లకు మరో పదేళ్ల పాటు స్పాన్సర్‌షిప్ చేస్తామని ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2018 నుంచి ఒడిశా జాతీయ హాకీ జట్లకు స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. 2018, 2023లలో పురుషుల ప్రపంచకప్ టోర్నీలకు ఒడిశా ఆతిథ్యమిచ్చింది.

సన్‌రైజర్స్‌కు ఢిల్లీ షాక్



- బ్యాటింగ్ వైఫల్యంతో హైదరాబాద్ ఓటమి
- భువీ, సుందర్, మయాంక్ శ్రమ వృథా
- 7 పరుగులతో ఢిల్లీ గెలుపు
- రాణించిన అక్షర్ పటేల్, పాండే

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై జరిగిన మ్యాచ్‌ను గెలిపించేందుకు హైదరాబాద్ బౌలర్లు శ్రమిస్తే... బ్యాటర్ల అలసత్వం జట్టుకు ఊహించని షాక్ ఇచ్చింది. ఓటమి తప్పదనుకున్న పోరులో ఢిల్లీ పోరాటం జట్టును 7 పరుగులతో గెలిపించింది. తొలుత ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 144 పరుగులు చేసింది. మనీశ్ పాండే (27 బంతుల్లో 34; 2 ఫోర్లు), అక్షర్ పటేల్ (34 బంతుల్లో 34; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడారంతే! వాషింగ్టన్ సుందర్ 3, భువనేశ్వర్ 2 వికెట్లు తీశారు. తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 137 పరుగులే చేసింది. మయాంక్ (39 బంతుల్లో 49; 7 ఫోర్లు) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అక్షర్ పటేల్, నోర్జే రెండేసి వికెట్లు తీశారు. ఐపీఎల్‌లో ఢిల్లీ చేతిలో హైదరాబాద్‌కిది వరుసగా ఐదో ఓటమి.



అక్షర్ పటేల్



ఆదుకున్న ఆ ఇద్దరు...

ముందుగా హైదరాబాద్ బౌలర్ల ధాటికి ఢిల్లీ బ్యాటర్లు విలవిల్లాడారు. జట్టును నడిపించే స్కోరు గానీ, ప్రేక్షకుల్ని అలరించే ఆటగానీ ఇన్నింగ్స్‌లో కరువైంది. సాల్ట్ (0) డకౌట్ కాగా, చకచకా 5 బౌండరీలు బాదిన మార్ష్ (15 బంతుల్లో 25; 5 ఫోర్లు) ఆట ఐదో ఓవర్లోనే ముగిసింది. 8వ ఓవర్ వేసిన వాషింగ్టన్ సుందర్ స్పిన్ ఉచ్చులో అనుభవజ్ఞుడైన వార్నర్ (20 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్), ఇంపాక్ట్ ప్లేయర్ సర్ఫరాజ్ (10), అమన్ హకీమ్ (4) చిక్కారు. 62 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన దశలో మనీశ్ పాండే, అక్షర్ పటేల్ ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 69 పరుగులు జోడించారు.

బ్యాటర్ల నిర్లక్ష్యం...

తక్కువ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు ఆపసోపాలు పడింది. బ్రూక్ (7), తర్వాత త్రిపాఠి (21 బంతుల్లో 15)తో కలిసి వేగంగా ఆడిన మయాంక్ 12వ ఓవర్లో పెవిలియన్ చేరడంతో సీన్ మారిపోయింది. స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్ పటేల్ పిచ్ అనుకూలతలతో బంతుల్ని సుడులు తిప్పారు. అభిషేక్ శర్మ (5) మార్క్‌రమ్ (3) స్వల్ప వ్యవధిలో నిష్క్రమించడంతో 85 పరుగుల వద్ద 5 వికెట్లను కోల్పోయింది. చివర్లో క్లాసెన్ (19 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్), సుందర్ (15 బంతుల్లో 24 నాటౌట్; 3 ఫోర్లు)ల బౌండరీలతో సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ గాడిన పడింది. కానీ క్లాసెన్ వేగానికి నోర్జే బౌలింగ్‌లో చుక్కెదురవడంతో ఓటమి తప్పలేదు. హైదరాబాద్ విజయానికి ఆఖరి ఓవర్లో 13 పరుగులు చేయాల్సి ఉండగా 'ఇంపాక్ట్' బౌలర్ ముకేశ్ కేవలం 5 పరుగులే ఇచ్చాడు.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (సి) బ్రూక్ (బి) సుందర్ 21; సాల్ట్ (సి) క్లాసెన్ (బి) భువనేశ్వర్ 0; మార్ష్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నటరాజన్ 25; సర్ఫరాజ్ (సి) భువనేశ్వర్ (బి) సుందర్ 10; మనీశ్ పాండే (రనౌట్) 34; అమన్ (సి) అభిషేక్ (బి) సుందర్ 4; అక్షర్ (బి) భువనేశ్వర్ 34; రిపాల్ (రనౌట్) 5; నోర్జే (రనౌట్) 2; కుల్దీప్ (నాటౌట్) 4; ఇషాంత్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 144. వికెట్ల పతనం:** 1–1, 2–39, 3–57, 4–58, 5–62, 6–131, 7–134, 8–139, 9–139. **బౌలింగ్:** భువనేశ్వర్ 4–0–11–2, జాన్సెన్ 2–0–27–0, సుందర్ 4–0–28–3, నటరాజన్ 3–0–21–1, మార్కండే 4–0–34–0, ఉమ్రాన్ 2–0–14–0, మార్క్‌రమ్ 1–0–7–0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (బి) నోర్జే 7; మయాంక్ (సి) అమన్ (బి) అక్షర్ 49; రాహుల్ త్రిపాఠి (సి) సాల్ట్ (బి) ఇషాంత్ 15; అభిషేక్ (సి అండ్ బి) కుల్దీప్ 5; మార్క్‌రమ్ (బి) అక్షర్ 3; క్లాసెన్ (సి) అమన్ (బి) నోర్జే 31; సుందర్ (నాటౌట్) 24; జాన్సెన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 137. వికెట్ల పతనం:** 1–31, 2–69, 3–75, 4–79, 5–85, 6–126. **బౌలింగ్:** ఇషాంత్ 3–0–18–1, నోర్జే 4–0–33–2, ముకేశ్ 3–0–27–0, అక్షర్ 4–0–21–2, కుల్దీప్ 4–0–22–1, మార్ష్ 2–0–16–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
చెన్నై	7	5	2	10	0.662
రాజస్తాన్	7	4	3	8	0.844
లక్నో	7	4	3	8	0.547
గుజరాత్	6	4	2	8	0.212
బెంగళూరు	7	4	3	8	-0.008
పంజాబ్	7	4	3	8	-0.162
ముంబై	6	3	3	6	-0.254
కోల్‌కతా	7	2	5	4	-0.186
హైదరాబాద్	7	2	5	4	-0.725
ఢిల్లీ	7	2	5	4	-0.961

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ × ముంబై (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

సుప్రీంకోర్టులో తేల్చుకుంటాం!

- న్యాయం జరిగే వరకు పోరాటం
- కొనసాగుతున్న రెజ్లర్ల నిరసన
- ఐఓఏ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలు



మీడియాతో మాట్లాడుతున్న వినేశ్ ఫొగాట్, బజరంగ్, సాక్షి మలిక్

న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని... వెంటనే ఆయనను అరెస్టు చేయాలని భారత స్టార్ రెజ్లర్లు సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్, బజరంగ్ పూనియా డిమాండ్ చేశారు. ఒకవేళ పోలీసులు బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయకపోతే న్యాయం కోసం సుప్రీంకోర్టుకు వెళ్తామని జంతర్ మంతర్ వద్ద నిరసన చేస్తున్న ఈ స్టార్ రెజ్లర్లు స్పష్టం చేశారు. కొందరు మహిళా రెజ్లర్లను బ్రిజ్ భూషణ్ లైంగికంగా వేధించారని తాము చేస్తున్న ఆరోపణలు అవాస్తవం అని తేలితే తమపైనే కేసు నమోదు చేయాలని 2016 రియో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన సాక్షి వ్యాఖ్యానించింది. మూడు నెలల క్రితం చేపట్టిన నిరసనను విరమించి తప్పు చేశామని... ఈ విషయంలో తమను కొందరు తప్పుదోవ పట్టించారని సాక్షి, వినేశ్, బజరంగ్ విచారం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం మధ్యవర్తుల మాటలు వినబోమని, రెజ్లింగ్ శ్రేయోభిలాషుల సూచనలు స్వీకరిస్తామని చెప్పారు. బ్రిజ్ భూషణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు కన్నాట్ ప్లేస్ పోలీసు స్టేషన్‌కు తాము వెళ్లినా పోలీసులు ఫిర్యాదు తీసుకోవడానికి నిరాకరించారని టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన బజరంగ్ పూనియా తెలిపాడు. 'అంతర్జాతీయ టోర్నీల్లో దేశం కోసం పతకాలు సాధించినపుడు కేంద్ర ప్రభుత్వం సన్మానిస్తుంది. కానీ మా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుంటే మాత్రం ఇదే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు' అని బజరంగ్ ఆవేదన వ్యక్తం చేశాడు. 'దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ నేతృత్వంలో కేంద్ర క్రీడా శాఖ నియమించిన పర్యవేక్షక కమిటీ మా పట్ల పక్షపాతంగా వ్యవహరించింది. కేవలం సుప్రీంకోర్టుకు మాత్రమే లైంగిక వేధింపులకు గురైన బాధితుల వివరాలు తెలుస్తాయి. బ్రిజ్ భూషణ్ బీజేపీ ఎంపీ కావడం, ఆ పార్టీనే కేంద్రంలో అధికారంలో ఉండటంతో ఆయనపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నట్లు అనిపిస్తోంది' అని ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్ విజేత వినేశ్ వ్యాఖ్యానించింది.

మరోవైపు మే 7వ తేదీన జరగాల్సిన డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలకు గుర్తింపు లేదని... భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటయ్యే అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో 45 రోజుల్లో ఎన్నికలు జరుగుతాయని కేంద్ర క్రీడా శాఖ ప్రకటించింది. మేరీకోమ్ సారథ్యంలోని పర్యవేక్షక కమిటీ తమ నివేదిక అందించిందని... నివేదికను పరిశీలిస్తున్నామని ఈ సందర్భంగా క్రీడా శాఖ వివరించింది. పర్యవేక్షక కమిటీ నివేదిక ప్రకారం డబ్ల్యూఎఫ్ఐలో పారదర్శకత కొరవడిందని... రెజ్లర్ల సమస్యలు వినేందుకు, పరిష్కరించేందుకు ఎలాంటి వ్యవస్థ లేదని తాము గుర్తించినట్లు తెలిపింది. విచారణ పూర్తి చేసి నివేదిక అందించడంతో పర్యవేక్షక కమిటీ పని ముగిసిందని క్రీడా శాఖ తెలిపింది.

ఐర్లాండ్ 319/4



బాల్బిర్నీ

గాలె: శ్రీలంకతో సోమవారం మొదలైన రెండో టెస్టులో ఐర్లాండ్ జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఐర్లాండ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 319 పరుగులు సాధించింది. కెప్టెన్ ఆండీ బాల్బిర్నీ (163 బంతుల్లో 95; 14 ఫోర్లు) ఐదు పరుగుల తేడాతో సెంచరీని కోల్పోయాడు. పాల్ స్టిర్లింగ్ (133 బంతుల్లో 74 రిటైర్డ్‌హర్ట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), లోర్కాన్ టకర్ (102 బంతుల్లో 78 బ్యాటింగ్; 10 ఫోర్లు) కూడా అర్ధ సెంచరీలు చేశారు. బాల్బిర్నీ, స్టిర్లింగ్ నాలుగో వికెట్‌కు 115 పరుగులు జోడించారు. టెస్టుల్లో ఐర్లాండ్ జట్టుకు ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం. మరో 20 పరుగులు సాధిస్తే ఐర్లాండ్ టెస్టుల్లో తమ అత్యధిక స్కోరును నమోదు చేస్తుంది. టకర్‌కు జతగా ప్రస్తుతం కాంఫెర్ (27 బ్యాటింగ్; 2 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో ఉన్నాడు. లంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య రెండు వికెట్లు పడగొట్టాడు.

సినిమా

వినాయక చవితికి...



● రజనీకాంత్

గత ఏడాది రజనీకాంత్ సిల్వర్ స్క్రీన్‌పై కనిపించలేదు. 2021 నవంబర్‌లో 'అన్నాత్తే' (తెలుగులో 'పెద్దన్నయ్య')తో అలరించారు. సూపర్ స్టార్ సినిమా రిలీజై ఏడాదిన్నర అవుతోంది కాబట్టి ఆయన నటించిన తాజా చిత్రం 'జైలర్' కోసం ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ఏప్రిల్‌లో ఈ చిత్రం విడుదలవుతుందనుకున్నారు కానీ, రాలేదు. తాజా వార్తల ప్రకారం సెప్టెంబర్‌లో విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోందట. రజనీకాంత్ పాత్ర చిత్రీకరణ మొత్తం పూర్తయిందని ఇటీవల ఈ చిత్రదర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ ఓ వేడుకలో స్పష్టం చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. సెప్టెంబర్‌లో వినాయక చవితికి సినిమాని రిలీజ్ చేయాలనుకుంటున్నారని, త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని కోలీవుడ్ ఫిల్మ్ సర్కిల్ అంటోంది. రజనీ సరసన తమన్నా కథానాయికగా నటించిన ఈ చిత్రంలో జాకీ ష్రాఫ్, శివ రాజ్‌కుమార్, సునీల్, రమ్యకృష్ణ కీలక పాత్రలు చేశారు. మోహన్‌లాల్ అతిథి పాత్రలో కనిపించనున్నారు.

అతడే ఒక సైన్యం



● వేమూరి బలరామ్, ప్రభాకర్ జైనీ

ప్రముఖ వారపత్రిక 'స్వాతి' అధినేత వేమూరి బలరామ్ జీవితం సినిమాగా రానుంది. 'స్వాతి బలరాం–అతడే ఒక సైన్యం' పేరుతో రచయిత, దర్శకుడు ప్రభాకర్ జైనీ ఈ సినిమా తెరకెక్కించనున్నారు. విజయ లక్ష్మి జైనీ నిర్మించనున్నారు. ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ– ''నలభై ఏళ్లుగా నవరసాల సాహిత్యంతో ప్రతి ఒక్కర్నీ అలరించారు సాహితీ సమరాంగణా సార్వభౌముడు బలరామ్‌గారు. ఓ సందర్భంలో ఆయన్ని కలిసినప్పుడు 'సార్! మీ బయోపిక్ తీద్దాం' అన్నాను. అప్పుడు బలరామ్‌గారు చెప్పిన తన జీవితంలోని సంఘటనలు నా కళ్ల ముందు దృశ్య రూపంలో మెదిలాయి. ఆయన జీవితంలో ఎన్నో విజయాలు ఉన్నా... వాటికన్నా ఎక్కువ విషాదాలు ఉన్నాయి. 'క్యాంపస్–అంపశయ్య', 'ప్రజాకవి కాళోజీ' వంటి జీవిత చరిత్రలను తీసిన అనుభవంతో 'స్వాతి బలరాం–అతడే ఒక సైన్యం'ని కూడా బాగా తీయగలనన్న నమ్మకం ఉంది. త్వరలో నటీనటులను ఎంపిక చేసి, షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: తిరుపతి రెడ్డి కోట, సంగీతం: శ్రీధర్ ఆత్రేయ.



● అత్తమామలు సురేఖ, చిరంజీవి, భర్త రామ్‌చరణ్, ఇతర కుటుంబ సభ్యులతో ఉపాసన

ఆనందంగా...

కొత్త మెరుపుతో ఆనందంగా కనిపించారు ఉపాసన. తల్లి కాబోతున్న ఆనందం తాలూకు మెరుపు అది. ఇక తండ్రి కాబోతున్న ఆనందం రామ్‌చరణ్‌లోనూ స్పష్టంగా కనిపించింది. కుటుంబ సభ్యుల సమక్షంలో ఉపాసన సీమంతం వేడుక జరిగింది. కొన్ని రోజుల క్రితం కాస్త సింపుల్‌గా హైదరాబాద్‌లో సీమంతం జరుపుకున్న ఉపాసన ఇటీవల దుబాయ్‌లో స్నేహితుల సమక్షంలో 'బేబీ షవర్' వేడుక చేసుకున్నారు. తాజాగా మరోసారి హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య ఉపాసన సీమంతం ఘనంగా జరిగింది. ఉపాసన తల్లి శోభన కామినేని, హీరో అల్లు అర్జున్‌తో పాటు పింకీ రెడ్డి, సానియా మీర్జా తదితరులు పాల్గొన్నారు.

నువ్వే.. నువ్వే...



● డింపుల్ హాయతి, గోపీచంద్

'నువ్వే.. నువ్వే..' అంటూ కోల్‌కతా వీధుల్లో ప్రేయసి డింపుల్ పై ప్రేమ కురిపిస్తున్నారు గోపీచంద్. శ్రీవాస్ దర్శకత్వంలో గోపీచంద్, డింపుల్ హాయతి జంటగా రూపొందిన చిత్రం 'రామబాణం'. ఈ చిత్రంలోని మూడో పాట 'నువ్వే.. నువ్వే..' లిరికల్ వీడియోను హీరోయిన్ శ్రీలీల విడుదల చేశారు. మిక్కీ జె. మేయర్ స్వరపరచిన ఈ పాటకు శ్రీమణి సాహిత్యం అందించగా, రితేష్ జి. రావు పాడారు. దినేష్ కుమార్ నృత్యరీతులు సమకూర్చారు. ''ఇప్పటికే రిలీజ్ చేసిన రెండు పాటలకు, ట్రైలర్‌కి మంచి స్పందన లభించింది. తాజాగా విడుదల చేసిన 'నువ్వే.. నువ్వే..' మళ్లీ మళ్లీ వినాలపించేలా ఉంటుంది. ప్రేయసి అందాన్ని ప్రశంసిస్తూ హీరో పాడే ఈ పాట కోల్‌కతా నేపథ్యంలో సాగుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదల కానుంది. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి?

- ఆర్. నారాయణ మూర్తి



● ఆర్. నారాయణ మూర్తి

''పదో తరగతి పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ, గ్రూపు 1, 2 వంటి ఉద్యోగ పరీక్షల్లోనూ పేపరు లీకేజీ... ఇలా అయితే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి? నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి? అనే కథాంశంతో 'యూనివర్సిటీ' చిత్రం తీశాను'' అన్నారు ఆర్. నారాయణ మూర్తి. ఆయన లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన సినిమా 'యూనివర్సిటీ'. ఈ చిత్రం సెన్సార్ పూర్తయింది. ఈ సందర్భంగా నారాయణ మూర్తి మాట్లాడుతూ– ''పాలకుల నిర్లక్ష్యంతో విద్యార్థులు, నిరుద్యోగులు రెక్కలు తెగిన పావురాల్లా నిస్సహాయ స్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. కొందరి వల్ల విద్యా వ్యవస్థ, ఉద్యోగ వ్యవస్థ నిర్వీర్యం కావాలా? కాకూడదు. మనది నిరుద్యోగ భారతం కాదు.. ఉద్యోగ భారతం కావాలని చాటి చెప్పే చిత్రమే 'యూనివర్సిటీ'. అతి త్వరలో ఆడియో రిలీజ్ చేసి, త్వరలోనే సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కథ–స్క్రీన్ ప్లే–మాటలు–సంగీతం–దర్శకత్వం–నిర్మాత: ఆర్. నారాయణ మూర్తి, కెమెరా: బాబూరావు.

అందుకు పదేళ్లు పట్టింది!



● ప్రియాంకా చోప్రా

బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకూ వెళ్లి, అక్కడ జోరుగా ప్రాజెక్ట్స్ చేస్తున్నారు ప్రియాంకా చోప్రా. ఆమె నటించిన తాజా వెబ్ సిరీస్ 'సిటాడెల్' ఈ నెల 28 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో ప్రియాంక మాట్లాడుతూ – ''బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ అయిన నేను హాలీవుడ్‌లో కొత్త నటిలా కెరీర్ ఆరంభించినప్పుడు ఆడిషన్స్ ఇవ్వాల్సి వచ్చింది. ఆడిషన్స్ ఇవ్వడం తప్పని అనడంలేదు. ఎందుకంటే ఆడిషన్స్ అనేవి మన ప్రతిభ మీద ఆధారపడి ఉంటాయి. ఇండస్ట్రీలో ఉన్న కనెక్షన్స్‌తో కాదు. ఆడిషన్స్‌లో గెలిచి, చాన్స్ తెచ్చుకోవడం అప్పట్లో న్యూ కమర్‌గా హాలీవుడ్‌లో నాకో మంచి అనుభూతి. అయితే ఇప్పుడు 'సిటాడెల్'కి ఆడిషన్స్ ఇవ్వకుండానే సెలక్ట్ అయ్యాను. అంతగా నా ప్రతిభని నిరూపించుకున్నాను. ఇప్పుడు పోస్టర్స్‌లో నాకూ సమభాగం దక్కుతోంది. అలాగే, మేల్ స్టార్స్‌కి ఈక్వల్‌గా పారితోషికం తీసుకుంటున్నా. హాలీవుడ్‌కి వెళ్లిన పదేళ్లకు నేను సాధించుకున్న ఘనత ఇది'' అన్నారు. ఇంకా భారతీయ తారల గురించి ఆమె మాట్లాడుతూ – ''ఇప్పుడు ఎక్కడ చూసినా ఇండియన్ స్టార్స్ ఉంటున్నారు. తెరపైనే కాదు.. తెరవెనక కూడా ప్రతిభను చాటుకుంటున్నారు. వాళ్లందరూ హాలీవుడ్‌కి రావాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే మనవాళ్లకి అంత ప్రతిభ ఉంది'' అన్నారు.

స్టార్‌తో మల్టీస్టారర్



● కిరణ్ అబ్బవరం

వరుస చిత్రాలతో బిజీగా దూసుకెళుతున్నారు హీరో కిరణ్ అబ్బవరం. ఓ వైపు హీరోగా నటిస్తూనే మరోవైపు తన చిత్రాల్లో కొన్నింటికి కథలు కూడా రాసుకుంటున్నారాయన. 'ఎస్ఆర్ కళ్యాణ మండపం, నేను మీకు బాగా కావాల్సిన వాడిని' చిత్రాలకు కథ అందించిన కిరణ్ తాజాగా ఓ మల్టీస్టారర్ మూవీ కోసం కథ సిద్ధం చేస్తున్నారు. ఓ స్టార్ హీరో నటించనున్న ఈ చిత్రంలో కిరణ్ కూడా ఓ హీరోగా నటించనున్నారు. నూతన దర్శకుడు తెరకెక్కించనున్న ఈ మల్టీస్టారర్ మూవీని ఓ పెద్ద సంస్థ నిర్మించనుంది. ఈ సినిమాతో పాటు మరో మూడు భారీ ప్రాజెక్టుల్లో నటించనున్నారు కిరణ్. కాగా రత్నం కృష్ణ దర్శకత్వంలో కిరణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'రూల్స్ రంజన్' విడుదలకు సిద్ధం అవుతోంది.

దీపావళికి ఏలియన్



● శివ కార్తికేయన్

శివ కార్తికేయన్, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'అయలాన్'. ఆర్. రవికుమార్ దర్శకత్వంలో కోటపాడి జె. రాజేష్, ఆర్.డి. రాజా నిర్మించారు. ఈ చిత్రాన్ని దీపావళి సందర్భంగా నవంబర్‌లో తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఫస్ట్ లుక్ విడుదల చేసింది యూనిట్. ఈ సందర్భంగా కోటపాడి జె. రాజేష్ మాట్లాడుతూ– ''అయలాన్' అంటే ఏలియన్ అని అర్థం. ఇంతకుముందు కొన్ని సైన్స్ ఫిక్షన్ మూవీస్ వచ్చాయి. అయితే, ఏలియన్ ప్రధాన పాత్ర నేపథ్యంలో దక్షిణాది భాషల్లో ఇప్పటివరకూ ఒక్క సినిమా కూడా రాలేదు.. మా 'అయలాన్' తొలి చిత్రం అవుతుంది. ఈ చిత్రంలో 4500లకు పైగా వీఎఫ్ఎక్స్ షాట్స్ ఉన్నాయి. ఇన్ని వీఎఫ్ఎక్స్ షాట్స్ ఉన్న ఫుల్ లెంగ్త్ లైవ్ యాక్షన్ సినిమా మాదే. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కోసం ఎక్కువ సమయం పడుతోంది'' అన్నారు. ఇషా కొప్పికర్, భానుప్రియ, యోగిబాబు తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: నీరవ్ షా, సంగీతం: ఏఆర్ రెహమాన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
401	119
60,056	17,743

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,019	▽	53
డోజోన్స్	33,829	▲	20
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,912	▽	2
డాక్స్	15,864	▽	18
కాంఫ్లి	3,275	▽	26
నికాయ్	28,594	▲	29

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారట్)	60,081
బంగారం (22 క్యారట్)	59,840
వెండి (కిలో)	74,390

మారుతీ 'ఫ్రాంక్స్' వచ్చేసింది

మొత్తం 12 వేరియంట్లలో లభ్యం • ధర రూ.7.46–13.13 లక్షలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ కాంపాక్ట్ ఎస్‌యూవీ ఫ్రాంక్స్ భారత మార్కెట్లో రంగ ప్రవేశం చేసింది. 1.2 లీటర్ కె–సిరీస్ డ్యూయల్ జెట్, డ్యూయల్ వీవీటీ ఇంజన్‌తో అయిదు వేరియంట్లను అందుబాటులోకి తెచ్చింది. వేరియంట్‌ను బట్టి ధర ఎక్స్‌షోరూంలో రూ.7.46 లక్షల నుంచి రూ.9.27 లక్షల వరకు ఉంది. మైలేజీ లీటరుకు 5 స్పీడ్ ఎంటీ 21.79 కిలోమీటర్లు, 5 స్పీడ్ ఆటోమేటెడ్ గేర్ షిఫ్ట్ 22.89 కిలోమీటర్లు ఇస్తుందని కంపెనీ తెలిపింది. ప్రోగ్రెసివ్ స్మార్ట్ గ్రిడ్‌తో 1.0 లీటర్ కె–సిరీస్ టర్బో బూస్టర్‌జెట్ డైరెక్ట్ ఇంజెక్షన్ ఇంజన్‌తో ఏడు వేరియంట్లను పరిచయం చేసింది. ధర రూ.9.72 లక్షల నుంచి రూ.13.13 లక్షల వరకు ఉంది. మైలేజీ లీటరుకు 5 స్పీడ్ ఎంటీ 21.5 కిలోమీటర్లు, 6 స్పీడ్ ఏటీ 20.01 కిలోమీటర్లు ఇస్తుందని కంపెనీ తెలిపింది.

ఇవీ ఫ్రాంక్స్ ఫీచర్లు..

ఆరు ఎయిర్‌బ్యాగ్స్, 3 పాయింట్ ఎమర్జెన్సీ లాకింగ్ రిట్రాక్టర్ సీట్‌బెల్ట్స్, హిల్ హోల్డ్ అసిస్ట్‌తో ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రాం, రోల్ ఓవర్ మిటిగేషన్, ఐసోఫిక్స్ చైల్డ్ సీట్, టర్న్ బై టర్న్ నావిగేషన్‌తో హెడ్ అప్ డిస్‌ప్లే, 360 వ్యూ కెమెరా, వైర్‌లెస్ స్మార్ట్‌ఫోన్ చార్జర్, 9 అంగుళాల హెచ్‌డీ స్మార్ట్ ప్లే ప్రో ప్లస్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ వంటి హంగులు ఉన్నాయి. ఎస్‌యూవీ పోర్ట్‌ఫోలియో వృద్ధికి ఫ్రాంక్స్ దోహదం చేస్తుందని మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో హిసాటీ టాకేయూచీ ఈ సందర్భం తెలిపారు. మారుతీ సుజుకీ సబ్‌స్క్రైబ్ విధానంలో నెలవారీ ప్రారంభ చందా రూ.17,378 చెల్లించి కారును వినియోగించవచ్చని కంపెనీ వెల్లడించింది.

'లోకల్'కు 120 కోట్ల నిధులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైపర్‌లోకల్ కంటెంట్, కమ్యూనిటీ, క్లాసిఫైడ్ వేదిక అయిన లోకల్ తాజాగా రూ.120 కోట్ల సిరీస్–బి ఫండింగ్ అందుకుంది. గ్లోబల్ బ్రెయిన్, సోనీ ఇన్నోవేషన్ ఫండ్, ఇండియా కోషెంట్ తదితర ఇన్వెస్టర్లు ఈ మొత్తాన్ని సమకూర్చినట్లు కంపెనీ సోమవారం ప్రకటించింది. లోకల్ సేవలు అందిస్తున్న మార్కెట్లలో వృద్ధికి, కొత్త విభాగాల పరిచయానికి తాజా నిధులను వినియోగించనున్నట్టు తెలిపింది. తాజా నిధులతో కలిపి ఇప్పటి వరకు రూ.225 కోట్లకుపైగా ఫండింగ్ అందుకున్నట్టు లోకల్ ఫౌండర్, సీఈవో జానీ పాషా తెలిపారు. బెంగళూరు కేంద్రంగా 2018లో ప్రారంభమైన లోకల్ యాప్ 7 రాష్ట్రాల్లో 6 భాషల్లో అందుబాటులో ఉంది. డెయిలీ అప్‌డేట్స్, కమోడిటీ ధరలు, స్థానిక జాబ్స్, రియల్టీ, మ్యాట్రిమోనియల్, స్థానిక యాడ్‌లు, క్లాసిఫైడ్స్ సమాచారాన్ని అందిస్తోంది. 4 కోట్లకుపైగా డౌన్‌లోడ్స్ నమోదయ్యాయి.

ఇండస్‌ఇండ్ లాభం జూమ్

- క్యూ4లో రూ. 2,043 కోట్లు
- వడ్డీ ఆదాయం 17 శాతం అప్
- షేరుకి రూ. 14 డివిడెండ్



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 50 శాతం జంప్‌చేసి రూ. 2,043 కోట్లను తాకింది. ఇందుకు ప్రొవిజన్లు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం దోహదపడ్డాయి. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 1,361 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 14 చొప్పున డివిడెండును ప్రకటించింది. తాజా సమీక్షా కాలంలో నికర వడ్డీ ఆదాయం 17 శాతం ఎగసి రూ. 4,669 కోట్లను తాకింది. ఇతర ఆదాయం 13 శాతం అధికమై రూ. 2,154 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు నామమాత్ర వృద్ధితో రూ. 4.28 శాతంగా నమోదయ్యాయి. ప్రొవిజన్లు, కంటింజెన్సీలు 30 శాతం క్షీణించి రూ. 1,030 కోట్లకు పరిమితమయ్యాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.27 శాతం నుంచి 1.98 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 0.64 శాతం నుంచి 0.59 శాతానికి తగ్గాయి.

వాటా పెంపు బాటలో

ప్రమోటర్లు బ్యాంకులో తమకుగల 15 శాతం వాటాను 26 శాతానికి పెంచుకునే చర్యలను రెండు వారాల క్రితమే ప్రారంభించినట్లు ఇండస్‌ఇండ్ ఎండీ, సీఈవో సుమంత్ కాత్పాలియా పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1.3 శాతం క్షీణించి రూ. 1,101 వద్ద ముగిసింది.

ఎంజీ మోటార్‌లో జేఎస్‌డబ్ల్యూకి వాటా!



న్యూఢిల్లీ: ఆటో రంగ కంపెనీ ఎంజీ మోటార్ ఇండియాలో వాటా కొనుగోలుకి డైవర్సిఫైడ్ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా బీవైడీ ఇండియాలోనూ వాటాను సొంతం చేసుకునేందుకు స్టీల్ నుంచి స్పోర్ట్ వరకూ విభిన్న బిజినెస్‌లు కలిగిన జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ అవకాశాలను అన్వేషిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గ్రూప్ స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీపై ఉత్సాహంగా చర్చిస్తున్నట్లు ఈ ఏడాది జనవరిలో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ సీఎఫ్‌వో శేషగిరి రావు పేర్కొన్న సంగతి తెలిసిందే. వెరసి ఫోర్ వీలర్స్ తయారీపై గ్రూప్ దృష్టి సారించినట్లు వెల్లడించారు. తద్వారా మరిన్ని రంగాలలోకి గ్రూప్ విస్తరించనున్నట్లు తెలియజేశారు. కాగా.. ప్రస్తుతం అటు ఎంజీ మోటార్ ఇండియా, ఇటు బీవైడీ ఇండియాలతో వాటా కొనుగోలు నిమిత్తం ప్రాథమిక చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ అంశాలపై స్పందించడానికి జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ప్రతినిధి నిరాకరించడం గమనార్హం! మరోపక్క కంపెనీ విధానాల ప్రకారం ఇలాంటి అంచనాలపై స్పందించలేమంటూ ఎంజీ మోటార్ ప్రతినిధి వ్యాఖ్యానించారు.

సెన్సెక్స్ మళ్లీ 60,000 పైకి..

- 401 పాయింట్లు ప్లస్
- నిఫ్టీ 119 పాయింట్లు అప్
- 17,743 వద్ద ముగింపు
- పీఎస్‌యూ బ్యాంక్స్ జోరు



ముంబై: గత వారం అత్యధిక శాతం నష్టాలకే పరిమితమైన దేశీ స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. ప్రయివేట్ రంగ దిగ్గజాలు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ ఆకర్షణీయ ఫలితాలు, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం విలీనానికి ఆర్‌బీఐ మినహాయింపులు వంటి అంశాలు ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నిచ్చాయి. దీంతో ప్రధానంగా బ్యాంకింగ్ కౌంటర్లకు భారీ డిమాండ్ నెలకొంది. వెరసి సెన్సెక్స్ 401 పాయింట్లు జంప్‌చేసి తిరిగి 60,056 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 119 పాయింట్లు ఎగసి 17,743 వద్ద ముగిసింది. అయితే గురువారం ఎఫ్ అండ్‌వో ఏప్రిల్ సిరీస్ ముగింపు నేపథ్యంలో మార్కెట్లు ఆటుపోట్లను చవిచూశాయి. వెరసి సెన్సెక్స్ ఇంట్రాడేలో 59,620 వద్ద కనిష్టాన్ని, 60,102 వద్ద గరిష్టాన్ని తాకింది. ఈ బాటలో నిఫ్టీ 17,754–17,612 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులను చవిచూసింది.

రియల్టీ సైతం

ఎన్‌ఎస్‌ఈలో పీఎస్‌యూ బ్యాంక్స్ 2.6 శాతం జంప్‌చేయగా.. ప్రయివేట్ బ్యాంక్స్, రియల్టీ 1 శాతం చొప్పున బలపడ్డాయి. మీడియా 1.3 శాతం, ఫార్మా 0.7 శాతం చొప్పున డీలా పడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ 6.4 శాతం, టాటా కన్జూమర్ 5 శాతం చొప్పున జంప్‌చేయగా.. విప్రో, యాక్సిస్, ఐసీఐసీఐ, టైటాన్, ఎస్‌బీఐ, గ్రాసిమ్, హీరో మోటో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందాల్కో, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, ఆర్‌ఐఎల్ 2.7–1 శాతం మధ్య ఎగశాయి. అయితే డాక్టర్ రెడ్డీస్, ఇండస్‌ఇండ్, సిప్లా, దివీస్, మారుతీ, సన్‌ఫార్మా, యూపీఎల్, ఎయిర్‌టెల్, ఎంఅండ్‌ఎం 1.4–0.5 శాతం మధ్య బలహీనపడ్డాయి. స్టాక్ మార్కెట్లు లాభపడటం, ప్రపంచ కరెన్సీలతో డాలరు వెనుకడుగుతో డాలరుతో మారకంలో రూపాయి 14 పైసలు బలపడి 81.92 వద్ద ముగిసింది.

చిన్న షేర్లు ఓకే..: మార్కెట్ల బాటలో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 0.5%, 0.35% చొప్పున పుంజుకున్నాయి. ట్రేడైన షేర్లలో 1,860 బలపడితే.. 1,742 నీరసించాయి. నగదు విభాగంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) రూ. 412 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. దేశీ ఫండ్స్(డీఐఐలు) రూ. 1,177 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. టీసీఎస్, ఆర్‌ఐఎల్, ఐసీఐసీఐ తదితర దిగ్గజాల పటిష్ట ఫలితాల కారణంగా సెంటిమెంటు మెరుగైనట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.

స్టాక్ హైలైట్స్

- ప్రభుత్వ బ్యాంక్ కౌంటర్లలో మహారాష్ట్ర, పంజాబ్ సింధ్, యుకో, ఇండియన్ ఓవర్సీస్, సెంట్రల్, ఇండియన్, యూనియన్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా, పంజాబ్ నేషనల్, బ్యాంక్ ఆఫ్ బరోడా 9–2 శాతం మధ్య దూసుకెళ్లాయి.
- క్యూ4లో పటిష్ట ఫలితాల ప్రభావంతో ఐసీఐసీఐ బ్యాంక్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 2.2 శాతం ఎగసి రూ. 905 వద్ద ముగిసింది. 3 కోట్లకుపైగా షేర్లు ట్రేడయ్యాయి. బీఎస్‌ఈలో 4.2 లక్షల షేర్లు చేతులు మారాయి. క్యూ4లో బ్యాంక్ నికర లాభం 28 శాతం జంప్‌చేసి రూ. 9,853 కోట్లకు చేరింది.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర క్యూ4 గుడ్

నికర లాభం రూ. 840 కోట్లకు హైజంప్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 840 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22) క్యూ4లో కేవలం రూ. 355 కోట్లు ఆర్జించింది. ఇందుకు మొండి రుణాలు తగ్గడం, పెరిగిన వడ్డీ రేట్లు సహకరించాయి. మొత్తం ఆదాయం సైతం రూ. 3,949 కోట్ల నుంచి రూ. 5,317 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం రూ. 3,426 కోట్ల నుంచి రూ. 4,495 కోట్లకు బలపడింది. బ్యాంకు బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 1.3 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. మార్చికల్లా స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.94 శాతం నుంచి 2.47 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.97 శాతం నుంచి 0.25 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి 18.14 శాతానికి చేరింది.

నిధుల సమీకరణ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో షేర్ల విక్రయం ద్వారా రూ. 1,000 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు బీవోఎం ఎండీ ఏఎస్ రాజీవ్ పేర్కొన్నారు.

యూనికెమ్‌లో ఇప్కా ల్యాబ్స్‌కు వాటా

డీల్ విలువ రూ.1,034 కోట్లు

న్యూఢిల్లీ: ఔషధ రంగంలో ఉన్న ఇప్కా ల్యాబొరేటరీస్ తాజాగా యూనికెమ్ ల్యాబొరేటరీస్‌లో 33.38 శాతం వాటా కొనుగోలు చేస్తోంది. ఈ డీల్ విలువ రూ.1,034 కోట్లు. యూనికెమ్ ప్రమోటర్ నుంచి 2,35,01,440 షేర్లను ఒక్కొక్కటి రూ.440 చొప్పున ఇప్కా దక్కించుకుంటోంది. అలాగే యూనికెమ్‌లో పబ్లిక్ షేర్ హోల్డర్ల నుంచి మరో 26 శాతం వరకు వాటాలను ఒక్కో షేరుకు రూ.440 చెల్లించి కొనుగోలు చేసేందుకు ఇప్కా ఓపెన్ ఆఫర్ ఇవ్వనుంది. ఎంచుకున్న వృద్ధి మార్కెట్లలో కంపెనీ పోర్ట్‌ఫోలియోను మెరుగుపరచడానికి తాము నిర్దేశించుకున్న వ్యూహానికి అనుగుణంగా ఈ డీల్ ఉందని ఇప్కా ల్యాబొరేటరీస్ ప్రమోటర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ప్రేమ్‌చంద్ గోధా ఈ సందర్భంగా తెలిపారు. 1949లో ఇప్కా ప్రారంభం అయింది. కంపెనీ మొత్తం ఆదాయంలో ఎగుమతుల వాటా 50 శాతం. ఫినిష్డ్ డోసెజెస్, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్‌ను తయారు చేస్తోంది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీపీఎస్సీలో 21 పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ సర్వీసుకు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో(ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్) లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 21
» **సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** ఆటోమొబైల్ ఇంజనీరింగ్–02, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్–01, కెమికల్ ఇంజనీరింగ్–01, సివిల్ ఇంజనీరింగ్–05, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్–01, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్–04, ఇంగ్లిష్–03, మ్యాథ్స్–01, మెకానికల్ ఇంజనీరింగ్–02, మైనింగ్ ఇంజనీరింగ్–01.
» **అర్హత:** సంబంధిత బ్రాంచిలో బీఈ, బీటెక్, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ విభాగానికి పీజీతో పాటు ఇంగ్లిష్ టైప్‌రైటింగ్ హయ్యర్ గ్రేడ్, షార్ట్‌హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, మెరిట్, మౌఖిక పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.04.2023 నుంచి 17.05.2023 వరకు
» **ఫీజు చెల్లించడానికి చివరితేది:** 16.05.2023.
» **వెబ్‌సైట్:** www.psc.ap.gov.in

తెలంగాణ గురుకులాల్లో 868 డిగ్రీ లెక్చరర్, పీడీ, లైబ్రేరియన్ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్‌ఈఐఆర్‌బీ) తెలంగాణ సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థ(డిగ్రీ కళాశాలలు)ల్లో డైరెక్ట్ ప్రాతిపదికన డిగ్రీ లెక్చరర్, పీడీ, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 868
» **పోస్టుల వివరాలు:** డిగ్రీ లెక్చరర్–793, ఫిజికల్ డైరెక్టర్–39, లైబ్రేరియన్–36.
» **సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** తెలుగు–55, ఇంగ్లిష్–69, మ్యాథ్స్–62, స్టాటిస్టిక్స్–58, ఫిజిక్స్–46, కెమిస్ట్రీ–69, బోటనీ–38, జువాలజీ–58, కంప్యూటర్ సైన్స్–99, జియాలజీ–06, బయోకెమిస్ట్రీ–03, బయో టెక్నాలజీ–02, హిస్టరీ–28, ఎకనామిక్స్–25, పొలిటికల్ సైన్స్–27, కామర్స్–93, జర్నలిజం–02, సైకాలజీ–06, మైక్రోబయాలజీ–17, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్–09, సోషియాలజీ–07, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్–14.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో పీజీతో పాటు నెట్/స్లెట్/సెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. » **వేతనం:** నెలకు రూ.58,850 నుంచి రూ.1,37,050 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్షలు(పేపర్–1, పేపర్–2), డెమానిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 17.04.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.05.2023
» **వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

ఎన్‌టీపీసీ లిమిటెడ్‌లో 152 పోస్టులు

జార్ఖండ్ రాష్ట్రం రాంచీలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌టీపీసీ).. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 152
» **పోస్టుల వివరాలు:** మైన్ ఓవర్‌మ్యాన్–84, ఓవర్‌మ్యాన్(మ్యాగజైన్)–07, మెకానికల్ సూపర్‌వైజర్–22, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్–20, ఒకేషనల్ ట్రెనింగ్ ఇన్‌స్ట్రక్టర్–03, మైన్ సర్వే–09, మైనింగ్ సర్దార్–07.
» **అర్హత:** పోస్టును అనుసరించి 12వ తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 25 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాత, నైపుణ్యం/సామర్థ్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.05.2023
» **వెబ్‌సైట్:** www.ntpc.co.in

బీఎస్‌ఎఫ్‌లో 247 హెడ్‌కానిస్టేబుల్ పోస్టులు

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్‌ఎఫ్) గ్రూప్–సి కేటగిరీలో హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 247
» **పోస్టుల వివరాలు:** హెడ్ కానిస్టేబుల్(రేడియో ఆపరేటర్)–217, హెడ్ కానిస్టేబుల్(రేడియో మెకానిక్)–30.
» **అర్హత:** పోస్టును అనుసరించి 60 శాతం మార్కులతో పదో తరగతి, ఐటీఐ లేదా ఇంటర్మీడియట్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.25,500 నుంచి రూ.81,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, డిక్టేషన్ టెస్ట్, పేరాగ్రాఫ్ రీడింగ్ టెస్ట్(హెచ్‌సీఆర్‌వోలకు మాత్రమే), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.05.2023
» **రాతపరీక్ష తేది:** 04.06.2023.
» **వెబ్‌సైట్:** www.bsf.gov.in

కేంద్రంలో మెడికల్ ఆఫీసర్

ఎంబీబీఎస్ సర్టిఫికెట్‌తోనే.. సుస్థిర కొలువు, సమున్నత భవిష్యత్తు సొంతం చేసుకునే అరుదైన అవకాశం! అది కూడా కేంద్ర ప్రభుత్వంలో మెడికల్ ఆఫీసర్‌గా కొలువు!! యూపీఎస్సీ తాజాగా కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎంఎస్‌ఈ)-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు విభాగాల్లో.. మొత్తం 1,261 మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేయనుంది. ఈ నేపథ్యంలో.. సీఎంఎస్ ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, పరీక్షలో విజయానికి మార్గాలు తదితర వివరాలు..

» ఎంబీబీఎస్ ఉత్తీర్ణులకు కేంద్ర కొలువుల పిలుపు
» సీఎంఎస్ఈ-2023 ఎంపిక ప్రక్రియ ప్రారంభం
» నాలుగు విభాగాల్లో మొత్తం 1,261 పోస్టులు
» రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా నియామకం
» రూ.56,100- రూ.1,77,500 పే స్కేల్‌తో ప్రారంభ వేతనం



యూపీఎస్సీ సీఎంఎస్ఈ-2023

ఎంబీబీఎస్.. వైద్య రంగంలో కెరీర్ ప్రారంభించడానికి మొదటి దశ. ప్రస్తుత పరిస్థితుల్లో ఎంబీబీఎస్‌తోపాటు పీజీ, సూపర్ స్పెషాలిటీ వంటి కోర్సులు పూర్తి చేస్తేనే వైద్య రంగంలో సుస్థిర అవకాశాలు లభిస్తాయి.కానీ..యూపీఎస్సీ సీఎంఎస్ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. ఎంబీబీఎస్ అర్హతతోనే ఉన్నత స్థాయి కొలువు సొంతమవుతుంది.

మొత్తం పోస్టులు 1,261

- ప్రతి ఏటా సీఎంఎస్ఈ ద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు విభాగాల్లో వైద్య పోస్టులను భర్తీ చేస్తారు. తాజాగా.. నాలుగు విభాగాల్లో రెండు కేటగిరీలుగా మొత్తం 1,261 పోస్టుల భర్తీకి సీఎంఎస్ నోటిఫికేషన్ విడుదలైంది.
- **కేటగిరీ–1:** సెంట్రల్ హెల్త్ సర్వీస్‌లో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్– 584
- **కేటగిరీ–2:** రైల్వేస్‌లో అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు–300
- ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్లలో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ (గ్రేడ్–2) పోస్టులు – 376; న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్‌లో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులు–1.

అర్హత

ఎంబీబీఎస్ ఉత్తీర్ణత ఉండాలి. కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్వ్యూ సమయానికి సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుంది. కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్‌లో ఉన్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇలాంటి అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ పూర్తయ్యాకే అపాయింట్‌మెంట్ ఖరారు చేస్తారు.

వయసు

ఆగస్ట్ 1,2023 నాటికి 32 ఏళ్లు మించకూడదు(ఆగస్ట్ 2, 1991 తర్వాత జన్మించి ఉండాలి). సెంట్రల్ హెల్త్ సర్వీసెస్‌లో జూనియర్ టైమ్ స్కేల్ పోస్టుల అభ్యర్థులు ఆగస్ట్ 1,2023 నాటికి 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ

- కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ద్వారా ఆయా శాఖల్లో పోస్టుల భర్తీకి రెండు దశలలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ.
- తొలి దశలో రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా 1:2 నిష్పత్తిలో తదుపరి దశ పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఈ రెండింటిలోనూ చూపిన ప్రతిభ ఆధారంగా తుది విజేతల జాబితా రూపొందించి వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

రాత పరీక్ష.. 500 మార్కులు

- కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్‌లో తొలి దశ రాత పరీక్షను.. రెండు పేపర్లుగా 500 మార్కులకు నిర్వహిస్తారు. ఒక్కో పేపర్‌కు 250 మార్కులు కేటాయిస్తారు.
- **పేపర్–1: జనరల్ మెడిసిన్ అండ్ పిడియాట్రిక్స్:** ఈ పేపర్‌లో జనరల్ మెడిసిన్ నుంచి 96 ప్రశ్నలు, పిడియాట్రిక్స్ నుంచి 24 ప్రశ్నలు అడుగుతారు. ఇలా మొత్తం 120 ప్రశ్నలు అడుగుతారు.
- పేపర్–2ను మూడు భాగాలుగా వర్గీకరించారు. అవి.. ఎ) సర్జరీ, బి) గైనకాలజీ అండ్ ఆబ్‌స్టెట్రిక్స్, సి) ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్.
- ఒక్కో విభాగం నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. మొత్తం మార్కులు 120.
- రెండు పేపర్లలోని ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. • నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కును నెగెటివ్ మార్క్‌గా నిర్దేశించారు.

100 మార్కులకు పర్సనాలిటీ టెస్ట్

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. మలి దశలో అభ్యర్థులకు పర్సనాలిటీ టెస్ట్(ఇంటర్వ్యూ) నిర్వహిస్తారు. ఈ పరీక్షకు కేటాయించిన మార్కులు 100. పర్సనాలిటీ టెస్ట్‌కు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో.. ఆయా శాఖల్లోని పోస్టుల సంఖ్యను అనుసరించి.. 1:2 లేదా 1:2.5 నిష్పత్తిలో రాత పరీక్ష నుంచి పర్సనాలిటీ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. ఈ పర్సనాలిటీ టెస్ట్‌లో అభ్యర్థుల్లోని జనరల్ నాలెడ్జ్‌ను, వైద్య రంగం పట్ల వారికున్న సేవా దృక్పథాన్ని, వ్యక్తిత్వాన్ని, నాయకత్వ నైపుణ్యాలను పరిశీలిస్తారు. ఇందులోనూ ప్రతిభ చూపితే తుది జాబితాలో చోటు సంపాదిస్తే.. కొలువు ఖరారైనట్లే.

విజయం సాధించాలంటే

- జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్ అంశాలు ఉండే పేపర్–1లో విజయానికి అభ్యర్థులు కార్డియాలజీ, రెస్పిరేటరీ డిసీజెస్, గ్యాస్ట్రో ఇంటెస్టినల్, జెనిటో యురినరీ, న్యూరాలజీ, హెమటాలజీ, ఎండోక్రినాలజీ, మెటబాలిక్ డిసీజెస్, ఇన్ఫెక్షన్స్–కమ్యూనికబుల్ డిసీజెస్, న్యూట్రిషన్/గ్రోత్, డెర్మటాలజీ, మస్కులో–స్కెలిటల్ సిస్టమ్, సైకియాట్రీ, జనరల్ మెడిసిన్ అంశాలపై దృష్టి పెట్టాలి.
- కామన్ చైల్డ్‌హుడ్ ఎమర్జెన్సీస్, బేసిక్ న్యూబార్న్ కేర్, నార్మల్ డెవలప్‌మెంటల్ మైల్ స్టోన్స్, ఇమ్యునైజేషన్ ఇన్ చిల్డ్రన్, ప్రత్యేక అవసరాలున్న చిన్నారులను గుర్తించడం, వారికి కల్పించే చికిత్స మార్గాలు, విధానాలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

పేపర్-2కు ఇలా

- **సర్జరీ:** జనరల్ సర్జరీకి సంబంధించి గాయాలు, కాలేయం, రక్త నాళాలు, పేగులు, కణితులు, ఉదర సంబంధ సమస్యలు తదితర సమస్యలకు సంబంధించిన శస్త్రచికిత్సల అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. వీటితోపాటు యూరలాజికల్ సర్జరీ, న్యూరో సర్జరీ, ఈఎన్‌టీ సర్జరీ, థొరాసిక్ సర్జరీ, ఆర్థోపెడిక్ సర్జరీ, ఆప్తమాలజీ, అనస్థీసియాలజీ, ట్రామటాలజీ అంశాలను ఔపోసన పట్టాలి.
- **గైనకాలజీ అండ్ ఆబ్‌స్టెట్రిక్స్:** ఈ విభాగానికి సంబంధించి గైనకాలజీలో అప్లయిడ్ అనాటమీ, అప్లయిడ్ ఫిజియాలజీ, జెనిటల్ ట్రాక్ట్‌లో ఇన్ఫెక్షన్లు, నియోప్లాస్మా, గర్భాశయం స్థానంలో మార్పులు, కన్వెన్షనల్ కాంట్రాసెప్టివ్స్, యూడీ, ఓరల్ పిల్స్, ఆపరేటివ్ ప్రొసీజర్, మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- **ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్:** సీఎంఎస్ఈ రాత పరీక్షలో కీలకం విభాగం ఇది. అభ్యర్థులు ఈ విభాగంలో మంచి మార్కుల కోసం సోషల్ అండ్ కమ్యూనిటీ మెడిసిన్, కాన్సెప్ట్ ఆఫ్ హెల్త్, డిసీజ్, ప్రివెంటివ్ మెడిసిన్, హెల్త్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ప్లానింగ్, డెమోగ్రఫీ అండ్ హెల్త్ స్టాటిస్టిక్స్, ఎన్విరాన్‌మెంటల్ హెల్త్, న్యూట్రిషన్ అండ్ హెల్త్, ఆక్యుపేషనల్ హెల్త్, జెనిటిక్స్ అండ్ హెల్త్, ఇంటర్నేషనల్ హెల్త్, మెడికల్ సోషియాలజీ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్, నేషనల్ ప్రోగ్రామ్స్ అంశాలపై ప్రత్యేక శ్రద్ధతో చదవాలి.

వైరస్‌లు, వ్యాక్సీన్లపై ప్రత్యేక దృష్టి

సీఎంఎస్ఈ అభ్యర్థులు సమకాలీన ఆరోగ్య సమస్యలు ముఖ్యంగా వైరస్‌లు, వాటి సంక్రమణ తీరు, వ్యాక్సీన్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టితో అభ్యసనం చేయాలి. ప్రధానంగా కోవిడ్ పరిస్థితులు, వ్యాక్సీన్లు, వ్యాక్సీన్ ప్రయోగాలు, తదితర అంశాల గురించి సమాచారం తెలుసుకోవాలి. అదే విధంగా అంతర్జాతీయంగా కోవిడ్ ప్రభావానికి గురైన దేశాలు, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గణాంకాలు, నివేదికలు, యూఎన్ఓ నివేదికల్లోని ముఖ్యాంశాలపైనా పట్టు సాధించాలి.

ఎంబీబీఎస్ అకడమిక్స్

సీఎంఎస్ఈ తొలి దశ రాత పరీక్షలో మెరుగైన మార్కులు పొందడానికి అభ్యర్థులు తమ అకడమిక్ పుస్తకాలపై ఎక్కువగా ఆధారపడొచ్చు. ముందుగా పరీక్ష సిలబస్‌ను పరిశీలించి.. అందులోని టాపిక్స్‌ను అకడమిక్స్‌లోని అంశాలతో బేరీజు వేసుకుంటూ అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో చదవాలి. అదే విధంగా పాత ప్రశ్న పత్రాల సాధన కూడా ఎంతో ఉపకరిస్తుంది.

ప్రొబేషన్ విధానం

ఆయా విభాగాల్లో సర్వీస్‌లో చేరిన వారు నిర్దిష్ట వ్యవధిలో ప్రొబేషన్‌గా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రొబేషన్ సమయంలో సంతృప్తికరమైన పనితీరు కనబర్చిన వారికే శాశ్వత కొలువు ఖరారవుతుంది. ఇండియన్ రైల్వేస్‌లో ఒక ఏడాది వ్యవధిలో, మిగిలిన విభాగాల్లో రెండేళ్ల వ్యవధిలో ప్రొబేషన్ ఉంటుంది. దీంతోపాటు ఇండియన్ రైల్వేస్‌లో ప్రొబేషన్‌తోపాటు ఫౌండేషన్ కోర్సు విధానాన్ని కూడా అమలు చేస్తున్నారు. ప్రొబేషన్ పూర్తి చేసుకున్న వారిని జూనియర్ టైం స్కేల్ ఆఫీసర్లుగా శాశ్వత ప్రాతిపదికగా విధుల్లోకి తీసుకుంటారు.

సీఎంఎస్ఈ-2023 ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: మే 9, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: మే 10–16
- సీఎంఎస్ఈ పరీక్ష తేదీ: జూలై 16
- తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం
- వివరాలకు వెబ్‌సైట్: www.upsc.gov.in
- ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్: https://upsconline.nic.in

క్లుప్తంగా...

జేఈఈ తుది కీ విడుదల.. నేడు ర్యాంకులు

సాక్షి, హైదరాబాద్: ఐఐటీలు, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్) ప్రశ్నపత్రం తుది కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సోమవారం విడుదల చేసింది. తుది కీ ఇచ్చిన కొన్ని గంటల్లో ఎన్‌టీఏ ఫలితాలు, ర్యాంకులు విడుదల చేయడం సాధారణం. కానీ ఈసారి అర్ధరాత్రి వరకూ విడుదల చేయలేదు. ఫలితాలు మంగళవారం వచ్చే వీలుంది. రెండో దఫా మెయిన్ పరీక్ష ఈ నెల 15తో ముగిసింది. జనవరిలో మొదటి విడత పరీక్ష నిర్వహించారు. దీంతో అడ్వాన్స్‌కు వెళ్లే అర్హత మార్కుల కటాఫ్‌ను ఖరారు చేసే వీలుంది. జేఈఈ మెయిన్‌కు దేశవ్యాప్తంగా 10 లక్షల మంది వరకూ హాజరయ్యారు. వీరిలో 2.5 లక్షల మంది అడ్వాన్స్‌డ్‌కు వెళ్తారు. ఇందులో వచ్చే ర్యాంకును బట్టి ఐఐటీల్లో సీట్లు వస్తాయి.

నేటి నుంచి బడులకు వేసవి సెలవులు..

జూన్ 12న తెరుచుకోనున్న పాఠశాలలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మంగళవారం నుంచి వేసవి సెలవులు అమలవుతాయి. దీంతో అన్ని బడులూ జూన్ 11వరకు మూతపడి, 12న తిరిగి తెరుచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో చివరి దినమైన సోమవారం పాఠశాలల్లో ఉపాధ్యాయులు పేరెంట్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈసారి జిల్లా స్థాయిలో కంప్యూటరీకరించి ఆన్‌లైన్‌లో ఉంచిన ప్రోగ్రెస్ కార్డులను ఉపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందించారు. 1-9 విద్యార్థుల అన్ని స్థాయిల పరీక్షల మార్కులు, ఏడాది పొడవునా విద్యార్థి పురోగతి, నడవడికతో కూడిన అనేక అంశాలను అందులో పొందుపరిచారు. విద్యార్థి లోపాలు, అధిగమించాల్సిన అంశాలు, వేసవి సెలవుల్లో నేర్చుకోవాల్సిన విషయాలను ప్రోగ్రెస్ కార్డుల్లో సూచించారు.

3 నెలల్లో ఆర్టీసీ ఎన్నికలు నిర్వహించండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలను 3 నెలల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రెండేళ్లకోసారి జరగాల్సిన గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ హైకోర్టును ఆశ్రయించింది. కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్, ఆర్టీసీ ఎండీతోపాటు పలువురిని ఈ పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చింది. అంతకు ముందు 2016లో ఎన్నికలు జరిగాయని, 2018లో ఆ సంఘం కాల పరిమితి ముగిసిందని వెల్లడించింది. వెంటనే టీఎస్ఆర్టీసీ సంఘం ఎన్నికలు నిర్వహించేలా సర్కార్‌ను ఆదేశించాలని ఎంప్లాయిస్ యూనియన్ నేత కె.రాజిరెడ్డి కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా.. 3 నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేశారు.

27న నర్సింగ్ కొలువులపై అవగాహన

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో నర్సింగ్ కొలువుల అవకాశాలపై ఈ నెల 27న అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు టామ్‌కామ్ ఒక ప్రకటనలో తెలిపింది. కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ అయిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) కార్యాలయ ఆవరణలో దీన్ని నిర్వహించనున్నట్టు పేర్కొంది. ప్రధానంగా జర్మనీలో నర్సింగ్ కొలువుల అవకాశాల గురించి వివరించనున్నారు. వివరాలకు 9908830438, 7901290580, 9502894238 నంబర్లలో సంప్రదించాలని లేదా టామ్‌కామ్ యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

డీఎంఈ నియామక జీవోను రద్దు చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(డీఎంఈ)గా రమేశ్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు కొట్టివేసింది. 2017, జూలై 3న ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 603 చట్ట విరుద్ధమని హెల్త్‌కేర్ రీఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్ గత నెల పిటిషన్ దాఖలు చేసింది. 2002లో ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 154లోని మెడికల్ సర్వీస్ రూల్స్‌కు, తర్వాత 2008లో జారీ చేసిన నిబంధనలకు ఇది విరుద్ధమని పేర్కొంది. తాత్కాలిక ప్రాతిపదికన డీఎంఈని నియమించి దాదాపు ఐదేళ్లకుపైగా కొనసాగించడం సరికాదంది. దీనిపై వాదనలు విన్న హైకోర్టు.. ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేసింది.

మెరుగుపడని శరత్‌బాబు ఆరోగ్యం

సాక్షి, హైదరాబాద్: సీనియర్ నటుడు శరత్‌బాబు ఆరోగ్య పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రాలేదు. 6 రోజులుగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నప్పటికీ ఆయన ఆరోగ్యం మెరుగుపడలేదని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఆసుపత్రిలో చేరేటప్పటికే ఆయన సెప్సిస్ (తీవ్రమైన ఇన్ఫెక్షన్)కి గురయ్యారని పేర్కొన్నాయి. రక్త సరఫరా ఉండే ప్రతీ అవయవాన్ని ఇన్ఫెక్షన్‌కు గురిచేసే సెప్సిస్ వల్ల స్వల్ప వ్యవధిలోనే ఆయన అవయవాలన్నీ వైద్యానికి స్పందించలేని స్థితికి చేరాయని అంటున్నారు.


'రింగు' భూమి | కేంద్రం ఖాతాలోకి..

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి ఎన్‌హెచ్‌ఏఐ అలైన్‌మెంట్ ఖరారు చేసి గుర్తించిన భూములు ఇక కేంద్ర ప్రభుత్వ పరమైనట్టే. వాటిపై ఇంతకాలం వాటి యజమానులకు ఉన్న హక్కులు రద్దయ్యాయి. ఈ మేరకు కేంద్రప్రభుత్వ భూసేకరణ చట్టంలోని సెక్షన్ 3డీ ప్రకారం గుర్తిస్తూ కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల సంస్థ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

➡ ఉత్తర భాగం పరిధిలో.. భూసేకరణకు ఎనిమిది అథారిటీ(కాంపిటెంట్ అథారిటీ ఫర్ లాండ్ అక్విజిషన్-కాలా)లు ఉండగా, ఈనెల 18వ తేదీతో యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదాద్రి భువనగిరి, చౌటుప్పల్, సంగారెడ్డి జిల్లాలోని ఆందోల్-జోగిపేట కాలాలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి.

కీలక 3డీ గెజిట్ నోటిఫికేషన్ జారీ

- పట్టాదారుల హక్కు రద్దు
- యాదాద్రి-భువనగిరి, చౌటుప్పల్, ఆందోల్-జోగిపేట కాలా అథారిటీలకు వెల్లడి
- పరిహారంలో రాష్ట్రప్రభుత్వ వాటా చెల్లింపుపై కుదిరిన సయోధ్య
- ఢిల్లీలో కేంద్ర, రాష్ట్ర అధికారుల చర్చలు.. ఒప్పందంపై సంతకాలు ఆమేరకు గెజిట్ విడుదలకు లైన్ క్లియర్
- త్వరలో అవార్డ్ పాస్.. పట్టాదారుల బ్యాంకు ఖాతాల్లో పరిహారం
- వచ్చేనెల 9 వరకు అభ్యంతరాల దాఖలుకు అవకాశం



ఎట్టకేలకు కుదిరిన రాజీ..

రీజినల్ రింగ్‌రోడ్డు ఉత్తరభాగంలో 1,58.62 కి.మీ. నిడివికి గాను దాదాపు 2 వేల హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. ఇందుకు రూ.5,170 కోట్ల వరకు ఖర్చవుతుందని జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఈ ప్రాజెక్టు బడ్జెట్‌లో అంచనా వేసింది. అందులో సగ భాగాన్ని రాష్ట్రప్రభుత్వం భరించాల్సి ఉంది. రూ.2,585 కోట్లు భూసేకరణకు, రూ.363.43 కోట్లు స్తంభాలు వంటి వాటిని తరలించేందుకు అయ్యే వ్యయంగా జమ చేయాలంటూ ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్ సంతోశ్‌కుమార్ యాదవ్ గతేడాది రాష్ట్రప్రభుత్వానికి లేఖ రాశారు. సాధారణంగా 3డీ గెజిట్ నోటిఫికేషన్లు జారీ అయ్యాక అవార్డ్ పాస్ చేసే సమయంలో ఈ మొత్తాన్ని జమ చేయాల్సి ఉంటుందని, అడ్వాన్సుగా చెల్లించటమెందుకంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించింది. అయినా, ఎన్‌హెచ్‌ఏఐ లేఖలు రాస్తూనే వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవటంతో 3డీ గెజిట్ విడుదలలో జాప్యం జరిగింది. గతేడాది ఏప్రిల్‌లో మూడు, ఆగస్టులో ఐదు కాలాలకు 3ఏ గెజిట్ విడుదల చేసిన ఎన్‌హెచ్‌ఏఐ, నెలలు గడుస్తున్నా భూసేకరణ ప్రక్రియలో కీలకమైన 3డీ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. దీంతో కేంద్ర-రాష్ట్రప్రభుత్వాల మధ్య మాటల యుద్ధం వరకు వెళ్లి ఒకదశలో ప్రాజెక్టు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఈ తరుణంలో ఇటీవల కేంద్ర-రాష్ట్రప్రభుత్వాల మధ్య దీని విషయంలో ఎట్టకేలకు రాజీ కుదిరింది. ఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఏఐ ఉన్నతాధికారులతో రాష్ట్ర రవాణా, రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారులు చర్చించి ఒప్పందం కుదుర్చుకున్నారు. రాష్ట్ర బడ్జెట్లో ఈ ప్రాజెక్టు కోసం రూ.500 కోట్లు కేటాయించామని, దాన్ని దశలవారీగా విడుదల చేస్తామని, ముందుగా రూ.100 కోట్లు డిపాజిట్ చేస్తామన్న రాష్ట్రప్రభుత్వ అధికారుల ప్రతిపాదనను ఎన్‌హెచ్ఏఐ అధికారులు సానుకూలంగా స్వీకరించారు. దీంతో ఎన్‌హెచ్‌ఏఐ 3 డీ గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసింది.

పట్టాదారు పేర్లతో..

రీజినల్ రింగురోడ్డు నిర్మించే అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే భూములను గుర్తించి గతంలోనే సర్వే చేసిన అధికారులు.. తాజా గెజిట్ నోటిఫికేషన్‌లో ఊరు, సర్వే నంబరు, భూమి విస్తీర్ణం, పట్టాదారు పేరు.. ఇలా పూర్తి వివరాలను గెజిట్ నోటిఫికేషన్‌లో ప్రచురించారు. వచ్చే నెల 9వ తేదీ వరకు అభ్యంతరాలను అందించవచ్చని నోటిఫికేషన్‌లో వెల్లడించారు. ఇంతకు ముందు ప్రాథమిక నోటిఫికేషన్ల సమయంలో అభ్యంతరాలను స్వీకరించి, పరిశీలించి చివరకు వాటిని అనుమతించలేదంటూ తాజా నోటిఫికేషన్‌లో వెల్లడించటం గమనార్హం. నిర్ధారిత భూమి పూర్తిగా కేంద్రప్రభుత్వ అధీనంలోకి వచ్చిందంటూ కొత్త నోటిఫికేషన్‌లో పేర్కొన్నందున, ఇప్పుడు కొత్తగా వచ్చే అభ్యంతరాల ప్రభావం ఎంతుంటుందనేది ప్రశ్నార్థకమే.

ఇక అవార్డు పాస్ చేయటమే..

చట్టంలోని 3డీ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైనందున ఇక అవార్డు పాస్ చేయటమే తరువాయి. ఇప్పటికే ఊళ్ల వారీగా సర్వేనెంబర్లతో పట్టాదారుల పేర్లను, భూ విస్తీర్ణాన్ని గుర్తించి సర్వే చేసిన అధికారులు.. వాటిని మరోసారి వెరిఫై చేసి నోటీసులు జారీ చేయనున్నారు. పట్టాదారు బ్యాంకు ఖాతాల్లో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేస్తారు. అభ్యంతరాలతో.. దాన్ని తీసుకునేందుకు నిరాకరించే వారి పేరుతో సంబంధిత కోర్టులో ఆ మొత్తాన్ని డిపాజిట్ చేస్తారు.

కాలాల వారీగా ఊళ్లు.. సేకరించే భూ విస్తీర్ణం ఇలా..

యాదాద్రి-భువనగిరి
రోడ్డులో 98వ కి.మీ. నుంచి 118 కి.మీ. వరకు దీని పరిధి
ఇందులో సేకరించే మొత్తం భూమి విస్తీర్ణం 184.961 హెక్టార్లు
ఊళ్లు: వీరారెడ్డిపల్లె, ఇబ్రహీంపూర్, కోనాపురం, దత్తాయపల్లె, వేల్పులపల్లె, మల్లాపూర్, దాతర్‌పల్లె

ఆందోల్-జోగిపేట
రోడ్డు నిడివిలో 9.56 కి.మీ. నుంచి 18.18 కి.మీ. పరిధి
మొత్తం భూ విస్తీర్ణం 94.38 హెక్టార్లు
ఊళ్లు: శివంపేట, వెండికోల్, అంగడి కిష్టాపూర్, లింగంపల్లె, కోర్పోల్

చౌటుప్పల్
రోడ్డు నిడివిలో 133.17 కి.మీ. నుంచి 158.64 కి.మీ. వరకు
మొత్తం సేకరించే భూ విస్తీర్ణం 225.02 హెక్టార్లు
గ్రామాలు: పహిల్వాన్‌పూర్, రెడ్లరేపాక, పొద్దటూరు, వెర్కటపల్లె, గోకారం, నేలపట్ల, చిన్నకొండూరు, చౌటుప్పల్, తలసింగారం, లింగోజిగూడ

నెలన్నర అయినా ఫలితం లేదు

- టీఎస్‌పీఎస్సీ లీకేజీ కేసులో సిట్ తీరును తప్పుబట్టిన హైకోర్టు
- ఏం చేయాలో 28న నిర్ణయిస్తామన్న ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) ప్రశ్నపత్రం లీకేజీ కేసు దర్యాప్తులో నెలన్నర గడిచినా.. ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నిందితుల వాంగ్మూలం నమోదు చేయడం తప్ప ఎలాంటి ఫలితాన్ని రాబట్టకపోవడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ప్రశ్నపత్రం లీకేజీ కేసుపై ప్రస్తుత సిట్ విచారణ కొనసాగిస్తుందా, సీబీఐ లేదా ఇతర స్వతంత్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలా, సిట్‌కు ఏదైనా మార్గదర్శకాలు ఇవ్వాలా, సీనియర్ ఐపీఎస్‌ను సిట్‌లో చేర్చాలా అనే విషయాలను తదుపరి విచారణ తేదీన నిర్ణయిస్తామని స్పష్టం చేసింది. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరై ఉత్తీర్ణులైన అభ్యర్థులు, వారి తల్లిదండ్రుల మనోవేదనను సిట్, రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలని అభిప్రాయపడింది. అయితే లీకేజీ తర్వాత పరీక్షల వాయిదా, తిరిగి నిర్వహణను సమర్థించింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. పేపర్ లీకేజీ కేసును సిట్ పారదర్శకంగా దర్యాప్తు చేయలేదని, సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌తోపాటు మరో ఇద్దరు నిరుద్యోగులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. సిట్ తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) బీఎస్ ప్రసాద్, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వివేక్ ఠంకా వాదనలు వినిపించారు.

40 మందిని విచారించాం..

'ఈ కేసుతో సంబంధం ఉన్న 20 మందిని అరెస్టు చేశాం. దర్యాప్తులో భాగంగా 40 మందిని విచారించాం. 12 కంప్యూటర్లు సీజ్ చేశాం. వాటిని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపాం. ఆ సమాచారం రావాల్సి ఉంది. సిట్ పారదర్శకంగా దర్యాప్తు చేస్తోంది. పిటిషనర్లు సీబీఐ లేదా ఇతర స్వతంత్ర దర్యాప్తు కోరాల్సిన అవసరం లేదు. అభ్యర్థులను దృష్టిలో పెట్టుకొనే ప్రభుత్వం పరీక్షలు రద్దు చేసింది. ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులు మళ్లీ పరీక్షల్లో రాణిస్తారు'అని ఏజీ వివరించారు. ప్రతిపక్ష నేతలకు సిట్ నోటీసులు ఎందుకు జారీ చేస్తోందని ఏజీని న్యాయమూర్తి ప్రశ్నించగా, ప్రశ్నపత్రం లీకేజీపై వారు మీడియాతో మాట్లాడుతుడటంతో వారి వద్ద ఏదైనా సమాచారం ఉందన్న కోణంతో పిలిచారని ఏజీ చెప్పారు. 'టెక్నికల్ కోణంలో విచారణ జరగాల్సి ఉన్న ఈ కేసులో దీనిపై అవగాహన ఉన్నవారు సిట్ సభ్యుల్లో ఎవరూ లేరు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శిని సిట్ కార్యాలయానికి పిలవకుండా వారి వద్దకు వెళ్లి విచారణ చేయడం ఎంతవరకు సబబు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని సిట్ విచారణను సీబీఐకి బదిలీ చేయాలి'అని ఠంకా కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీవద్దు: డీజీపీ



సాక్షి, హైదరాబాద్: పెరిగిపోతున్న వ్యవస్థీకృత నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేకుండా పనిచేయాలని పోలీస్ అధికారులు, సిబ్బందిని డీజీపీ ఆదేశించారు. రాష్ట్రంలో నేరాలపై సమీక్ష, ఫంక్షన్ వర్టికల్స్ అమలుపై సోమవారం అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సమావేశంలో సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, మహిళాభద్రతా విభాగం అడిషనల్ డీజీ షికా గోయల్‌తో కలిసి పలు సూచనలు ఇచ్చారు. అంజనీకుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై బాధితులు ఇచ్చే ప్రతి ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నేరాల నమోదు నిర్ధారిత ప్రమాణాలలోనే ఉన్నాయని, వ్యక్తిగత నేరాల మినహా మిగిలిన నేరాలన్నింటిలోనూ తగ్గుదల ఉందని తెలిపారు. సీసీటీవీల ఏర్పాటు కోసం 'నేను సైతం', 'కమ్యూనిటీ పోలీసింగ్'కార్యక్రమాలను ప్రోత్సహించేలా అన్ని జిల్లాల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ ను ఉపయోగించడంపై స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ తెలిపారు.

ఉద్యోగం కాదు.. ఉపాధి కల్పనే లక్ష్యం కావాలి

- యువతకు మంత్రి కేటీఆర్ పిలుపు
- ఉద్యోగం సంపాదించి స్థిరపడాలనే మూస ధోరణిని వీడాలని సూచన
- గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సీఎంఎస్‌టీఈఐ కింద యూనిట్ల పంపిణీ



సీఎంఈఎస్‌టీఈఐ పథకం లబ్ధిదారులకు ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను అందిస్తున్న మంత్రులు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ సాధన బదులు ఉపాధి కల్పనే యువత లక్ష్యం కావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె. తారకరామారావు చెప్పారు. ఉద్యోగం సంపాదించి జీవితంలో స్థిరపడాలనే భావనలో తల్లిదండ్రులు పిల్లల్ని పెంచడం వల్ల.. యువత ఆలోచన విధానం ఇదే విధంగా ఉందని... దీన్నుంచి బయటకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ (సీఎంఈఎస్‌టీఈఐ) పథకం కింద ఎంపికైన 24 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సోమవారం హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో జరిగిన యూనిట్ల పంపిణీలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతనుద్దేశించి ఆయన ప్రసంగించారు. గిరిజన పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని, తాజాగా సీఎంఈఎస్‌టీఐ పథకం లబ్ధిదారులు తెరిచే యూనిట్లకు ఆస్తిపన్ను మినహాయింపు ఇవ్వనున్నట్లు మంత్రి ప్రకటించారు. యూనిట్లు తెరిచి విజయం సాధించిన వారు జూన్ 2న సీఎం కేసీఆర్‌ను కలిసేలా చూస్తానని హామీ ఇచ్చారు.

కులం, మతమంటూ కాలం వృథా చేసుకోవద్దు..

కులమతాలంటూ యువత సమయాన్ని వృథా చేసుకోవద్దని మంత్రి కేటీఆర్ యువతకు సూచించారు. ప్రపంచమంతా టెక్నాలజీతో ముందుకు సాగుతున్న తరుణమని, ఇంకా కులాలు, మతాల గురించి కొట్లాడితే ప్రయోజనం ఉండదన్నారు. ఆత్మన్యూనతా భావాన్ని వదిలేసి ధైర్యంగా ముందుకు సాగాలి. ప్రతి ఒక్కరిలో నైపుణ్యం దాగి ఉంటుంది. దానికి పదును పెడితేనే సత్తా బయటపడుతుంది.' అని ఆయన అన్నారు.

టూరిస్టులు చాలా మాట్లాడుతున్నారు..

'కొందరు టూరిస్టులు (కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశించి) రాష్ట్రానికి వచ్చిపోతూ చాలా మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్‌ను ఓడించి వెంటనే తమకు అధికారం ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశానికి ఏం చేసిందో ముందుగా చెప్పాలి. ఆ తర్వాత రాష్ట్ర అభివృద్ధిపై చర్చించాలి.' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

'కేసీఆర్ పాలనలో గిరిజనులకు స్వర్ణయుగం'

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ పాలన గిరిజనులకు స్వర్ణయుగంగా మారిందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సీఎం ఎస్టీ ఎంట్రప్రెన్యూర్‌షిప్ పథకం కింద ఈ ఏడాది 200 మందికి ఈ అవకాశం కల్పించామని, ఒక్కో యూనిట్‌కు రూ. 50 లక్షల చొప్పున 100 కోట్ల రాయితీ అందిస్తున్నామన్నారు. రూ. 250 కోట్లతో ఈ యూనిట్లను ఏర్పాటు చేయిస్తున్నట్లు మంత్రి వివరించారు. కార్యక్రయంలో హోంమంత్రి మహమూద్ అలీతోపాటు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కోరుకంటి చందర్, ఎమ్మెల్సీలు ప్రభాకర్‌రావు, సురభి వాణీదేవి, ట్రైకార్ చైర్మన్ రామచంద్రునాయక్, జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, గిరిజన సంక్షేమశాఖ శాఖ కార్యదర్శి క్రిస్టీనా జెడ్. చొంగ్తు, అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన కొలువుల్లో | మహిళకు పట్టం!



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో కొలువుల జాతరతో మహిళలకే ఎక్కువ లబ్ధి కలగనుంది. ఈనెల 5వ తేదీన తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) ఒకేసారి 9 నోటిఫికేషన్లు విడుదల చేసింది. గురుకుల పాఠశాలలు, గురుకుల జూనియర్ కాలేజీలు, గురుకుల డిగ్రీ కాలేజీల్లో 9,231 ఉద్యోగాలను ఈ నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయనుంది. తొలుత వెబ్‌నోట్‌లను విడుదల చేసిన టీఆర్ఈఐఆర్‌బీ... ప్రస్తుతం పూర్తిస్థాయి నోటిఫికేషన్లు అందుబాటులోకి తెస్తోంది. తాజాగా విడుదల చేసిన ఏడు నోటిఫికేషన్లకు సంబంధించి 5,081 ఉద్యోగాలున్నాయి. ఇందులో జనరల్ కేటగిరీలో 1062 ఖాళీలుండగా... మహిళలకు ఏకంగా 4019 పోస్టులు రిజర్వ్ అయ్యాయి.

79.1శాతం కొలువులు వారికే...

సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఉద్యోగాలన్నీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారమే కేటాయించినప్పటికీ స్త్రీలకే ఎక్కువ కొలువులు దక్కనున్నాయి. తాజాగా విడుదలైన పూర్తిస్థాయి నోటిఫికేషన్లకు అనుగుణంగా 5,081 ఖాళీలకు సంబంధించి మహిళలకు 79.10శాతం, జనరల్ కేటగిరీలో 20.90శాతం పోస్టులు రిజర్వ్ అయ్యాయి. మహిళలకు కేటాయించిన పోస్టులు మహిళలకే దక్కనుండగా... అర్హత పరీక్షల్లో మెరిట్ సాధించిన మహిళలకు జనరల్ కేటగిరీలోనూ కొలువులు దక్కనున్నాయి. ఇక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో బాలికల పాఠశాలలు, కళాశాలల్లోని కొలువులన్నీ స్త్రీలకు మాత్రమే కేటాయించే నిబంధన ఉంది. దీంతో ఆ సంస్థల్లోని కొలువులు మహిళలకు మాత్రమే దక్కనున్నాయి. ఇకబాలుర పాఠశాలలు,కళాశాలలకు సంబంధించిన కొలువుల్లో 33శాతం రిజర్వేషన్ ద్వారా పోస్టులు కేటాయించారు. రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమల్లోకి రావడంతో రోస్టర్ వరుస మొదటి నుంచి ప్రారంభం కానుంది. దీంతో మొదటి వరుసలో ఎక్కువగా స్త్రీలకు రిజర్వ్ చేసిన పోస్టులే ఉండడంతో వారికి మరింత ఎక్కువ అవకాశం కలిగినట్లు తెలుస్తోంది. రెండు, మూడు రోజుల్లో మ్యూజిక్ టీచర్లకు సంబంధించిన 124 ఖాళీలు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ కేటగిరీలో 4,020 ఖాళీలకు సంబంధించి పూర్తిస్థాయి నోటిఫికేషన్లు అందుబాటులోకి రానున్నాయి. దీంతో పాటు క్రాఫ్ట్ కేటగిరీలో మరో ఆరు ఖాళీల భర్తీపై స్పష్టత రానుంది.

కేటగిరీల వారీగా గురుకుల పోస్టులు ఇలా..

కేటగిరీ	జనరల్	మహిళ	మొత్తం
జూనియర్ లెక్చరర్	454	1470	1924
లైబ్రేరియన్(జూనియర్ కాలేజీ)	8	42	50
ఫిజికల్ డైరెక్టర్(జూ. కాలేజీ)	6	28	34
డిగ్రీ లెక్చరర్	101	692	793
లైబ్రేరియన్(డిగ్రీ కాలేజీ)	3	33	36
ఫిజికల్ డైరెక్టర్(డిగ్రీ కాలేజీ)	3	36	39
ఫిజికల్ డైరెక్టర్	45	230	275
పీజీటీ	310	966	1276
లైబ్రేరియన్	102	332	434
క్రాఫ్ట్ టీచర్	10	78	88
ఆర్ట్ టీచర్	20	112	132
మొత్తం	1062	4019	5081

గురుకుల సొసైటీల పరిధిలో పోస్టుల వారీగా నోటిఫికేషన్లు ఇలా..

నోటిఫికేషన్	పోస్టు కేటగిరీ	ఖాళీలు
01	లెక్చరర్/ఫిజికల్ డైరెక్టర్/లైబ్రేరియన్(డిగ్రీకాలేజీ)	868
02	జూనియర్ లెక్చరర్/ఫిజికల్ డైరెక్టర్/లైబ్రేరియన్(జూనియర్ కాలేజీ)	2008
03	పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ)	1276
04	లైబ్రేరియన్(స్కూల్స్)	434
05	ఫిజికల్ డైరెక్టర్(స్కూల్స్)	275
06	డ్రాయింగ్ టీచర్/ ఆర్ట్ టీచర్	134
07	క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్/క్రాఫ్ట్ టీచర్	92
08	మ్యూజిక్ టీచర్	124
09	ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్	4020

చదువుకుంటూనే సంపాదన!



- వచ్చే ఏడాది నుంచి డిగ్రీలో 14 నైపుణ్య కోర్సులు
- విధివిధానాలపై ఉన్నత విద్యామండలి కసరత్తు
- చదువుకుంటూనే రూ.10 వేల వరకు స్టైపెండ్ పొందే వీలు

సాక్షి, హైదరాబాద్: నైపుణ్యంతో కూడిన డిగ్రీ కోర్సులకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి.. అందుకనుగుణంగా ప్రణాళికను సిద్ధంచేస్తోంది. వచ్చే ఏడాది (2023-24) నుంచి ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేసే వీలుంది. ఈ క్రమంలో ఈనెల 28న వంద కాలేజీల ప్రిన్సిపల్స్, ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహిస్తున్నట్టు మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తెలిపారు. ఏ కాలేజీలో ఏ కోర్సు సాధ్యమనేది చర్చించి, త్వరలో ప్రణాళికను ప్రకటిస్తామని చెప్పారు. ఇప్పటికే సంప్రదాయ డిగ్రీ కోర్సుల స్థానంలో ఇంజనీరింగ్‌తో సమానంగా డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్, ఆనర్స్ కోర్సులను అందుబాటులోకి తెచ్చారు. తాజాగా ప్రవేశపెట్టే నైపుణ్య కోర్సులు డిగ్రీ విద్య స్వరూప స్వభావాల్ని మారుస్తాయని, చదువుతూనే ఉపాధి పొందవచ్చని మండలి అధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన విధివిధానాలనూ తెలంగాణ స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ తయారుచేస్తోందని ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు.

ఏమిటీ కోర్సులు?

కేంద్ర ప్రభుత్వ స్కిల్ ఇండియా పథకంలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ కౌన్సెళ్లుగా సరికొత్త కోర్సులపై అధ్యయనం చేసి.. 14 నైపుణ్య కోర్సులకు రూపకల్పన చేసింది. వీటిలో రిటైల్ మేనేజ్‌మెంట్, క్రియేటివ్ రైటింగ్, ఈ-కామర్స్, లాజిస్టిక్స్, గేమింగ్ అండ్ యానిమేషన్ వంటి కోర్సులున్నాయి. స్కిల్ కోర్సులను రెండు రకాలుగా నిర్వహించాలని యోచిస్తున్నారు. ఫస్టియర్ నుంచే స్కిల్ కోర్సులుండేలా ఒక పథకం, రెండో ఏడాది నుంచి వీటిని అమలు చేయడం మరో విధానంగా తీసుకురానున్నారు.

చదివే సమయంలోనే స్టైపెండ్

డిగ్రీ చదివే సమయంలో స్కిల్ కోర్సులను ప్రాక్టికల్‌గా నేర్పుతారు. ఇందుకు కొన్ని సంస్థలతో ఉన్నత విద్యామండలి ఒప్పందం చేసుకుంటుంది. ఆయా సంస్థల్లో వారానికి మూడు రోజులు విద్యార్థి ప్రాక్టికల్‌గా శిక్షణ పొందుతారు. ఈ సమయంలో రూ.10 వేల వరకూ నెలకు ఉపకార వేతనం అందుతుంది. రాష్ట్రంలో మొత్తం 1,056 డిగ్రీ కాలేజీలున్నాయి. వీటిలో తొలుత 103 ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో స్కిల్ కోర్సులు ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నారు.

టీఎస్‌సెట్-2022 ఫలితాలు విడుదల

అర్హత సాధించిన 2,857 మంది

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ స్టేట్ ఎల్జిబిలిటీ టెస్ట్ (టీఎస్‌సెట్-2022) ఫలితాలను సోమవారం విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 14 నుంచి 17 వరకు జరిగిన అధ్యాపక ఉద్యోగాల అర్హత పరీక్ష(టీఎస్‌సెట్)కు 50,256 మంది దరఖాస్తు చేసుకోగా 40,128 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. అందులో 2,857 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్టు అధికారులు తెలిపారు. లైఫ్‌సైన్స్ సబ్జెక్టుల్లో 402, తెలుగులో 360, ఇంగ్లిష్‌లో 300 మంది అత్యధిక సంఖ్యలో అర్హత సాధించారు. సంస్కృతంలో 12 మంది ఫిలాసఫీ, జాగ్రఫీలో 9, లింగ్విస్టిక్స్‌లో 7 అతితక్కువగా అర్హత సాధించారు. వెబ్‌సైట్ నుంచి నేడు (25న) మార్కుల జాబితాను పొందవచ్చని, అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన తేదీలను త్వరలో ప్రకటిస్తామని అధికారులు పేర్కొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.